
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



పండ్ల ఉత్పత్తిలో
ఏపీ టాప్
రాష్ట్రంలో 8.07లక్షల హెక్టార్లలో ఉద్యాన తోటలు
2024-25లో 1.93 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తి
సూక్ష్మ సేద్యం, రాయితీ పథకాల అమలు ఫలితం
21.05 లక్షల టన్నుల ఉత్పత్తితో తెలంగాణకు 15వ స్థానం
11

బుధవారం | 17-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 281 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి రా.2:33 తదుపరి చతుర్దశి, నక్షత్రం: విశాఖ సా.5:11 తదుపరి అనూరాధ, వర్జ్యం: రా.9:40-11:28, దుర్ముహూర్తం: ఉ.11:49-12:33, అమృతఘడియలు: ఉ.7:16-9:04, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:42, సూర్యాస్తమయం: 5:40 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





శాంతి భద్రతల పరిరక్షణలో..

మంగళవారం రాత్రి పోలీస్ కానిస్టేబుల్ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో సెల్ఫీ తీసుకుంటున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, అనిత. ప్రమాణం చేస్తున్న కొత్తగా ఎంపికైన కానిస్టేబుళ్లు

పోలీస్‌కు సెల్యూట్

60 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి 6,014 ఉద్యోగాలిచ్చాం

రాష్ట్రంలోని మొత్తం 55 వేల కానిస్టేబుళ్లలో 24 వేలమందిని నేనే నియమించా..

డీఎస్సీతో 15,591 మందికి కొలువులిచ్చాం

కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం

20 లక్షల ఉద్యోగాల భర్తీ హామీకి కట్టుబడ్డాం

ట్రైనీ కానిస్టేబుళ్ల స్టైపెండ్ రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచుతున్నాం

సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాలు, డ్రగ్ మాఫియాపై క్రియాశీలకంగా పని చేయాలి: చంద్రబాబు

కొత్త కానిస్టేబుళ్లకు నియామకపత్రాల జారీ

త్యాగాలకు మారుపేరు పోలీసు వ్యవస్థ. బయటకెళ్లిన వారు సురక్షితంగా తిరిగొస్తున్నారంటే అందుకు పోలీసు వ్యవస్థే కారణం. ఒకప్పుడు రాయలసీమలో ముఠా కక్షలు, గొడవలు ఉండేవి. హైదరాబాద్‌లో మత విద్వేషాలు ఉండేవి. గబ్బర్‌సింగ్ లాంటి ఒక పోలీసు అధికారితో వాటిని నియంత్రించాను. తీవ్రవాద సమస్యతో పాటు ప్రజలకు నష్టం కలిగించే ఏ వ్యవస్థనూ నేను ఉపేక్షించలేదు. అందుకే నామీద 24 క్లైమోర్ మైన్స్‌తో దాడి చేశారు. అయినా భయపడలేదు. - సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రైనీ కానిస్టేబుళ్ల స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచుతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. కొత్త కానిస్టేబుళ్లకు ఆయన అభినందనలు తెలిపారు. క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలను కాపాడాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో జరిగిన కానిస్టేబుళ్లకు నియామకపత్రాలు అందజేసే కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. "మీకు ఉద్యోగాలివ్వకుండా రాజకీయ

మిగతా 12వ పేజీలో...

పోలీసులను బెదిరిస్తే ఊరుకోం

ఎవరు రెచ్చిపోయినా ఉపేక్షించం

డిప్యూటీ సీఎం పవన్ హెచ్చరిక

శాంతిభద్రతలపై రాజీ లేదు

కానిస్టేబుల్ కేవలం పోస్టు కాదు.. బాధ్యత: పవన్

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

మరింత మెరుగైన పాలన లక్ష్యంగా నిర్వహణ

బాబు, పవన్ ప్రారంభోపన్యాసం
13

ప్రభుత్వ నియామకాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాల్లో
స్థానికులకు 95%



ఓపెన్ 5 శాతం

1 నుంచి 7 తరగతుల్లో ఎక్కువ ఎక్కడ చదివితే అక్కడే స్థానికత

మొత్తం ఆరు జోన్లుగా రాష్ట్రం

మల్టీజోనల్ పోస్టులుగా సీటీవో, డీఎస్పీ, డిప్యూటీ కలెక్టర్

27 నెలల్లోగా లోకల్, జోన్, మల్టీజోన్ పోస్టుల ప్రకటన

రాష్ట్ర స్థాయి కార్యాలయాల నుంచి కూడా లోకల్, జోన్, మల్టీజోన్ పోస్టులకు బదిలీ

నూతన ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌తో కేంద్రం గెజిట్ నోటిఫికేషన్

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం కొత్త రాష్ట్రపతి ఉత్తర్వు(ప్రెసిడెన్షియల్ ఆర్డర్)ను విడుదల చేసింది. ప్రభుత్వ నియామకాలు, పదోన్నతులు, విద్యాసంస్థల్లో ప్రవేశాల వంటి విషయాల్లో స్థానికతను నిర్ణయించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇందులో 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు, మరో 5 శాతాన్ని ఓపెన్ కోటాగా ఉంచుతూ కేంద్ర హోం శాఖ 'ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్-2025' పేరిట సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్తగా జరిగిన మార్పులేమిటంటే.. గతంలో 4 జోన్లు ఉండగా ఇప్పుడు జిల్లాల సంఖ్య పెరగడంతో 6 జోన్లు చేశారు. వీటిని తిరిగి 2 మల్టీజోన్లుగా విభజించారు. గతంలో రాష్ట్ర కేడర్ పోస్టులుగా ఉన్న సీటీవో, డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ పోస్టులను

మిగతా 12వ పేజీలో...



రూపాయి @ 91

డాలర్ మారకంలో ఆల్‌టైమ్ కనిష్ఠానికి..

బిజినెస్‌లో

ఐపీఎల్ మినీ వేలం..

గ్రీన్‌కు జాక్‌పాట్

ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్‌కు రూ.25 కోట్లు..

అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా రికార్డు
10





జీఎంఆర్-మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఒప్పంద పత్రాలు చూపుతున్న గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు, జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ ఛైర్మన్ బీజీఎస్ రాజు. చిత్రంలో అయ్యన్నపాత్రుడు, రామ్మోహన్‌నాయుడు, లోకేశ్, గంటా శ్రీనివాసరావు, అదితి

మేము మిస్సైళ్లం!

చంద్రబాబు, అశోక్, అయ్యన్న జీపీఎస్‌లు

అభివృద్ధి వికేంద్రీకరణకే కూటమి పెద్దపీట: లోకేశ్

జీఎంఆర్-మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీని ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

విశ్వ పౌరవిమాన దళంలో 25% మనోళ్లే ఉండాలి

ఎడ్యుసిటీకి రూ.వందల కోట్ల భూములను మాన్సాస్ ట్రస్టు ఉచితంగా ఇచ్చింది

పూసపాటి వంశీయుల ఉదారతకిది నిదర్శనం

'జీఎంఆర్-మాన్సాస్' ఎంవోయూకు లోకేశ్ హాజరు

ఇటీవల బిహార్లో సీఎం నితీశ్‌కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్లినప్పుడు.. ఏపీలో గత 18 నెలలుగా ఏదో మ్యాజిక్ జరుగుతోందని, దాని రహస్యం ఏమిటని ఆయన అడిగారు. ఒక కారణం మిస్సైల్ (నేను) అయితే.. రెండోది దానిని గైడ్ చేసే జీపీఎస్ (చంద్రబాబు) అని చెప్పా. ఏ మిస్సైల్ లక్ష్యాన్ని సాధించాలన్నా జీపీఎస్ తప్పనిసరి. - మంత్రి లోకేశ్

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం 'ఒక రాష్ట్రం..ఒకే రాజధాని'ని నమ్ముతూ అభివృద్ధి వికేంద్రీకరణకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఆ దిశగానే పరిపాలన సాగిస్తున్నదని వివరించారు. విజయనగరం జిల్లా భోగాపురం సమీపాన మాన్సాస్ ట్రస్టు భూముల్లో ఏర్పాటుచేసే

మిగతా 14వ పేజీలో...

భారతి సిమెంట్స్‌కు
నోటీసులు

సున్నపురాయి లీజుల రద్దుకు గనులశాఖ చర్యలు

15 రోజుల్లోగా బదులివ్వాలని ఆదేశం

2024లో చట్టవిరుద్ధంగా 50 ఏళ్లకు లీజు

కడప జిల్లాలో 744 ఎకరాలు ధారాదత్తం

న్యాయసలహా పేరిట 'భారతి'కి మేలు

హైకోర్టు తీర్పునకు వక్రభాష్యంతోనే ఆదేశాలు

ఈ ఏడాది మొదట్లో విచారణకు కేంద్రం ఆదేశం

తాజాగా లీజుల రద్దుకు నోటీసులు

ఏసీసీ, రామ్‌కోకు కూడా..


భారతికి భూ హారతి!
సొంత కంపెనీకి జగన్ సంతర్పణ

ఈ ఏడాది జూన్ 10న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సతీమణి భారతి డైరెక్టర్‌గా ఉన్న భారతి సిమెంట్స్‌కు గనుల శాఖ నోటీసులు జారీ చేసింది. ఆ సంస్థకు కడప జిల్లా ఎర్రగుంట్ల, కమలాపురం మండలాల్లో చట్టవిరుద్ధంగా కేటాయించిన సున్నపురాయి భూముల మైనింగ్ లీజులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. భారతి సిమెంట్స్ కంపెనీ ప్రధాన కార్యాలయానికి పోస్టు ద్వారా నోటీసులు పంపించింది. నోటీసులు అందిన 15 రోజుల్లోగా లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. అలాగే, అదానీ నియంత్రణలో ఉన్న అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీస్(ఏసీసీ)కు, రామ్‌కో సిమెంట్స్‌కు

మిగతా 11వ పేజీలో...



మోదీ గౌరవార్థం కారును స్వయంగా నడుపుతున్న జోర్డాన్ యువరాజు అల్ హుస్సేన్

జోర్డాన్ పర్యటన ఫలప్రదం

ఇరుదేశాల భాగస్వామ్యం సుదృఢం: ప్రధాని

జోర్డాన్ నుంచి ఇథియోపియాకు మోదీ

మోదీని వెంటబెట్టుకొని కారు నడిపిన దేశాధినేతలు

అమాన్, అడిస్ అబాబా, డిసెంబరు 16: జోర్డాన్ రాజు అబ్దుల్లా-2తో తాను జరిపిన చర్చలు పునరుత్పాదక ఇంధనం, నీటి నిర్వహణ, సాంస్కృతిక మార్పిడి సహా పలు కీలక రంగాల్లో భారత్-జోర్డాన్ భాగస్వామ్యాన్ని సుదృఢం చేశాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జోర్డాన్‌లో తన రెండు రోజుల పర్యటన విజయవంతంగా ముగిసిందని మంగళవారం వెల్లడించారు. తన పర్యటన సందర్భంగా

మిగతా 2వ పేజీలో...

ఆ ఉగ్రవాదికి హైదరాబాద్
మూలాలు

1998లో విద్యార్థిగా ఆస్ట్రేలియాకు సాజిద్..

నాటి నుంచి 6 సార్లే హైదరాబాద్‌కు

తండ్రి మరణించినా అంత్యక్రియలకు రాలేదు

పిలిప్పైన్స్‌లో ఆయుధ శిక్షణ
2

రెవె'న్యూ' క్లినిక్

అక్కడ భూ సమస్యలకు పక్కా చికిత్స

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచన

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

ఒక్కో సమస్యకు ఒక్కో కౌంటర్ ఏర్పాటు

ఐదు కౌంటర్ల ద్వారా ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ

సెప్టెంబరులో క్లినిక్ ప్రారంభం.. 100% అర్జీల పరిష్కారం
3

కొలిక్కివచ్చిన కసరత్తు!

టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుల జాబితా సిద్ధం

రెండు, మూడు రోజుల్లో అధికారికంగా ప్రకటన

నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీకి బాధ్యతలు

10 మంది ఓసీలు, 9 మంది బీసీలకు అవకాశం

నలుగురు ఎస్సీ, ఒక ఎస్టీ, ఒక మైనార్టీకి చాన్స్
14



ప్రాణాలు తీస్తున్న పొగమంచు

యమున ఎక్స్‌ప్రెస్‌వే మీద బస్సులు, కార్లు ఢీ

మంటలు వ్యాపించి 13 మంది సజీవ దహనం, 43 మందికి గాయాలు

యూపీలో వేర్వేరు రోడ్డు ప్రమాద ఘటనల్లో మరో 12 మంది మృత్యువాత

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాలకు తీవ్ర అంతరాయం.. పలు సర్వీసులు రద్దు
2



పరకామణిలో దొంగతనం..
చిన్న చోరీ కాదు

కానుకల లెక్కింపునకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులొద్దు: హైకోర్టు

కానుకలను దొంగిలిస్తే కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతింటాయి

లెక్కించే ప్రక్రియను ఆధునికీకరించాలి

మానవ ప్రమేయాన్ని తగ్గించండి

యంత్రాలు, ఏఐని వినియోగించండి

సేవాభావంతో లెక్కింపునకు భక్తులు ముందుకొస్తున్నారు

వారి దుస్తులూడదీసి సోదా చేయడం అమానుషం

పరకామణి ఆధునికీకరణపై సూచనలు, సలహాలతో మా ముందుకు రండి

ఇరుపక్షాలకు న్యాయమూర్తి సూచన

తదుపరి విచారణ 19వ తేదీకి వాయిదా



అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరుడి పరకామణిలో చోరీలను సాధారణ దొంగతనాలుగా చూడడానికి వీల్లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. కానుకల లెక్కింపునకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. స్వామిపై ఉన్న భక్తితో కానుకలు ఇస్తారని, ఆ సొమ్ము చోరీకి గురయితే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొంది. చోరీ ఘటనలు పునరావృతమవుతున్నా కానుకలు లెక్కించేందుకు అదే పాత విధానాన్ని టీటీడీ అనుసరించడాన్ని తప్పుబట్టింది. ఈ విధానాన్ని ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని.. ప్రస్తుత విధానంలో మానవ ప్రమేయం అధికంగా ఉందని, దానిని తగ్గించాలని సూచించింది. కానుకల లెక్కింపునకు యంత్రాలు, కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞాన్ని వినియోగించే

మిగతా 13వ పేజీలో...

ఒక్కరైనా స్పందించి ఉంటే....
ఆ ప్రాణం నిలిచేదేమో?!

- గుండెపోటుతో రోడ్డుపై విలవిలలాడిన వ్యక్తి
- సాయం కోసం వాహనదారులను బతిమాలిన భార్య
- మానవత్వం చూపని వైనం.. ప్రాణం విడిచిన బాధితుడు

బెంగళూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): చికిత్సకోసం వాహనంపై వెళుతూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు... భర్తను కాపాడుకోవాలని అతని భార్య వాహనదారులను సాయం కోసం ఎంతగానో అర్థించింది. కానీ, ఎవరూ స్పందించకపోవడంతో చివరకు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన బెంగళూరు నగరంలోని బనశంకరి సమీపంలో ఈ నెల 13న చోటు చేసుకుంది. బనశంకరిలోని కదిరేనహళ్లికి చెందిన వెంకట రమణన్(34)కు ఈ నెల 13వ తేదీ తెల్లవారున 3.30 గంటల సమయంలో ఛాతీలో నొప్పి వచ్చి, వాంతి అయింది. భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై కత్రిగుప్పెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ డాక్టర్‌లు లేకపోవడంతో సమీపంలోనే ఉండే మరో ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఈసీజీ తీసి, మైల్డ్ హార్ట్ అటాక్ అని చెప్పారు. ప్రథమ చికిత్స చేసి, వెంటనే జయదేవ హృద్రోగ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడికి వెళ్లేందుకు వాహనం కోసం వెంకట రమణన్ భార్య ప్రయత్నించారు. దొరక్కపోవడంతో ద్విచక్రవాహనంపైనే బయలుదేరారు. కాస్త దూరం వెళ్లేసరికి వెంకట రమణన్ పరిస్థితి విషమించింది. వాహనాన్ని నడపలేక పోగా, ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలారు. ఆయన భార్యకు దిక్కుతోచక, సాయం కోసం రోడ్డున వెళుతున్న వాహనాలను ఆపేందుకు ప్రయత్నించారు. చేతులు జోడించి వేడుకున్నా వాహనాదారులు ఎవరూ ఆపలేదు. ఈ క్రమంలో వెంకట రమణన్ సోదరి అక్కడికి చేరుకుని సీపీఆర్ చేశారు. అప్పటికే పరిస్థితి విషమించింది. చివరకు ఓ క్యాబ్ డ్రైవర్ గమనించి, బాధితుడిని ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే, మార్గమధ్యలో వెంకట రమణన్ ప్రాణాలు కోల్పోయారు. రోడ్డుపై నిలబడి భర్తను కాపాడుకునేందుకు మహిళ ప్రయత్నిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.

అప్పు తీర్చేందుకు కిడ్నీ అమ్ముకున్న రైతు

- మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో ఘటన

చంద్రాపూర్, డిసెంబరు 16: తీసుకున్న అప్పును తీర్చడానికి ఓ రైతు తన కిడ్నీని అమ్ముకున్న ఘటన మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఆ రైతు వడ్డీ వ్యాపారుల వద్ద రూ.లక్ష అప్పు తీసుకోగా రోజుకు రూ.10 వేల వడ్డీని వసూలు చేయడంతో అది రూ.75 లక్షలకు చేరుకోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. రోషన్ సదాశివ్ కుడే అనే రైతు వ్యవసాయంలో వరుస నష్టాలు రావడంతో పాల వ్యాపారాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం పలువురు వడ్డీ వ్యాపారుల వద్ద రూ.లక్ష రుణం తీసుకున్నాడు. దురదృష్టవశాత్తు ఆయన తన డెయిరీ వ్యాపారాన్ని ప్రారంభించడానికి ముందే తాను కొనుగోలు చేసిన ఆవులు మృత్యువాత పడ్డాయి. దీనికి తోడు పంటల వల్ల నష్టం రావడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. తీసుకున్న అప్పును తీర్చాలంటూ వడ్డీ వ్యాపారులు కుడేతోపాటు ఆయన కుటుంబాన్ని వేధించడం మొదలుపెట్టారు. దీంతో అప్పును తీర్చడానికి తన భూమి, ట్రాక్టర్‌తో పాటు గృహోపకరణాలను విక్రయించాడు. అయినప్పటికీ తీసుకున్న అప్పు తీరలేదు. ఈ నేపథ్యంలో కిడ్నీని విక్రయించి అప్పును తీర్చాలంటూ ఓ వడ్డీ వ్యాపారి కుడేకు సలహాఇచ్చాడు. అందుకు సిద్ధపడిన కుడే.. ఓ ఏజెంట్ ద్వారా కోల్‌కతాకు వెళ్లాడు. అక్కడ పరీక్షల తర్వాత కాంబోడియాకు వెళ్లి అక్కడ కిడ్నీని రూ.8లక్షలకు విక్రయించాడు. ఈ పరిణామాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్య తీసుకోలేదని కుడే చెప్పారు. తనకు న్యాయం చేయకుంటే తన కుటుంబంతో సహా ముంబైలోని సచివాలయం ముందు ఆత్మాహుతి చేసుకుంటామన్నారు.

జడ్జి అభిశంసనపై దర్యాప్తు కమిటీని స్పీకర్ ఏకపక్షంగా ఎలా ఏర్పాటు చేస్తారు?

- జస్టిస్ వర్మ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 16: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు లోక్‌సభ స్పీకర్ ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ వర్మ పిటిషన్ వేశారు. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో ఈ ఏడాది మార్చి 14న ఆయన అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరగ్గా.. సగం కాలిన నోట్ల కట్టలు భారీగా బయటపడిన సంగతి తెలిసిందే. ఆయన్ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ వివిధ పార్టీల నేతలు నోటీసులు ఇవ్వడంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జస్టిస్ వర్మపై అభిశంసన ప్రక్రియను ప్రారంభించేందుకుగాను ఆగస్టు 12న ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును సవాలు చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను మంగళవారం ధర్మాసనం విచారణకు స్వీకరించింది. అభిశంసన తీర్మానం పార్లమెంటు ఉభయసభల్లో ఇవ్వాల్సి ఉండగా, అలాంటిదేమీ జరగలేదని వర్మ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీం ధర్మాసనానికి తెలిపారు. జస్టిస్ వర్మపై అభిశంసన ప్రక్రియ ప్రారంభించే ముందు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ సంయుక్తంగా దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాలని గుర్తుచేశారు. కానీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏకపక్షంగా కమిటీ ఏర్పాటు చేశారని ధర్మాసనానికి తెలిపారు. ఈ కమిటీకి చట్టబద్ధత లేదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ లోక్‌సభ స్పీకర్ కార్యాలయానికి, ఉభయ సభల సెక్రటరీ జనరళ్లకు నోటీసులు జారీ చేసింది.

బెంగాల్ క్రీడా శాఖ మంత్రి రాజీనామా

కోల్‌కతా, డిసెంబరు 16: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీ భారత పర్యటన సందర్భంగా కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియంలో చోటు చేసుకున్న తీవ్ర గందరగోళం, నిర్వహణ లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, పశ్చిమ బెంగాల్ క్రీడా శాఖ మంత్రి అరూప్ బిస్వాస్ తన పదవికి రాజీనామా చేశారు.ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణకు వీలుగా తాను క్రీడా శాఖ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు బిస్వాస్ సీఎం మమతా బెనర్జీకి సమర్పించిన లేఖలో పేర్కొన్నారు. ఆయన రాజీనామాను మమత ఆమోదించినట్లు టీఎంసీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతానికి క్రీడా శాఖ బాధ్యతలను మమత స్వయంగా పర్యవేక్షించనున్నారు. మరోవైపు, ఈవెంట్ నిర్వహణ లోపాలపై డీజీపీ రాజీవ్ కుమార్, బిధాన్‌నగర్ పోలీస్ కమిషనర్ ముఖేశ్ కుమార్ సహా పలువురు ఉన్నతాధికారులకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

మోదీ జోర్డాన్ పర్యటన ఫలప్రదం

(మొదటి పేజీ తరువాయి)

రాజు అబ్దుల్లా-2, జోర్డాన్ ప్రజలు కనబరిచిన అసాధారణ స్నేహశీలతను కొనియాడారు. అబ్దుల్లా-2తో తాను జరిపిన చర్చలు భారత్-జోర్డాన్ ప్రజల పురోగతి, శ్రేయస్సు దిశగా కొత్త బాటలు పరుస్తాయని ఉద్ఘాటించారు. జోర్డాన్ పర్యటన సందర్భంగా తొలిరోజు సోమవారం ఇరుదేశాల ప్రతినిధుల సమావేశానికి ముందు మోదీ, అమాన్‌లోని హుస్సేనియా ప్యాలెస్‌లో అబ్దుల్లా-2తో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. మంగళవారం మోదీ-అబ్దుల్లా-2 ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇరు దేశాల మధ్య పరస్పర విశ్వాసంతో సుదీర్ఘకాలంగా సత్సంబంధాలు కొనసాగుతున్నాయని ఇరుదేశాధినేతలు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జోర్డాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా రాజు అబ్దుల్లా-2 ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశంలో పర్యటించారు. భారత ప్రధాని ఒకరు ఆ దేశంలో పర్యటించడం 37 ఏళ్ల అనంతరం ఇదే తొలిసారి. మూడు దేశాల పర్యటన కోసం సోమవారం ఢిల్లీ నుంచి బయలుదేరిన మోదీ, తన జోర్డాన్ పర్యటన ముగియడంతో మంగళవారం ఇథియోపియా వెళ్లారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని అబియ్ అహ్మద్ అలీతో ద్వైపాక్షిక సంబంధాలపై మోదీ చర్చించారు. అంతకుముందు ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాకు చేరుకున్న మోదీకి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. అబియ్ అహ్మద్ అలీ స్వయంగా విమానాశ్రయానికి విచ్చేసి మోదీకి స్వాగతం పలికారు. అనంతరం మోదీని కారులో ఎక్కించుకొని తాను స్వయంగా డ్రైవ్ చేస్తూ హోటల్‌కు తీసుకెళ్లారు. ఇథియోపియా అత్యున్నత పురస్కారమైన 'గ్రేట్ హానర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా'ను ఆయన మోదీకి ప్రదానం చేశారు.

'బోండీ బీచ్' ఉగ్రవాదికి
హైదరాబాద్ మూలాలు

1998లో విద్యార్థిగా ఆస్ట్రేలియా వెళ్లిన సాజిద్ అక్రమ్.. గత 27 ఏళ్లలో ఆరుసార్లు మాత్రమే హైదరాబాద్‌కు..

- హైదరాబాద్‌లో సాజిద్‌కు నేరచరిత్ర లేదు
- డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడి..
- ఫిలిప్పైన్స్‌లో ఆయుధ శిక్షణ తీసుకున్న సాజిద్, అతడి కుమారుడు నవీద్


సాజిద్ అక్రమ్

న్యూఢిల్లీ/హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) ఆస్ట్రేలియాలోని సిడ్నీలో యూదులపై కాల్పులు జరిపిన తండ్రీ కొడుకుల్లో.. తండ్రి సాజిద్ అక్రమ్‌కు హైదరాబాద్ మూలాలు ఉన్నట్లు బయటపడింది. పాతబస్తీకి చెందిన అతడు 1998లో ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆస్ట్రేలియా వెళ్లి, అక్కడే యూరోపియన్ మూలాలున్న వెనెరా గ్రాసో అనే మహిళను వివాహం చేసుకొని స్థిరపడ్డాడని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. వీరికి కుమారుడు నవీద్ అక్రమ్‌తోపాటు ఒక కుమార్తె కూడా ఉందని చెప్పారు. సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌లో బీకాం చదువుకున్నాడని, గత 27 ఏళ్లలో ఆరుసార్లు మాత్రమే హైదరాబాద్‌కు వచ్చినట్లు తెలిపారు. సాజిద్ విదేశీయురాలిని వివాహం చేసుకోవడంతో కుటుంబానికి దూరమయ్యాడని, తన తండ్రి మరణించినప్పుడు కూడా అతను అంత్యక్రియలకు హాజరుకాలేదన్న విషయం తమ విచారణలో వెల్లడైందని డీజీపీ వివరించారు. అతడికి ఐఎస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్న విషయం ఇక్కడి కుటుంబ సభ్యులకు తెలియదని, తెలంగాణలో సాజిద్‌కు ఎలాంటి నేరచరిత్ర లేదని పేర్కొన్నారు. ఈ కేసుపై సంబంధిత విభాగాలకు తెలంగాణ పోలీసులు సహకరిస్తున్నారని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. కాగా, తల్లికి అనారోగ్యంగా ఉందని కబురు చేసినా సాజిద్ తిరిగిరాలేదని అతని కుటుంబసభ్యులు చెప్పారు. సాజిద్ 2001లో తన విద్యార్థి వీసాను పార్టనర్ వీసాగా మార్చుకొని, 2002లో రెసిడెంట్ వీసా పొందినట్లు తెలిపారు. అదే సంవత్సరంలో టోలీచౌకీలో ఉన్న తన ఆస్తులను అమ్ముకొని వెళ్లిపోయాడన్నారు. బోండీ బీచ్‌లో సాజిద్ అతడి కుమారుడు నవీద్ అక్రమ్ ఆదివారం జరిపిన కాల్పుల్లో 15 మంది మరణించిన విషయం తెలిసిందే. పోలీసుల ఎదురు కాల్పుల్లో సాజిద్ కూడా మరణించాడు. నవీద్ తీవ్రంగా గాయపడ్డాడు. సాజిద్‌ది పాకిస్థాన్ అని మొదట ప్రచారమైంది. అయితే, పోలీసుల దర్యాప్తులో సాజిద్‌కు భారత పాస్‌పోర్టు ఉన్నట్లు గుర్తించి, భారత విదేశాంగ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. వారు తెలంగాణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వారిద్దరిది ఐఎస్ భావజాలం

ఐఎస్ సిద్ధాంతాలతో ప్రభావితమైన సాజిద్, నవీద్.. బోండీ బీచ్‌లో ఘాతుకానికి పాల్పడ్డారని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ తెలిపారు. బోండీ బీచ్‌లో ఆదివారం కాల్పులు ఘటన తర్వాత నవీద్ పేరుతో ఉన్న ఓ వాహనం నుంచి రెండు ఐఎస్ పతాకాలతోపాటు ఐఈడీ పేలుడు పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, సాజిద్, నవీద్‌ల కాల్పుల్లో నలుగురు భారతీయ విద్యార్థులు గాయపడినట్లు ది ఆస్ట్రేలియా టుడే వార్తా సంస్థ తెలిపింది. వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొంది.

పిలిప్పైన్స్‌లో ఆయుధ శిక్షణ

సాజిద్, నవీద్‌లు గత నెలలో పిలిప్పైన్స్‌కు వెళ్లి.. ఆయుధాలు ఉపయోగించటంలో మిలిటరీ స్థాయి శిక్షణ తీసుకున్నట్లు ఆస్ట్రేలియా పోలీసుల విచారణలో తేలింది. నవంబర్ 1వ తేదీ నుంచి 28 వరకు వారిద్దరు పిలిప్పైన్స్‌లోనే ఉన్నట్లు ఆ దేశ ఇమిగ్రేషన్ అధికారులను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా మంగళవారం రిపోర్ట్ చేసింది. సాజిద్ అక్రమ్.. పిలిప్పైన్స్‌కు కూడా భారత పాస్‌పోర్టుతోనే వచ్చినట్లు ఆ దేశ అధికారులు వెల్లడించారు. దక్షిణ పిలిప్పైన్స్‌లో వీరు అతివాద ఇస్లామిక్ గురువులను కలిసి, అక్కడే ఆయుధ శిక్షణ తీసుకున్నట్లు గుర్తించారు. ఆ ప్రాంతం ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న మత గురువులు, సాయుధ గ్రూపులకు నిలయంగా ఉంది.

ప్రాణాలు తీస్తున్న పొగమంచు

- యమున ఎక్స్‌ప్రెస్‌వే మీద బస్సులు, కార్లు ఢీ
- మంటలు వ్యాపించి 13 మంది సజీవ దహనం, 43 మందికి గాయాలు
- యూపీలో వేర్వేరు రోడ్డు ప్రమాద ఘటనల్లో మరో 12 మంది మృత్యువాత
- శంషాబాద్‌లో పలు విమానాలు రద్దు


యమునా ఎక్స్‌ప్రెస్ వేపై కాలిపోతున్న వాహనాలు

మథుర, డిసెంబరు 16: ఉత్తరాదిన పొగమంచు.. ప్రాణాలను హరిస్తోంది. హరియాణాలో సోమవారం ఓ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించగా, సోమవారం రాత్రి, మంగళవారం వేకువజామున యూపీలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా ఘటనలు జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోయారు. 59 మంది గాయాల పాలయ్యారు. మంగళవారం తెల్లవారుజామున యమున ఎక్స్‌ప్రెస్‌వే మీద పొగమంచు కారణంగా 8 బస్సులు, 3 కార్లు ఢీకొన్నాయి. మంటలు అలుముకొని వాహనాలు దగ్ధమై 13 మంది మరణించారు. 43 మంది గాయపడ్డారు. ఆగ్రా-నోయిడా మార్గంలో ఎదురుగా ఏమీ కనిపించక ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు వెల్లడించారు. యూపీలోనే బరాబంకీ జిల్లాలో ఓ వాహనాన్ని మరో వాహనం ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో పొగమంచు వల్ల ప్రమాదం జరిగి ఇద్దరు చనిపోయారని తెలిపారు. ఉన్నావ్ జిల్లాలో ముందున్న రోడ్డు సరిగా కనిపించక ఓ వాహనం డివైడర్‌ను ఢీకొనటంతో.. నలుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం రాత్రి మీరట్ జిల్లాలో పొగమంచు కారణంగా ఓ వాహనం బ్రిడ్జి మీది నుంచి నదిలో పడిపోయి ఇద్దరు మరణించారు. బస్తి జిల్లాలో యాత్రికుల బస్సు, ఓ లారీ ఢీకొని నలుగురు మరణించగా, 11 మంది గాయపడ్డారు. పొగమంచు కారణంగా మంగళవారం శంషాబాద్ విమానాశ్రయంలో పలు విమానాలు రద్దయ్యాయి.

లోకం తీరు



నిస్తేజంగా పీసీబీలు!

- దేశవ్యాప్తంగా 50% పోస్టులు ఖాళీ

న్యూఢిల్లీ, డిసెంబరు 16: వాయు కాలుష్యంతో ప్రధాన నగరాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కాలుష్య నియంత్రణ బోర్డులు (పీసీబీ) తగినంత మంది సిబ్బంది లేక నిస్తేజంగా మారాయి. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న పీసీబీలు, కమిటీల్లో దాదాపు 50శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ)తో పాటు 28 రాష్ట్రాల్లోనూ కాలుష్య నియంత్రణ బోర్డులు (ఎస్‌పీసీబీ), కేంద్ర పాలిత ప్రాంతాలు, ఢిల్లీ ఎన్‌సీటీ పరిధితో కలిపి 8 కాలుష్య నియంత్రణ కమిటీలు (పీసీసీ) పని చేస్తున్నాయి. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నకు సంబంధిత శాఖ చెప్పిన సమాధానం ప్రకారం... శాస్త్ర, సాంకేతిక విభాగాల్లో వీటికి మంజూరైన పోస్టుల సంఖ్య 6,932 కాగా అందులో 3,161 (45.6%) ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 100 శాతం ఖాళీలతో సిక్కిం అగ్రస్థానంలో నిలిచింది. 70 శాతానికి పైగా ఖాళీలతో జార్ఖండ్, ఏపీ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఏటా శీతాకాలంలో వాయు కాలుష్య స్థాయిలు అమాంతం పెరిగిపోయే ఢిల్లీ పీసీసీలో 44.5 శాతం, లద్దాఖ్, దాద్రా, నగర్ హవేలీ, డామన్, డయ్యూలలో 69 శాతం, చండీగఢ్‌లో 11.1 శాతం చొప్పున ఖాళీలున్నాయి.

పొల్యూషన్ సర్టిఫికెట్ ఉంటేనే పెట్రోలు

ఢిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు కఠిన చర్యలు అమలు చేస్తోంది. దీనిలో భాగంగా పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్ లేని వాహనాలకు పెట్రోలు బంకుల్లో ఇంధనం పోయొద్దని ఆదేశించింది. తాజా నిబంధన ఈ నెల 18 నుంచి అమల్లోకి రానుందని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా తెలిపారు. బంకుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా దీని అమలును పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో.. సోనియా, రాహుల్‌కు ఊరట

- ఈడీ చార్జిషీట్‌ను కొట్టేసిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు ఊరట లభించింది. ఈ కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను ఢిల్లీలోని రోజ్ అవెన్యూ కోర్టు మంగళవారం కొట్టివేసింది. ఈ కేసు ఒక ప్రైవేట్ ఫిర్యాదుపై ఆధారపడిందని, నేరారోపణపై ఎక్కడా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని గుర్తుచేసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) క్రింద అది చెల్లదని న్యాయమూర్తి విశాల్ గోగ్నే స్పష్టంచేశారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సోనియా, రాహుల్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడా, సునీల్ భండారీతోపాటు యంగ్ ఇండియన్, డోటెక్స్ మర్కండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థలపై చేసిన ఆరోపణలను కోర్టు తోసిపుచ్చింది. సీఆర్‌పీసీ సెక్షన్ 200 క్రింద ప్రైవేట్ వ్యక్తి డాక్టర్ సుబ్రమణియన్ స్వామి చేసిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని ప్రాసిక్యూషన్ ఫిర్యాదు చేయడాన్ని అనుమతించలేమని తేల్చి చెప్పింది. ఈడీ ఫిర్యాదు ఆధారంగా విచారణ జరపడం ఈ దశలో సాధ్యం కాదని తెలిపింది. అంతేకాక ఢిల్లీ పోలీసు ఆర్థిక నేరాల విభాగం ఈ అంశంపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ దాఖలు చేసినందున ఈడీ కేసుపై విచారణ నిర్వహించలేమని పేర్కొంది. అయితే, ఢిల్లీ పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు కొనసాగించవచ్చని తెలిపింది. కాగా, ఈ తీర్పుపై అప్పీల్ దాఖలు చేయనున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. ప్రైవేట్ వ్యక్తి ఫిర్యాదు చేసినా దర్యాప్తు జరిపే అధికారం ఈడీకి ఉందని పేర్కొన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను ముద్రిస్తున్న అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ సంస్థ ఆస్తులను గాంధీ కుటుంబం, వారి సన్నిహితులు కాజేశారని 2012లో అప్పటి రాజ్యసభ సభ్యుడు సుబ్రమణియన్ స్వామి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. కోర్టు తీర్పుపై కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తంచేసింది. సత్యమే గెలిచింది (సత్యమేవ జయతే) అని పేర్కొంది. రాజకీయ కక్ష సాధింపుతో ఈడీ కేసు దాఖలు చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించింది. ఎఫ్ఐఆర్ లేకుండానే దశాబ్ద కాలంగా మోదీ ప్రభుత్వం కక్ష సాధింపుతో వ్యవహరించిందని మండిపడింది.

మహాత్ముడి ఆదర్శాలకు అవమానం

ఉపాధి హామీ చట్టం పేరు మార్చడంపై రాహుల్ గాంధీ ఆగ్రహం

- విపక్షాల నిరసనల మధ్య 'వీబీ-జీరామ్‌జీ' బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్
- నేడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసన

న్యూఢిల్లీ, డిసెంబరు 16: పూజ్య బాపూజీ ఆదర్శాలను అవమానించడమే లక్ష్యంగా.. మోదీ సర్కారు ఉపాధి హామీ చట్టానికున్న ఆయన పేరును మారుస్తూ వీబీ-జీరామ్‌జీ బిల్లును తీసుకొచ్చిందని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. తీవ్రమైన నిరుద్యోగం ద్వారా ఇప్పటికే దేశ యువత భవితను నాశనం చేసిన మోదీ సర్కారు.. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద ప్రజలకు ఉపాధిహామీ చట్టం ద్వారా లభిస్తున్న భద్రమైన జీవనోపాధిని సైతం తొలగించేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్- గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్-గ్రామీణ్ (వీబీ-జీరామ్‌జీ)'గా మార్చి, పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచుతూ రూపొందించిన బిల్లును.. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం విపక్షాల నిరసనల మధ్య లోక్‌సభలో ప్రవేశపెట్టారు. గాంధీజీ పేరు తొలగింపుపై విపక్షనేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో.. తమ ప్రభుత్వానికి మహాత్మాగాంధీపై విశ్వాసం ఉందని, బాపూజీ సిద్ధాంతాలను పాటిస్తోందని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధికి సంబంధించి గత ప్రభుత్వాల కన్నా మోదీ సర్కారే ఎక్కువ కృషి చేసిందని పేర్కొన్నారు. కానీ, మోదీ మొదట్నుంచీ ఉపాధి హామీ పథకం(మన్రేగా)పై అసహనంతో ఉన్నారని.. గడిచిన పదేళ్లుగా దాన్ని బలహీనపరచడానికి ప్రయత్నిస్తున్నారని రాహుల్ ఎక్స్ వేదికగా ఆరోపించారు. "ఈరోజు మన్రేగాను పూర్తిగా తుడిచిపెట్టడానికి ఆయన కంకణం కట్టుకున్నారు" అని ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ ప్రజా వ్యతిరేక బిల్లును కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి నుంచి పార్లమెంటు దాకా వ్యతిరేకిస్తోందని రాహుల్ స్పష్టం చేశారు. లోక్‌సభలో మంగళవారం ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు.. విపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. దాన్ని పార్లమెంటరీ ప్యానెల్ పరిశీలన నిమిత్తం పంపాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం పేరు నుంచి మహాత్ముడి పేరు తొలగించడంపై కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు తదితర విపక్ష ఎంపీలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పలువురు విపక్ష ఎంపీలు మహాత్మాగాంధీ ఫొటోలు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. 'వీబీ-జీరామ్‌జీ' బిల్లు పేదల ఉపాధి హక్కులను బలహీనపరిచేలా ఉందని, ఇది రాజ్యాంగానికి వ్యతిరేకమని ప్రియాంక ధ్వజమెత్తారు. ప్రస్తుత చట్టం ప్రకారం ఉపాధి హామీ పనులకు సంబంధించి 90 శాతం నిధులను కేంద్రమే ఇస్తుందని.. కొత్త బిల్లులో దాన్ని 60 శాతానికి కుదించారని, రాష్ట్రాల ఆర్థికస్థితిపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని ఆమె ఆందోళన వెలిబుచ్చారు. మహాత్మాగాంధీ తమ కుటుంబానికి చెందినవారు కాదని.. దేశంలోని ప్రతి కుటుంబానికీ చెందినవారని ఆమె గుర్తుచేశారు. "మోదీ సర్కారుకున్న ఈ పథకాల పేర్లు మార్చడమనే అబ్సెషన్ ఏమిటో నాకు అర్థం కావట్లేదు" అని వ్యాఖ్యానించారు. గతంలో ఈ పథకం కింద ఊళ్లో ఏ పనులు చేపట్టాలో గ్రామపంచాయతీ నిర్ణయించేదని.. కానీ ఈ బిల్లు ఆ హక్కుతో పాటు, నిధులను ఎలా కేటాయించాలనే హక్కును కూడా కేంద్రానికి దఖలుపరుస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం పేరు మార్పును తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. 1971లో వచ్చిన 'హరే కృష్ణ హరే రామ్' సినిమాలోని "రామ్ కా నామ్ బదనామ్ నా కరో" పాటను గుర్తుచేశారు. ఉపాధిహామీ పథకం పేరు మారుస్తూ తెచ్చిన ఈ బిల్లు కేవలం పాలనాపరమైన మార్పు మాత్రమే కాదని.. ఈ పథకం ఆత్మపైన, తాత్వికపునాది మీద జరిగిన దాడి అని విమర్శించారు. కాగా.. 'వీబీ-జీరామ్‌జీ' బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఈమేరకు ఆ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్.. అన్ని రాష్ట్రల కాంగ్రెస్ అధ్యక్షులకూ లేఖలు రాశారు.



పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపీల నిరసన ప్రదర్శన

తప్పకుండా లోక్‌సభకు రండి

- కాంగ్రెస్ సభ్యులకు విప్ జారీ

న్యూఢిల్లీ, డిసెంబరు 16: లోక్‌సభలో బుధవారం నుంచి 3రోజుల పాటు ముఖ్యమైన బిల్లులపై చర్చ జరగనున్నందున పార్టీ ఎంపీలంతా తప్పకుండా హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేసింది. ఉపాధి హామీ పథకం బదులు ప్రవేశపెట్టిన 'వీబీ-జీ రాం జీ' పథకం, ప్రయివేటు రంగంలో అణు విద్యుత్తు కేంద్రాల నిర్వహణకు ఉద్దేశించిన 'శాంతి బిల్లు'లపై చర్చ జరగనున్న దృష్ట్యా కాంగ్రెస్ ఎంపీలందరూ సభలో ఉండాలని సూచించింది.

బెంగాల్లో 58.20 లక్షల ఓట్ల తొలగింపు

- 7.66 కోట్ల నుంచి 7.08 కోట్లకు తగ్గిన ఓటర్లు

కోల్‌కతా, డిసెంబరు 15: పశ్చిమ బెంగాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(సర్) తర్వాత ఓటర్ల సంఖ్య భారీగా తగ్గింది. 58,20,898 మంది ఓటర్లు తొలగింపునకు గురయ్యారు. ఈ ఏడాది జనవరిలో 7.66 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. మంగళవారం ఈసీ ప్రచురించిన ముసాయిదా జాబితాల్లో 7.08 కోట్ల మందే ఉన్నారు. తొలగించిన ఓటర్లలో మృతులు 24.16 లక్షల మంది ఉన్నట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి. శాశ్వతంగా వలసపోయినవారు 19.88 లక్షల మంది కాగా.. ఆచూకీ లేనివారు 12.20 లక్షల మంది, 'ఘోస్ట్' ఓటర్ల సంఖ్య 1.83 లక్షలు. 1.38 లక్షల మంది ఓటర్లను డూప్లికేట్ ఎంట్రీలుగా గుర్తించి తీసివేశారు. ఎన్యుమరేషన్ సందర్భంగా కనుగొన్న లోపాల ఆధారంగా ఇంకో 57 వేల ఓట్లు తొలగించారు. ఇవి ముసాయిదా జాబితాలు మాత్రమేనని, జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ప్రాతినిధ్యం వహిస్తున్న చౌరంగీలో అత్యధికంగా 75,553 ఓట్లు తీసివేశారు. సీఎం మమత స్థానమైన భవానీపూర్‌లో 44,787 ఓట్ల తొలగించారు. మరోవైపు, రాజస్థాన్‌లోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత 41.85 లక్షల ఓట్లను ఎన్నికల కమిషన్ తొలగించింది.

3 రాష్ట్రాలు, 2 యూటీల్లో కోటి మంది అవుట్

సర్ ప్రక్రియ పూర్తయిన మూడు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)ల్లో మంగళవారం ఓటర్ల జాబితాలను ప్రచురించగా.. కోటికిపైగా ఓట్లను ఈసీ తొలగించింది. ఈ ఏడాది అక్టోబరు 27నాటికి వీటిలో 13.36 కోట్ల మంది ఓటర్లు ఉండగా..సర్ తర్వాత 12.32 కోట్ల మందికి మాత్రమే చోటు దక్కింది. తీసేసిన కోటికిపైగా ఓట్లలో సగం (58 లక్షలు) బెంగాల్లోనే కాగా.. రాజస్థాన్‌లో 42 లక్షలు, గోవాలో 1.01 లక్షలు, పుదుచ్చేరిలో 1.03 లక్షలు, లక్షదీవుల్లో 56,384 ఓట్లను తొలగించారు.

'బీబీసీ'పై ట్రంప్ 90వేల కోట్ల దావా



వాషింగ్టన్, డిసెంబరు 16: అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా తాను చేసిన ప్రసంగాన్ని ఎడిట్ చేసి ప్రసారం చేసినందుకుగాను నష్టపరిహారం చెల్లించాలంటూ బీబీసీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దావా వేశారు. అలాగే, చట్ట నిబంధలను ఉల్లంఘించి అక్రమ వ్యాపార పద్ధతులకు బీబీసీ పాల్పడుతోందని కూడా ఆయన ఆరోపించారు. ఈ రెండు కారణాల రీత్యా, ఒక్కో దానికి 5బిలియన్ డాలర్లు చొప్పున మొత్తం 10 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.90వేల కోట్లు) చెల్లించాలని 33 పేజీల దావా పత్రంలో ట్రంప్ డిమాండ్ చేశారు. గెలుపును తస్కరించారంటూ అప్పటి అధ్యక్షుడు బైడెన్‌కు వ్యతిరేకంగా 2021 జనవరి ఆరో తేదీన క్యాపిటల్ హిల్‌పై దాడికి ట్రంప్ మద్దతుదారులు సిద్ధమయ్యారు. వారిని ఉద్దేశించి ట్రంప్ గంటసేపు మాట్లాడారు. 'ట్రంప్- రెండో చాన్స్' పేరిట ఈ ప్రసంగాన్ని 2024 ఎన్నికలకు ముందు బీబీసీ ప్రసారం చేసింది. 'ఘోరంగా పోరాడదాం..' అంటూ చేసిన వ్యాఖ్యలను ప్రధానం చేసి, 'శాంతియుతంగా ప్రదర్శన నిర్వహిద్దాం.. దేశభక్తిని ప్రదర్శిద్దాం..' అన్న అభ్యర్థనలను మాత్రం తొలగించి తన ప్రసంగాన్ని ప్రసారం చేశారనేది ట్రంప్ ప్రధాన ఆరోపణ. పొంతన లేని రెండు వేర్వేరు భాగాలను ఒకచోట అతికించడం ద్వారా తన మాటలను వక్రీకరించారని ట్రంప్ తన దావా పత్రంలో ఆరోపించారు. తనను అవమానించి, పరువు తీసి, రాజకీయంగా నష్టం కలిగించాలనే తప్పుడు, మోసపూరిత ఉద్దేశాలతోనే బీబీసీ ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించారు. అయితే.. ఈ వ్యవహారంలో ట్రంప్‌కు గతంలోనే బీబీసీ క్షమాపణలు తెలిపింది.

చైల్డ్‌కేర్ లీవ్‌లు ఎప్పుడైనా వాడుకోవచ్చు

- ఉద్యోగ విరమణలోగా వినియోగించుకునే అవకాశం
- మహిళా ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త


ఉద్యోగినుల చైల్డ్ కేర్ లీవ్‌పై జీవో విడుదల చేసిన నేపథ్యంలో బొప్పరాజు వెంకటేశ్వర్లుకు స్వీటు తినిపిస్తున్న ఏపీ జేఏసీ సెక్రెటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళా ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చైల్డ్‌కేర్ లీవ్‌లను ఉద్యోగ విరమణలోగా ఎప్పుడైనా వాడుకునే అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. మహిళా ఉద్యోగులతోపాటు, ఒంటరి పురుష ఉద్యోగులకూ దీన్ని వర్తింపజేస్తూ ఆదేశాలు జారీచేసింది. ఇకపై మహిళా ఉద్యోగులు, ఒంటరి పురుష ఉద్యోగులు 180 రోజుల చైల్డ్‌కేర్ లీవ్‌లను తమ సర్వీసు పూర్తయ్యేలోగా ఎప్పుడైనా వాడుకోవచ్చని స్పష్టం చేసింది. అలాగే పిల్లల వయస్సు ఎంతైనా సరే, దివ్యాంగ పిల్లల సంరక్షణ సహా వివిధ అవసరాలకు ఈ సెలవులు వినియోగించుకోవచ్చని తెలిపింది. గతంలో పిల్లల వయస్సు 18 ఏళ్ల (దివ్యాంగులైన పిల్లల సంరక్షణకు 22 ఏళ్లు) దాటితే చైల్డ్‌కేర్ లీవ్ వాడుకునే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు ఆ పరిమితిని ప్రభుత్వం ఎత్తివేసింది. ఇటీవల జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ సెలవుల వినియోగంపై హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పిల్లల వయస్సుతో సంబంధం లేకుండా సర్వీస్ మొత్తంలో ఎప్పుడైనా చైల్డ్ కేర్ లీవ్‌లు వాడుకునే వెసులుబాటు కల్పించడంపై మహిళా ఉద్యోగులు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు హర్షం వ్యక్తం చేశారు.

మాదకద్రవ్యాలు వద్దు.. జీవితమే ముద్దు!

శ్రీకాకుళంలో ఉత్సాహంగా 'అభ్యుదయం సైకిల్ యాత్ర'


శ్రీకాకుళంలో అభ్యుదయం సైకిల్‌యాత్రలో పాల్గొన్న డీజీ గోపీనాథ్ జెట్టి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గంజాయి, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని వీటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశాఖ రేంజ్ డీజీ గోపీనాథ్‌జెట్టి పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'అభ్యుదయం సైకిల్‌యాత్ర' విజయవంతంగా నిర్వహించారు. డీజీతోపాటు కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, అధిక సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మునిసిపల్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డీజీ మాట్లాడుతూ.. 'గంజాయి, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి. మంచి సమాజ నిర్మాణం మంచి వ్యక్తుల వల్లనే సాధ్యమవుతుంది. గంజాయిని తరిమికొట్టడానికి సమష్టి ప్రయత్నం కొనసాగించాలి' అని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలు వద్దు.. జీవితమే ముద్దు అంటూ ప్రతిజ్ఞ చేయించారు. జానపద నృత్యాలు, తప్పెటగుళ్ల ప్రదర్శనలు, యముడు, తదితర వేషధారణలతో డ్రగ్స్‌ను వ్యతిరేకిస్తూ అవగాహన కల్పించారు.


మాజీ ప్రధాని వాజపేయి విగ్రహావిష్కరణలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు పార్థసారథి, సత్యప్రసాద్, రవికుమార్

వాజపేయి-బాబు మైత్రితోనే
ఉమ్మడి రాష్ట్రాభివృద్ధి

- మాజీ ప్రధాని విగ్రహావిష్కరణలో మాధవ్
- హాజరైన మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి, అనగాని

బాపట్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో మాజీ ప్రధాని వాజపేయి ముద్ర మరువలేనిదని.. నాడు ప్రధాని, ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వాజపేయి, చంద్రబాబు మైత్రితోనే ఏపీలో అనేక అభివృద్ధి పనులు పురుడు పోసుకున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. అటల్, మోదీ సుపరిపాలన బస్సు యాత్ర మంగళవారం బాపట్లకు చేరుకోగా ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వాజపేయి కాంస్య విగ్రహాన్ని మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లతో కలిసి మాధవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్రతో నాడు ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించిన సమయంలో ఆయనకు అండగా వాజపేయి నిలిచారని గుర్తు చేశారు. జాతీయ రహదారుల కనెక్టివిటీతో పాటు పనికి ఆహార పథకం, గ్యాస్, టెలికాం రంగాల్లో సంస్కరణలకు ఆద్యుడు మాజీ ప్రధాని వాజపేయి అని మాధవ్ కొనియాడారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

రెవె'న్యూ' క్లినిక్

అక్కడ భూ సమస్యలకు పక్కా చికిత్స

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచన.. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

- ఒక్కో సమస్యకు ఒక్కో కౌంటర్ ఏర్పాటు
- ఐదు కౌంటర్ల ద్వారా ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ
- సెప్టెంబరులో క్లినిక్ ప్రారంభం
- 100 శాతం అర్జీల పరిష్కారం
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ శాఖతో పని అంటే ప్రజలు చెప్పులు అరిగేలా తిరగాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో 'రెవెన్యూ క్లినిక్' అనే వినూత్న ఆలోచనతో భూ సమస్యలకు చికిత్స చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. వ్యాధుల చికిత్సకు ప్రత్యేక విభాగాలు ఉన్నట్లే.. వివిధ రకాల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దీంతో సమస్య పరిష్కారం సులువవుతోంది. క్లినిక్‌తో మంచి ఫలితాలు వస్తున్నాయని అటు అధికారులు.. ఇటు ప్రజలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



రెవెన్యూ క్లినిక్‌లో వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్

భూ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ సమస్య ఎప్పటికి పరిష్కారం అవుతుందో చెప్పడం కష్టమే. రెవెన్యూ సమస్యలు నానాటికి ఎక్కువ అవుతుండడంతో వాటిని పరిష్కరించాలని పదేపదే ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అధికారులను ఆదేశిస్తున్నారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల మాదిరిగానే పార్వతీపురం మన్యం జిల్లాలోనూ రెవెన్యూ సమస్యలు గతంలో భారీగా పెండింగ్‌లో ఉండేవి. దీన్ని గమనించిన జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తన సొంత ఆలోచనతో సెప్టెంబరు 29న 'రెవెన్యూ క్లినిక్' అనే వేదికను ప్రారంభించారు. సాధారణంగా ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ద్వారా సమస్యలపై వినతిపత్రాలను స్వీకరిస్తారు. కానీ ఇప్పుడు ప్రతి సోమవారం రెండు ప్రజా సమస్యలు పరిష్కార వేదికలు నిర్వహిస్తున్నారు. అందులో ఒకటి సాధారణ సమస్యలు వేదిక కాగా, మరొకటి కేవలం రెవెన్యూ సమస్యలపైనే వినతులు స్వీకరించే విభాగం. రాష్ట్రంలోనే మొదటిసారిగా రెవెన్యూ క్లినిక్ పేరుతో ప్రత్యేకంగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించే వేదిక ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఈ క్లినిక్ వద్ద కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు ఇద్దరు సబ్ కలెక్టర్లు, 15 మంది తహసీల్దార్లు ఉంటారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ క్లినిక్ ద్వారా వచ్చిన సమస్యలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

ప్రత్యేక కౌంటర్ల వద్ద ఫిర్యాదుల స్వీకరణ

రెవెన్యూ క్లినిక్ వేదిక వద్ద ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతి కౌంటర్ వద్ద అధికారులు ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ సమస్యల పరిష్కారానికి ఒకటో నంబర్ కౌంటర్, మ్యుటేషన్ తదితర సమస్యలకు రెండో నంబర్ కౌంటర్, 1/70 చట్టం సమస్యలు పరిష్కరించేందుకు మూడో నంబర్ కౌంటర్, రీసర్వే సంబంధిత సమస్యల కోసం నాలుగో నంబర్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇక ఐదో నంబర్ కౌంటర్ వద్ద ఇతర రెవెన్యూ సమస్యలు, వినతులకు సంబంధించిన అర్జీలు స్వీకరిస్తారు. ఒక్కో కౌంటర్ వద్ద డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు ఆర్‌ఐ, మరో ఇద్దరు అధికారులను నియమించారు. ముందుగా రెవెన్యూ సమస్యలపై ప్రజలు అందించే వినతులను రిజిస్ట్రేషన్ చేసి అనంతరం ఆ సమస్య ఏ కౌంటర్ వద్దకు వెళితే పరిష్కారం అవుతుందో అర్జీదారులను చెప్పి అక్కడకు పంపిస్తారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు.

అర్జీదారుల సంతృప్తి

రెవెన్యూ క్లినిక్ ప్రారంభమైన తర్వాత అర్జీలు పరిష్కరించి వాటిపై ఐవీఆర్‌ఎస్ ద్వారా అర్జీదారుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభమైన తర్వాత మొదటి తొమ్మిది వారాలకు సంబంధించి 227 ఫిర్యాదులు అందాయి. వాటిని నూటికి నూరు శాతం పరిష్కరించారు. సమస్యల పరిష్కారం తర్వాత ఐవీఆర్‌ఎస్ కాల్స్ చేస్తే.. 173 మంది తమ సమస్యలు పరిష్కారం కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరికొంత మంది ఫోన్స్‌కు అందుబాటులో లేకపోవడం వల్ల వారి అభిప్రాయం తెలియలేదు.

రెవెన్యూ సమస్యలు లేని జిల్లాగా మార్చేందుకు కృషి

రెవెన్యూ సమస్యలు లేని జిల్లాగా పార్వతీపురం మన్యంను మార్చేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాను. సెప్టెంబరు 29న రెవెన్యూ క్లినిక్ ద్వారా సమస్యలపై ప్రత్యేకంగా వినతులను తీసుకోవడం ప్రారంభించాం. 227 వినతులు వచ్చాయి. నూటికి నూరు శాతం సమస్యలను పరిష్కరించడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరి సహకారంతో పార్వతీపురం మన్యం జిల్లాను రెవెన్యూ సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దుతానన్న నమ్మకం ఉంది.

-ఎస్. ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్

హాట్ మెటల్ ఉత్పత్తిలో విశాఖ ఉక్కు మరో రికార్డు

- ఆది, సోమవారాల్లో వరుసగా 21,012, 21,205 టన్నుల ఉత్పత్తి

ఉక్కు టౌన్‌షిప్(విశాఖపట్నం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటులోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో మరోసారి రికార్డు స్థాయి హాట్ మెటల్ ఉత్పత్తి జరిగింది. ఆదివారం 21,012 టన్నుల ఉత్పత్తి సాధించగా, సోమవారం ఉదయం ఆరు నుంచి మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు ఏ, బీ, సీ మూడు షిఫ్టులలో 21,205 టన్నుల ఉత్పత్తి సాధించడంతో సరికొత్త రికార్డు నమోదైంది. బ్లాస్ట్ ఫర్నేస్-1లో 6,569 టన్నులు, బ్లాస్ట్ ఫర్నేస్-2లో 6,592 టన్నులు, బ్లాస్ట్ ఫర్నేస్-3లో 8,044 టన్నులు... కలిపి మొత్తం 21,205 టన్నుల ఉత్పత్తి జరిగింది.

మేజర్ మినరల్స్ పెండింగ్ దరఖాస్తులకు మోక్షం

- 300కు పైగా అర్జీలు.. పరిష్కరించే అధికారం డీఎంజీకి

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మేజర్ మినరల్స్ జాబితాలో చేర్చిన నాలుగు ఖనిజాల మైనింగ్‌పై పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బెరైటీస్, క్వార్ట్జ్, మైకా, ఫెల్డ్‌స్పార్‌ల మైనింగ్ కోరుతూ ఈ ఏడాది ఫిబ్రవరి కన్నా ముందే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సెటిల్ చేసే అధికారం గనుల శాఖ డైరెక్టర్ (డీఎంజీ)కు అప్పగిస్తూ ఆ శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు (జీఓ-229) జారీ చేశారు. ఆ నాలుగు ఖనిజాలు తొలుత మైనర్ మినరల్స్ జాబితాలో, రాష్ట్ర గనుల శాఖ పరిధిలో ఉన్నాయి. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్రం మైనర్, మేజర్ మినరల్స్ జాబితాను సవరించింది. ఈ నాలుగు ఖనిజాలను మేజర్ మినరల్స్ జాబితాలో చేర్చింది. కానీ, అప్పటికే వాటిపై మైనింగ్ కోరుతూ 300కు పైగా దరఖాస్తులు గనుల శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిపై ఏం నిర్ణయం తీసుకోవాలన్నదానిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర గనుల శాఖ నుంచి స్పష్టత తీసుకుంది. పెండింగ్‌లో ఉన్న ఆ నాలుగు ఖనిజాల దరఖాస్తులను రాష్ట్రస్థాయిలో మైనర్ మినరల్స్‌గానే భావించి 2027లోగా ప్రాసెస్ చేసి లీజులు మంజూరు చేయాలని కేంద్రం స్పష్టత ఇచ్చింది. దీంతో ఆ పెండింగ్ మైనింగ్ దరఖాస్తులపై లీజులు మంజూరు చేసే అధికారం గనుల శాఖ కార్యదర్శి నుంచి డైరెక్టర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 2027, సెప్టెంబరు 23 నాటికల్లా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని డీఎంజీని ప్రభుత్వం ఆదేశించింది.

ఇంటర్ పరీక్ష ఫీజుల చెల్లింపునకు 'తత్కాల్'

ఇప్పటి వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజులు చెల్లించని విద్యార్థుల కోసం తత్కాల్ అవకాశం కల్పించినట్లు ఇంటర్ పరీక్షల కంట్రోలర్ సైమన్ విక్టర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి జనవరి 5 వరకు రూ.5వేల అపరాధ రుసుముతో తత్కాల్ విధానంలో పరీక్ష ఫీజులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఫీజుల చెల్లింపునకు ఇదే చివరి అవకాశం అని, మరొకసారి పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు.

మత్స్యకారుల డీజిల్ రిటైల్ ఔట్‌లెట్ల కొనసాగింపు

రాష్ట్రంలో మత్స్యకారులు చేపల వేటకు అవసరమైన బోట్లకు రాయితీపై డీజిల్ సరఫరా చేసే రిటైల్ ఔట్‌లెట్లను కొనసాగించానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 88 రిటైల్ ఔట్‌లెట్లను కొనసాగించడానికి మత్స్యశాఖ తీసుకున్న చర్యను ఆమోదిస్తూ, 2024-25లో ఆమోదించిన మరో 10 రిటైల్ ఔట్‌లెట్లతో సహా, మొత్తం 98 రిటైల్ ఔట్‌లెట్లను ఇప్పటికే నిర్ణయించిన గడువు తేదీ నుంచి వచ్చే ఏడాది జూన్ వరకు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే శ్రీకాకుళం, బాపట్ల, కాకినాడ, ప్రకాశం జిల్లాల్లో ఒక్కొక్క కొత్త రిటైల్ ఔట్‌లెట్‌ను రాయితీ డీజిల్ పథకం కోసం నోటిఫై చేసింది. అనకాపల్లి జిల్లాలోని రెండు రిటైల్ ఔట్‌లెట్లను డీ-నోటిఫై చేసింది.


మంగళగిరిలో సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద వీఆర్‌ఏల మహాధర్నా

- తెలంగాణ తరహా పేస్కేల్ అమలుకు డిమాండ్

మంగళగిరి సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల ప్రధాన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వీఆర్‌ఏ సంఘాల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.బాలకాశీ డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరి ఆటోనగర్‌లోని సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద మంగళవారం మహాధర్నా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వీఆర్‌ఏలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీసీఎల్‌ఏ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నేతలు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాల్లో 20 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులు పనిచేస్తున్నారని, వీరికి 2018లో వేతనం రూ.10,500లకు పెరిగిందని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా పెంచలేదని చెప్పారు. గత ప్రభుత్వంలో వీఆర్‌ఏలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని, చాలీచాలని వేతనంతో నేడు కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏలకు తెలంగాణ ప్రభుత్వం తరహాలో పేస్కేల్ అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

- ఢిల్లీలో అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం ధర్నా

న్యూఢిల్లీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ఓబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ అధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. బీజేపీ ఎంపీలు ఆర్. కృష్ణయ్య, పాక సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ.. చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లు సాధించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీల్ని సమన్వయపరచుకొని దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని చేపడతామన్నారు.

అటవీశాఖ సలహాదారుకు విధుల అప్పగింత

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ శాఖ సలహాదారు పి.మల్లికార్జునరావుకు ప్రభుత్వం కొన్ని విధులు అప్పగించింది. అటవీ సంరక్షణ, నిర్వహణ, జీవ వైవిధ్య రక్షణ, పచ్చదనం పెంపునకు కొత్త విధానాల రూపకల్పనలో ప్రభుత్వానికి వ్యూహాత్మక సలహాలివ్వాలని , ప్రభుత్వం కేటాయించే ఏ విధులనైనా నిర్వహించాలని.. ఇంకా పలు విధులను పేర్కొంటూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అలిపిరిలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

శిల్ప కళాశాల ప్రాంతంలోని 25 ఎకరాలలో నిర్మాణం.. తిరుమల కూడళ్లు, దారులకు శ్రీవారి నామాల పేర్లు

- రథాలు, ధ్వజస్తంభాల కోసం పలమనేరులో 100 ఎకరాలు
- హృదయాలయలో అత్యాధునిక సౌకర్యాలకు రూ.48 కోట్లు
- ముంబైలో రూ.14.04 కోట్లతో ఆలయ నిర్మాణం
- టీటీడీ బోర్డు సమావేశంలో నిర్ణయాలు

తిరుమల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమలపై ఒత్తిడి తగ్గించే ఆలోచనతో తిరుపతిలోని అలిపిరి వద్ద 20 నుంచి 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ను నిర్మించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం నిర్వహించిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు మీడియాకు వెల్లడించారు. టీటీడీ శిల్ప కళాశాల ప్రాంతంలో ఈ టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని, శిల్పకళాశాలను మరో ప్రదేశానికి తరలిస్తామని చెప్పారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు కనీస బస, అన్నదానం, పార్కింగ్ వంటి కొన్ని సౌకర్యాలు ఇక్కడ ఉంటాయన్నారు. తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు అదనంగా రూ.48 కోట్ల మంజూరుకు బోర్డు ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇప్పటికే ఆ ఆస్పత్రికి దాదాపు రూ.230 కోట్లు కేటాయించగా, అందులో అవసరం లేని కొన్ని నిర్మాణాలకు సంబంధించిన టెండర్లను రద్దు చేశామన్నారు. ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, పక్కన ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి

సమావేశంలో మరికొన్ని నిర్ణయాలు

- టీటీడీ ఆలయాలు, దేశంలోని ఇతర ఆలయాలకు ధ్వజస్తంభాలు, రథాల తయారీ కోసం పలమనేరులో వంద ఎకరాలలో దివ్య వృక్షాలు పెంచేందుకు నిర్ణయం.
- ముంబైలోని బాంద్రా ప్రాంతంలో మహారాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 800 గజాల స్థలంలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయం నిర్మాణానికి ఆమోదం.
- దాతల కాటేజీల నిర్వహణ, నిర్మాణాలపై నూతన సమగ్ర విధానం తీసుకురావాలని నిర్ణయం.
- టీటీడీ ఇంజినీరింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న 60 పోస్టులను ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా త్వరలో భర్తీ చేసేందుకు నిర్ణయం.
- నిబంధనల మేరకు శ్రీవారి పోటులో నూతనంగా 18 పాచక పోస్టుల మంజూరు కోసం ప్రభుత్వానికి లేఖ రాయాలని తీర్మానం
- తిరుమలలోని రహదారులు, ప్రధాన కూడళ్ల పేర్లను వైష్ణవ పురాణాలు, ఆళ్వార్లు, అన్నమాచార్య సంకీర్తనల్లోని శ్రీవారి నామాలు తదితర పేర్లతో మార్చేందుకు ప్రత్యేక కమిటీ నియామకం.
- శ్రీవారి ఆలయంలో ప్రధాన సన్నిధి యాదవతోపాటు అదనంగా మరో సన్నిధి యాదవ పోస్టు ఏర్పాటు.
- తిరుమల, నడక మార్గాల్లోని పురాతన నిర్మాణాల పరిరక్షణ కోసం ప్రత్యేక విభాగం, అనుభవం కలిగిన అధికారుల నియామకానికి ఆమోదం.
- జగిత్యాల కొండగట్టు వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తుల వసతి సముదాయం నిర్మాణానికి ఆమోదం.

బుల్లెట్ రైల్వే లైన్ కోసం భూ పరీక్షలు

- అనంతపురం జిల్లాలో నిపుణుల పర్యటన

బుక్కరాయసముద్రం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు దిశగా చర్యలు మొదలయ్యాయి. బెంగుళూరు-హైదరాబాద్, హైదరాబాదు-చెన్నై మధ్య బుల్లెట్ (హైస్పీడ్ రైలు) రైలు మార్గం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. హైద రాబాదు-చెన్నై మార్గం రాష్ట్రంలోని గుంటూరు జిల్లా మీదుగా వెళ తుంది. బెంగళూరు-హైదరాబాదు రైలు మార్గం అనంతపురం జిల్లా మీదుగా వెళ తుంది. ఈ క్రమంలో హైస్పీడ్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మట్టి పరీక్షలు నిర్వహించారు. అనంతపురం రూరల్ మండలంలోని కొన్ని గ్రామాలు, బుక్కరాయసముద్రం మండలంలోని దేవరకొండ వెనుక భాగం, సిద్దరాంపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో నిపుణుల బృందం భూ పరీక్షలు నిర్వహించింది. బుక్కరాయసముద్రం మండల వ్యాప్తంగా దాదాపు 40 పాయింట్లలో మట్టి నమూనాలను సేకరించి, పరీక్షించారని సమాచారం. బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ వారు గ్రౌండ్ లెవెల్ రిపోర్టును సిద్ధం చేస్తున్నారని నిపుణులు తెలిపారు.

22 ఏ భూములపై ఏలూరులో మెగా గ్రీవెన్స్ సెల్

- ఏలూరు జిల్లా రోల్ మోడల్‌గా నిలుస్తుందన్న మంత్రి నాదెండ్ల


భూ సమస్యలపై వచ్చిన అర్జీలు పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో 22 ఏ కింద నిషేధిత భూముల సమస్యల పరిష్కారానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా గ్రీవెన్స్ సెల్‌కు అనూహ్య స్పందన లభించింది. రాష్ట్రంలోనే తొలిసారిగా ఏలూరులో నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌లో జిల్లాలోని 27 మండలాలకు చెందిన రైతులు, మాజీ సైనికులు, ఇతర వర్గాల ప్రజల నుంచి సుమారు 70 వరకు ఫిర్యాదులందాయి. రెవెన్యూ, దేవదాయ, రిజిస్ట్రేషన్ శాఖల ఆధ్వర్యంలో సమస్యలకు రెండు వారాల్లో పరిష్కార మార్గాలను అన్వేషించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'ఉపాధి'కి కొత్త రూపు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్పుకు వ్యతిరేకంగా డిసెంబరు 17న దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ నిర్ణయించింది. గాంధీజీ చిత్రపటాలతో ఈ నిరసన ప్రదర్శనలు నిర్వహించబోతున్నదట. ప్రధాని మోదీకి గాంధీ ఆలోచనలు, పేదలు హక్కులు నచ్చవని, సరిగ్గా ఇరవైయేళ్ళక్రితం కాంగ్రెస్ తెచ్చిన ఈ బృహత్పథకం గాంధీజీ గ్రామస్వరాజ్ దార్శనికతకు సజీవరూపమే కాక, కోట్లాది మంది గ్రామీణపేదలకు జీవనాధారంగా నిలిచిందని, కొవిడ్ మహమ్మారి కాలంలో ఆర్థిక భద్రత కల్పించిందని రాహుల్‌గాంధీ గుర్తుచేస్తున్నారు. ఇప్పటికే పలువిధాల బలహీనపడిన ఈ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం మార్చివేయడానికి నిర్ణయించుకుంది. 'జీ రామ్ జీ' అంటూ బీజేపీ తన కొత్త పథకంలో గాంధీ పేరుతోపాటు, మొత్తం ఉపాధికే ఎసరుపెట్టబోతోందని కాంగ్రెస్ హెచ్చరిక.

ఉపాధికి హామీపడిన పాతచట్టాన్ని ఉపసంహరించడం వెనుక అనేక సరికొత్త ఆదర్శాలూ లక్ష్యాలూ ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. రెండు దశాబ్దాలనాటి పరిస్థితులు ఇప్పుడు గ్రామాల్లో లేవు కనుక, మారిన సామాజికార్థిక వాస్తవాలకు అనుగుణంగా బిల్లును తీర్చిదిద్దామని ప్రభుత్వం అంటోంది. గాంధీ పథకం కంటే ఈ రామ్ జీ పథకం మెరుగైనదని, మరింత ఉపాధినిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో తాగు, సాగునీటి వనరులను మెరుగుపరుస్తుందని, ఉమ్మడి వసతులు, మౌలికసదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం దక్కుతుందని ప్రభుత్వం చెబుతోంది. పేరు ఎందుకు మార్చాలన్న కాంగ్రెస్ ప్రశ్నను అటుంచితే, గత పథకం ఆదర్శాలూ, ఆశయాలు ఈ కొత్త పథకంలో నీరుగారి, స్ఫూర్తి కొనసాగని పక్షంలో ప్రజలు కచ్చితంగా ప్రశ్నిస్తారు. కొత్తబిల్లులో ఈ పథకం మీద కేంద్ర ప్రభుత్వం నియంత్రణ పెరిగిందని, ఏ రాష్ట్రానికి ఎన్ని నిధులన్న అంశం సహా చాలా అధికారాలు కేంద్రం దఖలుపరచుకోవడం ప్రమాద సంకేతాలని విపక్షాలు అంటున్నాయి.

ఇటీవలే ఈ పథకం పేరును పూజ్యబాపు గ్రామీణ్‌రోజ్‌గార్ యోజనగా మార్చి, పనిదినాల సంఖ్యను నూటపాతిక చేసి, ఒక రోజు కనీసవేతనాన్ని 240 రూపాయలకు సవరించిన ప్రభుత్వం ఇంతలోనే మనసు ఇలా ఎందుకు మార్చుకుందో తెలియదు. కార్మిక చట్టాలను లేబర్ కోడ్స్‌గా మార్చేసినట్టుగా, ఈ పేర్లమార్పిడి ఉద్యమంలో భాగంగానే ఇదీ జరిగిందని అనుకోలేం. పథకం అమలయ్యే ఆయా రాష్ట్రాలు, గ్రామీణ ప్రాంతాలను కేంద్రమే ఎంపికచేయడం, ఏయే రాష్ట్రాల్లో ఎంతమేరకు అమలు జరగాలో నిర్దేశించడం, కేటాయించే నిధుల పరిమాణాన్ని నిర్ణయించడం వంటివి గాంధీ పథకం దిశదశ పూర్తిగా మారాయనడానికి నిదర్శనం. పదిశాతం వాటాకే బొక్కబోర్లాపడుతున్న రాష్ట్రాలు ఇకపై నలభైశాతం బరువు నెత్తినెత్తుకోవడంతోనే పథకం ఎంత ఘనంగా సాగబోతోందో అర్థమవుతుంది. పనులు, వాటి తీరుతెన్నులు, నిలిపివేత సమయాలు, కేటాయించే నిధులూ సర్వమూ ముందుగానే నిర్ణయమైపోతున్నందున ఇంత కాలమూ డిమాండ్ ఆధారిత పథకంగా ఉన్నది కాస్తా సప్లయ్ ఆధారితమైపోతోంది. సంక్షేమం ఒక హక్కుగా ఉన్న గాంధీ పథకాన్ని మోదీ ప్రభుత్వం దాతృత్వ కార్యక్రమంగా నీరుగార్చిందని విమర్శకులు అంటున్నారు. పంచాయితీలు, రాష్ట్రాల చేతుల్లోంచి నిర్ణయాధికారాలను స్వాధీనం చేసుకుంటున్న కేంద్రం, అనేకరెట్ల ఆర్థికభారాన్ని మాత్రం రాష్ట్రాల మీద రుద్దింది. రాజ్యాంగబద్ధంగా దక్కిన పనిహక్కును ఈ కొత్తబిల్లుతో కార్మికులు కోల్పోతున్నారు. ఇప్పటివరకూ స్వగ్రామంలోనే ఉపాధిని డిమాండ్ చేసి సాధించుకున్న గ్రామీణులు ఇకపై తమ గ్రామానికి కేంద్రం పని కేటాయించని పక్షంలో వలస పోవలసి రావచ్చు. పథకం పేరులో ఇంకా గ్యారంటీ మిగిలివున్నా, లోతుగా చూస్తే దేనికీ గ్యారంటీ లేని రీతిలో మార్పు తెలివిగా జరిగింది. కొత్త చట్టంతో రాష్ట్రాల మీద యాభైవేలకోట్ల రూపాయల అదనపు భారం పడవచ్చునని ఓ అంచనా.

బిల్లు ఉపసంహరించుకోవాలన్న విపక్షాల డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించకున్నా, స్టాండింగ్ కమిటీకి పంపి అది తన చిత్తశుద్ధిని రుజువుచేసుకోవచ్చు. సభాముఖంగా విస్తృతమైన చర్చలు జరిపి, తదనుగుణమైన మార్పుచేర్పులు చేసి, అన్ని పార్టీల మద్దతుతో బిల్లును గట్టెక్కించినప్పుడే ఈ భారీ ప్రజాసంక్షేమ పథకం విలువ, గౌరవం నిలబడతాయి. కాంగ్రెస్ ఆరోపిస్తున్నట్టుగా ఒకవేళ గాంధీ పేరు ఇష్టంలేక తొలగించినా, తమకు ఎంతో ప్రీతిపాత్రమైన 'రామ్' అన్న సంక్షిప్త రూపాన్ని ఉపయోగిస్తున్నందుకైనా పాలకులు ఈ కొత్తపథకం ద్వారా నిరుపేదలకు, అన్నార్తులకు అన్యాయం జరగకుండా చూస్తే అంతే చాలు.

జాతి నిర్మాణ స్ఫూర్తినివ్వని సంవాదాలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్


'వందేమాతరం ఒక గీతం కాదు. జాతి నిర్మాణంలో తమ విధ్యుక్త ధర్మాన్ని నిర్వహించేలా ప్రజలను పురిగొలిపే చైతన్య శక్తి అది. ఆత్మనిర్భర్ భారత్ కలను సాధించేందుకు ఆ గీతం ఎనలేని ప్రేరణ కలిగిస్తుంది..' అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. 'వందే మాతరం భారతదేశ ఆత్మ. ప్రతి భారతీయుడు దాన్ని సగర్వంగా గానం చేస్తాడు..' అని కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ అన్నారు. వందేమాతరం రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా పార్లమెంటు ఉభయ సభల్లో ఆసక్తికరమైన చర్చ జరిగింది. ప్రతి రోజూ ఉభయ సభలు గందరగోళం మధ్య వాయిదా పడుతున్న తరుణంలో స్వాతంత్ర్యోద్యమంలో భారతీయులను ఉత్తేజపరిచి, అమర త్యాగాలకు స్ఫూర్తి కలిగించిన బంకించంద్రుని అజరామర గీతంపై పార్లమెంటులో చర్చ జరగడం ఒక సంతోషకరమైన పరిణామం.

ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరిట ఓట్ చోరీ జరుగుతోందని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఈ శీతాకాల సమావేశాలను తొలి రెండు రోజులు అడ్డుకున్నాయి. ఆ తర్వాత వందేమాతరంపై ప్రతిపక్షాలు చర్చకు అంగీకరించినందుకు ప్రతిఫలంగా ప్రభుత్వం ఎన్నికల సంస్కరణలపై రెండు రోజుల పాటు చర్చకు ఆమోదించింది. ఆ విధంగా 'సర్'పై విపక్షాలు అభ్యంతరాలు లేవనెత్తేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వందేమాతరం, ఎన్నికల సంస్కరణలపై ఇరు పక్షాలకు చెందిన నాయకులు వాడిగా, వేడిగా చర్చలు జరపడం పార్లమెంటు పట్ల ప్రజల ఆసక్తిని పెంచిందనే భావించాలి. పార్లమెంటు అనేదే చర్చలకు వేదిక. ప్రభుత్వం తలుచుకుంటే పార్లమెంటులో చర్చలు జరిగేందుకు ఆస్కారం ఉన్నదని ఈ సమావేశాలు నిరూపించాయి. వందేమాతరంపై చర్చ జరగడం వల్ల తమకు ప్రయోజనం ఉంటుందని బీజేపీ అగ్రనేతలు భావించడమే ఇందుకు కారణం.

ఈ చర్చల ప్రమాణాలు మాత్రం అంత గొప్పగా ఏమీ లేవు. వందేమాతరం ప్రాధాన్యాన్ని ఈ దేశంలో అన్ని రాజకీయ పార్టీలు గుర్తించినందువల్ల దాని ఘనతను కీర్తిస్తూ ప్రజలకు కలిసికట్టుగా ఒక స్ఫూర్తిని కలిగించేందుకు ఆరోగ్యకరమైన చర్చ జరగాలని ప్రభుత్వం భావించినట్లు కనపడలేదు. ఉభయ సభలు వందేమాతరం స్ఫూర్తితో దేశం ఏ విధంగా పయనించాలన్న విషయమై ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించి ఉంటే ఆ గీతాన్ని తగిన విధంగా గౌరవించినట్లుండేది. ఇరుపక్షాల నేతలు వందేమాతరం గీత ప్రాశస్త్యాన్ని వివరిస్తూనే ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ముస్లింలను బుజ్జగించేందుకు ఈ గీతాన్ని కుదించివేశారని బీజేపీ విమర్శిస్తే, బెంగాల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హిందూ, ముస్లిం విద్వేషాలను రెచ్చగొట్టేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ విమర్శించింది. బహిరంగసభల్లో ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకున్నట్లుగా వందేమాతరం వంటి ప్రభావశీల గీతంపై రాజకీయ చర్చ జరగడం విషాదకరం. ఆ జాతీయ గీతంపై ఆర్ఎస్ఎస్ నేత రాంమాధవ్ రాసిన ఒక వ్యాసంలో పాకిస్థాన్‌ను లౌకిక దేశంగా రూపొందించడంలో జిన్నా విఫలమయ్యారని, అయితే హిందూ, ముస్లింలు పరస్పరం సౌభ్రాతృత్వంతో సహజీవనం చేసే దేశాన్ని నిర్మించడంలో గాంధీ విజయవంతం అయ్యారా లేదా మనం ప్రశ్నించుకోవాలని ఆయన అన్నారు. అత్యంత బలహీనులకు కూడా అత్యంత బలవంతులైన వారికి ఉండే శక్తి లభించాలని గాంధీజీ ఆశించినట్లు ఆయన పేర్కొన్నారు. మరిఅ లాంటి పరిస్థితులు మన దేశంలో ఉన్నాయా?

ప్రధానమంత్రి అన్నట్లు వందేమాతరం గీతం స్ఫూర్తితో ప్రతి భారతీయుడూ కృషి చేసి ఆత్మనిర్భర్ భారత్ దిశగా దేశం పయనించేలా చేస్తే మంచి పరిణామమే. అయితే వందేమాతరం ప్రభావం ఇవాళ దేశంలో అన్ని రంగాల్లో చూపే అవకాశం ఉన్నదా అన్నది చర్చనీయాంశం. గత కొన్ని నెలలుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని అనేక రకాలుగా అవమానిస్తున్నారు. సరిహద్దుల్లో అలజడి సృష్టిస్తున్న చైనా అవకాశం లభించినప్పుడల్లా అరుణాచల్‌ప్రదేశ్‌ను వివాదాస్పద ప్రదేశంగా చిత్రిస్తోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత కూడా పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని నిలిపివేయలేదు. భారతదేశానికి విశ్వగురు స్థానం లభించేందుకు మోదీ తీవ్ర కృషి చేసినప్పటికీ ఇవాళ విదేశాంగ విధానం అనేక అగ్నిపరీక్షల నెదుర్కొంటూ చరిత్ర మలుపులో దిక్కుతోచని స్థితిలో ఉన్నది. దక్షిణాఫ్రికాలో జరిగిన జీ20 సమావేశాలకు అమెరికా, చైనా, రష్యా, సౌదీ అరేబియా హాజరు కాలేదు. ప్రపంచ రాజకీయాలు బహుళ ధ్రువంగా మారాలంటే గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహించే దిశగా భారత్ పావులు కదపాల్సి ఉన్నది.

విషాదకరమైన విషయం ఏమంటే స్టార్టప్‌లను ఎంతగా ప్రోత్సహించినప్పటికీ , వాటిలో చాలా భాగం నిధుల లోటుతో మూతపడుతున్నాయి. ప్రభుత్వ మద్దతు లేకపోతే తమ కాళ్లపై తాము నిలబడగల సంస్థలు తక్కువే. ఐఐటీ, ఐఐఎంలలో చదువుకున్న వారిలో అత్యధికులు మెరుగైన అవకాశాల కోసం విదేశాలవైపు చూస్తున్నారు. అక్కడైతే తమ శ్రమకు తగ్గ ఫలితం దొరుకుతుందని భావిస్తున్నారు. మన మేధస్సు వలస వెళ్లకుండా ఇక్కడే తలెత్తుకుని జీవించగలిగిన పరిస్థితి ఏర్పడ్డప్పుడే వందేమాతరం గీతానికి సార్థకత లభిస్తుంది.



ఇక ఆర్థికరంగంలో ఆత్మనిర్భర్ మాటకు వస్తే అనేక ప్రశ్నలు తలెత్తక తప్పదు. 'వందేమాతరం స్వదేశీ ఆత్మ ఆలపించే సంగీతం' అని టాగోర్ అన్నారు. 'స్వదేశీ అంటే తలుపులు మూయడం కాదు, వెన్నెముకను పటిష్ఠం చేయడం' అని నెహ్రూ రాజ్యాంగ సభలో చెప్పారు. భారత్ ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే రైతులు, శ్రామికులు, హస్తకళాకారులు, వ్యాపారులు అందరినీ వందేమాతరం స్ఫూర్తితో చైతన్యపరిచే దిశగా నేతలు కృషి చేయవలసిన అవసరం ఉన్నది. అయితే దేశం విదేశీ సరుకులకు ఒక మార్కెట్‌గా మారిపోతోంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ 50 నుంచి 70శాతం వరకు చైనా ఉత్పత్తులు మన దేశంలో మార్కెట్ అవుతున్నాయి. ఎలెక్ట్రానిక్స్, యంత్రాలు, పరికరాలు, సేంద్రీయ రసాయనాలు, క్రిమిసంహారక మందులు, న్యూక్లియర్ రియాక్టర్లు, విడిభాగాలు, ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులు, సౌరశక్తి పరికరాలు, బ్యాటరీలు, ఆటబొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, మొబైల్ ఫోన్స్‌కు అవసరమైన సర్క్యూట్ల నుంచి, దీపావళి లైట్ల వరకు చైనా మన మార్కెట్‌లో వీరవిహారం చేస్తోంది. క్రూడాయిల్, రక్షణ రంగ ఉత్పత్తులు, టెక్నాలజీ కోసం మనం ఇతర దేశాలపై ఆధారపడక తప్పడం లేదు. సెమికండక్టర్లపై తైవాన్ 80వ దశకంలోనూ, నెదర్లాండ్స్ పదేళ్లక్రితమే క్వాంటమ్ టెక్నాలజీ పైన దృష్టి కేంద్రీకరిస్తే మనం ఇప్పుడిప్పుడే వాటి గురించి పట్టించుకుంటున్నాము. డాలర్ విలువ రోజురోజుకూ పెరిగిపోతుంటే రూపాయి విలువ క్షీణిస్తోంది. వికసిత్ భారత్ పేరుతో భారతదేశం ఆత్మనిర్భర్ లక్ష్యాలను సాధించి అగ్రరాజ్యంగా అవతరించేందుకు మోదీ వందేమాతరం స్ఫూర్తితో దేశాన్ని సంఘటితం చేయగలిగితే, ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసి రూపాయిని బలోపేతం చేయగలిగితే అంతకంటే కావల్సిందేమీ లేదు. పార్లమెంటులో ఆ దిశగా చర్చలు జరగకపోవడమే అనేక సందేహాలకు దారితీస్తోంది.

ఎన్నికల సంస్కరణలపై చర్చ సైతం పూర్తిగా పక్కదోవ పట్టింది. ఓట్ల చోరీ జరుగుతోందని, ఎన్నికల కమిషన్ బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తుందని రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు తీవ్ర విమర్శలు చేస్తే అమిత్ షా తదితర బీజేపీ నేతలు ఆయనను ఖండించేందుకు, ఎన్నికల కమిషన్‌ను సమర్థించేందుకు చర్చను ఉపయోగించుకున్నారు. చొరబాటుదారులను కాంగ్రెస్ సమర్థిస్తోందని విమర్శించారు. సరిగ్గా పార్లమెంటు జరుగుతున్న సమయంలోనే కాంగ్రెస్ రామ్‌లీలా మైదాన్‌లో సభను ఏర్పాటు చేసి 'ఓట్ చోర్, గద్దీ ఛోడ్' అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించింది. మొన్ననే బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ నినాదంతో ప్రజల ముందుకు వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పుడు వన్ పాయింట్ ఎజెండాతో ఈ ర్యాలీ నిర్వహణ కోసం పెద్ద ఎత్తున ఖర్చు చేసి జనాన్ని తరలించడం వల్ల తక్షణం వచ్చే ఫలితాలు ఏమీ లేవు. ఎంతకాలం ఈ ప్రచారాన్ని నిర్వహించగలుగుతుందో, ప్రజలను తమవైపు ఎప్పటికి తిప్పుకోగలుగుతుందో చెప్పలేం.

విచిత్రమేమంటే ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో ఓట్ చోరీ తప్ప మరే అంశానికి ఏమంత ప్రాధాన్యం లభించలేదు. ఇవాళ ప్రతి ఎన్నికలోనూ కోట్లాది రూపాయలు ప్రవహిస్తున్నాయి. సామాన్యుడు ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితి కనిపించడం లేదు. అనేక మంది నేరచరితులు చట్టసభల్లో ప్రవేశించగలుగుతున్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు రాజకీయ పార్టీలు చందమామను తీసుకువచ్చి అరచేతుల్లో పెడతామనే రీతిలో హామీలు గుప్పిస్తున్నాయి. ఎన్నికల సమయంలోనే ప్రజలకు, ముఖ్యంగా మహిళల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేసినా కమిషన్ మౌనం వహిస్తోంది. రాజకీయ పార్టీలకు ఎన్నికల నిధులు సమకూర్చి అందుకు ప్రతిఫలంగా కార్పొరేట్ కంపెనీలు కాంట్రాక్టులు, ఇతర ప్రయోజనాలు పొందడం నిస్సిగ్గుగా జరుగుతోంది. అధికార యంత్రాంగాన్ని, ముఖ్యంగా పోలీసులను పూర్తిగా దుర్వినియోగపరుస్తున్నారు. వీటన్నింటినీ అరికట్టి ఎన్నికల సంస్కరణలను ప్రవేశపెట్టాలనే దిశగా పార్లమెంటులో చర్చ జరగలేదు. ప్రభుత్వానికే కాదు, ప్రతిపక్షాలకు కూడా నిజమైన సంస్కరణల పట్ల ఆసక్తి లేనట్లు కనపడుతోంది.

చట్టసభల్లో చర్చ జరపడమంటే ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకోవడం, దుర్భాషలాడుకోవడమేనా? అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్, ఇతర పార్టీలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ తీరుతెన్నులపైనే కాదు, తమ వ్యవహార శైలిపై దృష్టి సారించనంతవరకూ ఏ చర్చలూ దేశానికి దిశానిర్దేశం చేయలేవు. ఇలాంటి చర్చల వల్ల పార్లమెంట్ సమయం, కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా అవడం మినహా ఒరిగేదేముంటుంది?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

> చట్టసభల్లో చర్చ జరపడమంటే పాలక, ప్రతిపక్షాలు పరస్పరం దుమ్మెత్తిపోసుకోవడం, దుర్భాషలాడుకోవడమేనా? అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్, ఇతర పార్టీలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ తీరుతెన్నులపైనే కాదు, తమ వ్యవహార శైలిపై దృష్టి సారించనంతవరకూ ఏ సంవాదాలూ జాతికి దిశానిర్దేశం చేయలేవు.

లేబర్ కోడ్స్‌కు షుగర్ కోటింగ్!

'కార్మికలోకానికి శాపం ఈ కమ్యూనిస్టులు' శీర్షికన బీజేపీ నాయకులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి రాసిన వ్యాసం (12.12.2025) మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై నిస్వార్థంగా పోరాడుతున్న కమ్యూనిస్టులను విమర్శించడమే లక్ష్యంగా సాగింది. అందులో భాగంగా మోదీ ప్రభుత్వం చేసిన నాలుగు లేబర్ కోడ్లను వ్యాసకర్త అసత్యాలతో ఆకాశానికి ఎత్తేశారు.

కార్మికులకు ప్రధానంగా అవసరమైనవి గౌరవప్రదమైన వేతనం, పని ప్రదేశంలో భద్రత. వీటికి యాజమాన్యాలు ఒప్పుకోకపోవడం వల్లే కార్మికులు సంఘాలు పెట్టుకుంటారు, సమ్మెలు చేస్తారు. అందువల్ల వేతనం, సంఘం, సమ్మె– ఈ మూడూ కార్మికుల అస్తిత్వానికి ప్రధానం. వీటిని మోదీ ప్రభుత్వం ఈ లేబర్ కోడ్ల ద్వారా కాల రాస్తోంది.

వాస్తవంగా మన దేశంలో ఎటువంటి చట్టం లేకముందే కార్మికులు అనేక సమ్మెలు చేశారు. దరిమిలా నాటి బ్రిటిష్ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్ చట్టం 1926 చేసింది. ఈ చట్టం ప్రకారం ఏదైనా పరిశ్రమలో ఏడుగురు కార్మికులు కలిసి యూనియన్ ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త కోడ్ ప్రకారం 10 శాతం కార్మికులు కానీ, 100 మంది కలిస్తేనే కానీ యూనియన్ ఏర్పాటు కాదు. ఈ నిబంధనకు అనుగుణంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్నప్పటికీ, ఒకవేళ ఏదైనా సమయంలో ఈ సంఖ్య తగ్గితే ఆ యూనియన్ రిజిస్ట్రేషన్ రద్దు అయిపోయే నిబంధన కొత్తగా చేర్చారు. దీనివల్ల యూనియన్ ఏర్పాటు గగనం అయిపోతుంది.

పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం ఏదైనా అత్యవసర సంస్థలో సమ్మె చేయాలంటే గతంలో 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. నేడు దానిని 60 రోజులకు మార్చివేశారు. అలాగే నోటీసు ఇచ్చిన వెంటనే లేబర్ కమీషనర్ కన్సిలియేషన్ వేయాలని, అది పెండింగ్‌లో ఉండగా సమ్మె చేయరాదని షరతు విధించారు. ఒకవేళ అప్పుడు సమ్మె చేస్తే దాన్ని చట్ట విరుద్ధ సమ్మెగా పరిగణించి, సమ్మె చేసిన వారికి, ప్రోత్సహించినవారికి జరిమానాతో పాటు జైలుశిక్ష కూడా విధించవచ్చు. అంటే, ఆచరణలో ఇక సమ్మె చేయడమే దుర్లభంగా మారుతుంది.



> కార్మికులకు ప్రధానంగా అవసరమైనవి గౌరవప్రదమైన వేతనం, పని ప్రదేశంలో భద్రత. వీటికి యాజమాన్యాలు ఒప్పుకోకపోవడం వల్లే కార్మికులు సంఘాలు పెట్టుకుంటారు, సమ్మెలు చేస్తారు. అందువల్ల వేతనం, సంఘం, సమ్మె – ఈ మూడూ కార్మికుల అస్తిత్వానికి ప్రధానం. వీటిని మోదీ ప్రభుత్వం ఈ లేబర్ కోడ్ల ద్వారా కాలరాస్తోంది.

పోనీ, ఈ లేబర్ కోడ్లలో కార్మికుల వేతనాలు, పని పరిస్థితులు, జీవన ప్రమాణాలు పెంచే అంశాలేమైనా ఉన్నాయా? దుర్భిణీ వేసి చూసినా కనిపించవు సరికదా మరింత దిగజారుడే కనపడుతుంది. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కార్మికుని కనీస వేతనం రోజుకు రూ.465గా ఇటీవలే కేంద్ర లేబర్ కమిషనర్ ప్రకటించారు. అంటే నెలకు 26 రోజులుగా భావిస్తే వచ్చే వేతనం కేవలం నెలకు రూ.12,090. ఈ వేతనమే జీవన ప్రమాణాలు పెంచేసేదిగా వ్యాస రచయితకు కనపడడం విడ్డూరమే. కేంద్ర సంస్థల్లోనే ఇలా ఉంటే, ఇక ప్రైవేటు సంస్థల గురించి చెప్పనవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం 'అంత్యోదయ' కింద పేదలకు ఇచ్చే రేషన్ కార్డు అర్హత నెలకు రూ.15వేలు. మోదీ ప్రభుత్వం కార్మికుని కనీస వేతనాన్ని దారిద్ర్య రేఖ కంటే తక్కువగా నిర్ణయించి, సంపద సృష్టికర్తలైన కార్మికులను నిత్య దరిద్రులుగా బతకమనడం దేశానికి శ్రేయస్కరం కాదు. ఇలా వేతనాలు పెంచక, సంఘాలు పెట్టుకోనివ్వక, సమ్మెలు చేయనివ్వకుండా ఈ లేబర్ కోడ్లు తయారు చేయడం అంటే కార్మికులను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలివేయడమే, వారిని బానిసలుగా మార్చేయడమే! ఫ్యాక్టరీ చట్టం ప్రకారం భద్రతా ప్రమాణాలు తనిఖీ చేసే ఇన్‌స్పెక్టర్ పేరు కూడా ఫెలిసిటేటర్‌గా మార్చేసి, అధికారాలన్నీ తీసేసి, కార్మికుల ప్రాణాలకు కూడా రక్షణ లేకుండా చేస్తోంది.

గిగ్ వర్కర్లకు ఏదో మేలు జరుగుతుందని భావించడం భ్రమే! ఎందుకంటే ఈ లేబర్ కోడ్లలో ఎక్కడా ప్రభుత్వం వీరి సంక్షేమం కోసం రూపాయి కూడా ఇస్తుందని లేదు. ఇక్కడ కూడా యాజమాన్యాల నుండే వసూలు చేస్తారట. అంటే తిరిగి ఆ సేవలు అందుకునే సామాన్యుల మీదే ఆ భారం పడుతుంది. శాశ్వత ఉపాధి దాదాపు లేనట్లుగా చేసి, కాంట్రాక్టు పద్ధతిని వ్యవస్థీకృతం చేసేలా అనేక అంశాలు ఈ కోడ్లలో పొందుపరిచారు. ఇక సంక్షేమం గురించి వేరే చెప్పనవసరం లేదు. పాతికేళ్లు, ముప్పైఏళ్ళు పైగా ఒక పరిశ్రమలో పనిచేసి, రిటైరయిన కార్మికునికి ఈపీఎస్ పేరున ఇస్తున్న పింఛన్ అత్యధికమందికి మూడువేల రూపాయలకు మించి లేదు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇస్తున్న నాలుగు వేల రూపాయల సామాజిక పింఛన్ కంటే కూడా ఇది చాలా తక్కువ. ఈ ఈపీఎస్ పింఛన్ తొమ్మిది వేల రూపాయలకైనా పెంచాలని ఎంత మొర పెట్టుకున్నా మోదీ ప్రభుత్వంలో చలనం లేదు. ఎన్పీఎస్, యూపీఎస్ పేరున కార్మికుల పొదుపు సొమ్మును షేర్ మార్కెట్లో పెట్టి మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోంది. ఇదీ! మోదీ ప్రభుత్వం శ్రామికులకు ఇస్తున్న గౌరవం.

కమ్యూనిస్టులు పరిశ్రమల నాశనమే విధానంగా పని చేస్తారని వ్యాసకర్త ఇంకో విమర్శ చేశారు. వాస్తవంగా మోదీ ప్రభుత్వం పాలించిన ఈ పదకొండేళ్ళ కాలంలో ఉత్పాదక రంగం బలహీనపడింది. అధికారిక లెక్కల ప్రకారమే అనేక చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు మూతబడ్డాయి. అన్నింటికి మించి, దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మగా ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మేయడమే మోదీ ప్రభుత్వ ప్రధాన విధానంగా ఉంది. మరోపక్క కమ్యూనిస్టులు ప్రభుత్వ రంగ పరిరక్షణకు పోరాడుతున్న కార్మికులకు పూర్తి అండగా నిలిచారు. కమ్యూనిస్టులు కార్మికులను ఓట్ బ్యాంకుగా చూస్తారని మరో అపవాదు వేశారు బీజేపీ విష్ణువర్ధన్‌రెడ్డి. వాస్తవమేమిటంటే కార్మికులను కులం, మతం, ప్రాంతాల పేరున విడదీసి, వారి ఐక్యతను విచ్ఛిన్నం చేసి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నది బీజేపీనే! దీనికి భిన్నంగా తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి, ప్రజల, దేశ ఐక్యతను కాపాడుతున్నది కమ్యూనిస్టులే. అటువంటి కమ్యూనిస్టులపై లేనిపోని నిందలు వేయడం సూర్యునిపై ఉమ్మివేయడం లాంటిదే!

● ఎ.అజశర్మ

ప్రపంచానికి 'రెక్కలొచ్చిన రోజు'

నార్త్ కరోలినాలోని కిట్టీ హాక్ సమీపంలో ఉన్న కిల్ డెవిల్ హిల్స్‌లో డేటన్, ఒహియోకు చెందిన ఇద్దరు సైకిల్ మెకానిక్‌లు... ఆర్విల్, విల్బర్ రైట్– ప్రపంచాన్ని మార్చేసిన రోజు 1903 డిసెంబర్ 17. వారి రైట్ ఫ్లైయర్ కేవలం 12 సెకన్ల పాటు గాలిలోకి లేచి, 120 అడుగుల దూరం మాత్రమే ప్రయాణించింది. ఇది తక్కువ దూరమే అయినా మానవజాతికి ఒక పెద్ద ముందడుగు.

రైట్ ఫ్లైయర్ అనేది స్ప్రూస్ కలప, నూలుగుడ్డ (కాటన్ మస్లిన్), చేతితో తయారుచేసిన చిన్న ఇంజిన్‌తో కూడిన ఒక సున్నితమైన యంత్రం. గ్లైడర్‌లతో, విండ్ టన్నెల్స్‌తో (గాలి సొరంగాలతో) సంవత్సరాల తరబడి చేసిన సూక్ష్మమైన ప్రయోగాలు, వాయుగతిక శాస్త్రం (ఏరోడైనమిక్స్)పై వారి తిరుగులేని పట్టు కారణంగా, ఆ సోదరులు చివరకు ప్రయోగానికి సిద్ధమయ్యారు. ఉదయం 10:35 గంటలకు, కొందరు సాక్షులు చూస్తుండగా, ఓర్విల్ రైట్ యంత్రంలోకి ఎక్కారు. ఆ యంత్రం లాంచింగ్ పట్టాల వెంబడి పరుగెత్తి, కేవలం 12 సెకన్ల పాటు ఎగిరింది. అది కవర్ చేసిన దూరం కేవలం 120 అడుగులు. ఇది నియంత్రిత విమానం. గాలిని జయించడం సాధ్యమని నిరూపించింది. ఆ రోజు సోదరులు మరో మూడు ప్రయాణాలు చేశారు, వాటిలో విల్బర్ నడిపిన సుదీర్ఘ ప్రయాణం 59 సెకన్లలో 852 అడుగులు.

రైట్ సోదరుల గొప్పతనం కేవలం ఇంజిన్ లేదా రెక్కలను నిర్మించడంలో లేదు, నియంత్రణ సమస్యను పరిష్కరించడంలో ఉంది. విమానం కదలికను మూడు కోణాలలో– పిచ్, రోల్, యా– పైలట్ చురుకుగా నిర్వహించాలని వారు అర్థం చేసుకున్నారు. ఈ ముఖ్యమైన అంతర్దృష్టి, ఇది వింగ్ వార్పింగ్, ఏలిరాన్‌ల వ్యవస్థకు దారితీసింది. ఈ రోజు ఎగురుతున్న ప్రతి విమానానికి అదే ఆధారం. ఒకప్పుడు ఓడ ద్వారా నెలలు పట్టే ప్రయాణం, ఇప్పుడు కేవలం గంటల్లో పూర్తవుతుంది. ఇది సంస్కృతులను అనుసంధానించింది, వేగవంతమైన సహాయ పంపిణీకి అవకాశం కల్పించింది. నిజమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సృష్టించింది. సురక్షితమైన, వేగవంతమైన, సమర్థమైన విమాన అవసరం– ఇంజిన్ రూపకల్పన నుంచి నావిగేషన్, వాతావరణ అంచనా వ్యవస్థల వరకు లెక్కలేనంత సాంకేతిక పురోగతిని ప్రేరేపించింది. ఎత్తుగా, వేగంగా ఎగరాలనే తపన అంతరిక్ష యుగానికి నాంది పలికింది. విమానం మనకు ఒక కొత్త దృక్పథాన్ని ఇచ్చింది. భూమిని పై నుంచి చూడటంతో పాటు, మన గ్రహం పట్ల ఉమ్మడి బాధ్యతను పెంచింది.

ఆవిష్కరణలు పెద్ద ప్రయోగశాలల నుంచి కాకుండా, ఉత్సుకతతో నడిచే వ్యక్తుల నిర్ణీత దృష్టి నుంచి వస్తాయి. రైట్ సోదరులను కేవలం చారిత్రక వ్యక్తులుగా కాకుండా, మానవ సామర్థ్యానికి శాశ్వత చిహ్నాలుగా చూడాలి. వారి విజయం– మొదటి అడుగును ధైర్యంతో వేయాలని మనకు సూచిస్తుంది.

– ప్రొ. రాంబాబు మోకాటి

గెలుపు సరే, ఓటమిని ఒప్పుకోవటం ఎలా?

సర్కారు కొలువుల వేటలో ఓటమిని ఒప్పుకోలేక, తమకు రాని ఉద్యోగాలు వచ్చినట్టు చెప్పుకున్న మూడు సంఘటనలు ఇటీవల తెలంగాణలో జరిగాయి. మెదక్ ప్రాంతానికి చెందిన ఒక అభ్యర్థి ఇటీవలి గ్రూప్–1 జాబితాలో డీఎస్పీ ఉద్యోగం పొందినట్టు ప్రచారం చేసుకున్నాడు. మరొక అభ్యర్థి తాను యూపీఎస్సీ పరీక్షలో ఎంపిక అయ్యానంటూ ఒక కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళి హల్‌చల్ చేశాడు. సైబరాబాద్ కమిషనరేట్‌లో పోలీస్ కానిస్టేబుల్ ఉదంతం ఒకటి ఇటువంటిదే బైటపడింది.

ఈ ముగ్గురూ బాగా చదువుకుని పోటీ పరీక్షలకు తయారైనవారే. విజయం సాధించలేకపోవడంతో ఇలా అసాధారణంగా ప్రవర్తించారు. పరాజయానికి కుంగిపోయి తనువు చాలించేవారి గురించి మనం విని ఉన్నాం. అయితే ఈ మూడు సంఘటనల్లో ఓటమిని స్వీకరించలేని మానసిక అవస్థ కనపడుతున్నది. ఓటమిని ఒప్పుకుని, దాని నుండి నేర్చుకోవలిసింది నేర్చుకుని ముందుకు సాగే ఒడుపును ఇప్పటి తరాలు కోల్పోతున్నారేమో అనిపిస్తోంది.

ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని పోటీ పరీక్షలకు కూర్చునే యువత, దాన్ని సాధించలేనప్పుడు, ఆ ఉద్యోగ సాధనా ప్రక్రియలోనే నేర్చుకున్న పాఠాలను తమ జీవితాలలో ముందుకు సాగేందుకు ఎట్లా వాడుకోవాలి అనే దిశగా ఆలోచన చేయాలి. వారికి సూచనలు, సలహాలు ఇచ్చేవారు ఈ తరహా ఆలోచనను వారిలో పెంచాలి.

మన దేశంలో సర్కారు ఉద్యోగం కోసం పోటీ తీవ్రంగా పెరిగిపోయింది. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య కూడా తగ్గిపోవడం మొదలైంది. పోటీ తీవ్రత వల్ల విజయం సాధించే అవకాశాలు 2శాతం కంటే తక్కువ మంది అభ్యర్థులకు మాత్రమే ఉంటాయి. యూనియన్ సివిల్ సర్వీసులలో ఈ విజయ శాతం 0.17 మాత్రమే. పోటీ పరీక్షల అభ్యర్థులు ఈ వాస్తవాన్ని మరిచిపోతేనే వారి ప్రవర్తనలో ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి.


నేటి వ్యాపార సంస్కృతిలో విజయాన్ని కీర్తించడం, విజయం సాధించడాన్ని ఆకాశానికి ఎత్తేయడం బాగా పెరిగిపోతోంది. గెలుపు కథలకే డిమాండ్ ఉన్న ఈ సంస్కృతిలో అపజయాన్ని ఎదుర్కొనే కళ మరుగునపడిపోతున్నది. గెలుపు సరే బతకడం ఎలా' పేరుతో కె.ఎన్.వై. పతంజలి రాసిన పుస్తకం ఇప్పుడు ఎవరికీ గుర్తులేదు. జీవితంలో అనేక ఆశాభంగాలు ఉంటాయి. కానీ నేటి న్యూక్లియర్ కుటుంబాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ ఆశాభంగాలకు సరిగా సిద్ధం చేయటం లేదు. అపజయం అన్నది ఇప్పుడు పూర్తిగా దాచిపెట్టాల్సిన, లోగొంతుకలో మాత్రమే మాట్లాడాల్సిన విషయం అయిపోయింది. కానీ పిల్లలు అపజయాలకు సిద్ధం కావాలంటే తల్లిదండ్రులు వారితో తమ జీవితంలోని అపజయాలను పంచుకోవాలి. అప్పుడే ఏ ఓటమీ శాశ్వతం కాదన్న నమ్మకం పిల్లలలో కలుగుతుంది.

> నేటి వ్యాపార సంస్కృతిలో విజయాన్ని కీర్తించడం, విజయం సాధించడాన్ని ఆకాశానికి ఎత్తేయడం బాగా పెరిగిపోతోంది. గెలుపు కథలకే డిమాండ్ ఉన్న ఈ సంస్కృతిలో అపజయాన్ని ఎదుర్కొనే కళ మరుగునపడిపోతున్నది. అపజయం అన్నది ఇప్పుడు పూర్తిగా దాచిపెట్టాల్సిన, లోగొంతుకలో మాత్రమే మాట్లాడాల్సిన విషయం అయిపోయింది.



1970ల వరకు మన గ్రామీణ, నగర ప్రాంతాల్లో పిల్లలను కుటుంబాలతోపాటు, చుట్టూ వీధులూ, సమాజం కూడా పెంచేవి. 1990ల తరువాత పెరిగిన మార్కెట్ భావజాలం మధ్య కుటుంబం మాత్రమే పిల్లలకు అన్నీ సమకూర్చే యూనిట్‌గా మారిపోయింది. అయితే ఆ కుటుంబానికి ఉండే మానసిక, సామాజిక వైశాల్యం చాలా పరిమితం కావటం వల్ల 'అపజయం వల్ల తిరస్కారం', 'ఏదో ఒక తీరులో విజయం సాధిస్తే చాలు అదే పురస్కారం' అన్నదే ముఖ్యమైన విలువగా యువత మనో ప్రపంచాన్ని నింపివేస్తున్నాయి. దీనితో ఓటమిని ఒప్పుకోగలిగే మానసిక బలం వారికి లేకుండా పోతున్నది. మనిషి పెట్టుకునే లక్ష్యం ఆ మనిషి కోరిక మాత్రమే. కోరుకున్న ప్రతిసారీ కోరిక తీరవలిసిందే అనే ఆలోచనా ధోరణి ప్రకృతి నియమానికే విరుద్ధం. కోరుకున్న లక్ష్యం సాధించేందుకు చేసే ప్రయత్నంలో ఓడిపోతే, ఆ లక్ష్యం కోసం పయనంలో నేర్చుకున్న మంచి గుణాలను, అలవాట్లను తమ నిత్యజీవితంలో ఉంచుకోవాలి. లక్ష్యం కంటే, వీటికి విలువ ఎక్కువ. ఏ ఓటమీ శాశ్వతం కాదు. అనుకున్న కోరిక నెరవేరక పోవడం అసహజమేమీ కాదు. సాధించలేని లక్ష్యాన్ని వదిలివేసి, మరో లక్ష్యం వైపు ప్రయత్నాన్ని ఎక్కుపెట్టడమే జీవితం. ఏ మనిషి గతమైనా, మొత్తం మానవ సమూహగతమైనా అనేక ఓటములూ, కొన్ని మాత్రమే గెలుపుల సంపుటి. పరాజయాలన్నీ పతనం దిక్కుకే నడిపేవి అయివుంటే మానవ నాగరికత వికసించేదే కాదు. సర్కారు కొలువుల లక్ష్యాన్ని నిర్దేశించుకుని పోటీ పరీక్షలలో నిలబడే యువత ఈ అవగాహనను పెంచుకోవాలి. లేకపోతే మానసిక వికృతులు పెరిగి సామాజిక, వ్యక్తిగత విధ్వంసాలు జరుగుతాయి.

■ డా. హారతి వాగీశన్
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ పొలిటికల్ సైన్స్
నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, హైదరాబాద్





చోర్ గ్యాంగ్‌ను అరెస్టు చూపిన పోలీసు అధికారులు



● కొమ్మాలపాటి శ్రీధర్ (పల్నాడు)



● పిల్లి మాణిక్యరావు (గుంటూరు)



● సలగల రాజశేఖర్ బాబు (బాపట్ల)

టీడీపీ అధ్యక్షులు వీరేనా?

- పార్లమెంటరీ పగ్గాలపై కసరత్తు పూర్తి
- పల్నాడు, బాపట్ల జిల్లా పగ్గాలు పాతవారికేనా
- పిల్లి మాణిక్యరావుకు దక్కనున్న గుంటూరు జిల్లా బాధ్యత
- నేడో, రేపో అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్ష పదవులకు సంబంధించి ఎట్టకేలకు అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అనేక కసరత్తులు చేసిన అధిష్ఠానం జిల్లా పగ్గాలను ఎవరికి ఇవ్వాలనే అంశంపై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. పార్టీకి సంబంధించి కీలకమైన జిల్లా అధ్యక్ష పదవుల భర్తీపై కొంతకాలంగా అనేక ఊహాగానాలు వస్తున్నాయి. పల్నాడు, బాపట్ల పగ్గాలు పాతవారికే కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం. గుంటూరు జిల్లా బాధ్యులుగా పిల్లి మాణిక్యరావును ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి నేడో, రేపో అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉంది. సామాజిక సమీకరణలు, సీనియారిటీతో పాటు శ్రేణుల అభిప్రాయాలకు అనుగుణంగా జిల్లా అధ్యక్ష పదవులకు నేతలను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయా నేతలకు సమాచారం రాగా దాదాపు వారికే ఖరారయ్యే అవకాశం ఉందని సమాచారం. పార్టీ అధ్యక్ష పీఠం రూపంలో వరమాల పడడం ఓ ఎత్తయితే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల రూపంలో ఆయా సారథుల కు పెద్ద సవాల్ ఎదురుకానుంది.

21 మందిలో సలగలపైనే మొగ్గు

దళితులకు సముచిత స్థానం దక్కుతుందనే (మిగతా 8వ పేజీలో)

చోర్‌గ్యాంగ్‌తో.. చెట్టపట్టాల్

- 50కిపైగా కార్లు చోరీ.. విక్రయం.. కేసు లేదు
- ముఠా నుంచి కార్లు తీసుకున్న పోలీసు అధికారులు
- తాజాగా ఓ అధికారి నుంచి రెండు కార్లు స్వాధీనం?
- రోడ్డు ప్రమాదం కేసుతో చేతులు దులుకున్నట్లేనా?
- విచారణలో నేరాలు వెలుగు చూసినా ముఠాకు అండ

నేరాలను అరికట్టాల్సిన కొందరు పోలీసులు చోర్‌గ్యాంగ్‌తో అంటకాగారా.. అంటే కొందరు అధికారుల తీరు చూస్తే అలాగే ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. చిలకలూరిపేట బైపాస్ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి కేసు దర్యాప్తులో చోర్ గ్యాంగ్ నేరాలు అనేకం వెలుగు చూసినా వాటిని తొక్కి పెడుతున్నారని సమాచారం. కొందరు పోలీసు అధికారుల అండతో ఏఎస్ఐ కుమారుడి ఆధ్వర్యంలో చోర్ గ్యాంగ్ నేరాలకు పాల్పడగా.. అవన్నీ బహిర్గతం చేస్తే తమకు అప్రతిష్ఠ అని కేసు నమోదు చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పల్నాడు జిల్లాలో ఓ కీలక అధికారి చోర్ గ్యాంగ్‌కు సహకరించారన్న ప్రచారం జరుగుతోంది. 50కి పైగా నెంబర్ ప్లేట్లు.. చాసిస్ నెంబర్లు మార్చి కార్లు విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసినా కేసు నమోదు చేయలేదని తెలిసింది. రోడ్డు ప్రమాదం వరకే కేసు నమోదు చేసి చోర్ గ్యాంగ్‌లోని ఐదుగురిని అరెస్టు చేసి చేతులు దులుపుకుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ముఠా వద్ద కొందరు పోలీసు అధికారులు.. రాజకీయ నేతలు కూడా కార్లు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. ఈ నేరాలను వెల్లడిస్తే పోలీసు శాఖకు కళంకం వస్తుందని వాటిని బహిర్గతం కాకుండా జాగ్రత్త పడుతున్నట్లు ప్రచారం.

పోలీసుశాఖ తీరుపై అనుమానాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఏఎస్ఐ కుమారుడి నేతృత్వంలో చోర్‌గ్యాంగ్ ఐదుగురు బీటెక్ విద్యార్థుల మృతికి కారణమవగా.. ఈ కేసు దర్యాప్తులో ఆ ముఠా నేరాలు అనేకం వెలుగుచూస్తున్నాయి. అయితే వీటిని బహిర్గతం కాకుండా పోలీసు అధికారులు తొక్కిపెడుతుండటంపై విమర్శలు వస్తున్నాయి. చోర్ గ్యాంగ్‌కు చెందిన నాయుడు తండ్రి ఏఎస్ఐ మదమంచి శ్రీనివాసరావుని డీఎస్పీ కార్యాలయ నుంచి బదిలీ, చిలకలూరిపేట ఎస్ఐ రహంతుల్లా సస్పెండ్ చేసి పోలీసుశాఖ చేతులు దులుపుకున్నదన్న విమర్శలున్నాయి. విద్యార్థుల మృతి కేసులో ఏఎస్ఐ కొడుకు మదమంచి వెంకట అనుజ్ఞ నాయుడు అలియాస్ వెంకట్ అలియాస్ నాయుడు (నరసరావుపేట), పుల్లంశెట్టి మహేష్ (నరసింగపాడు), (మిగతా 8వ పేజీలో)



వెలుగుచూసిన నేరాలు

- చిలకలూరిపేట ప్రాంతంలో పది కార్లు, నరసరావుపేట ప్రాంతంలో 40 వరకు కార్లు సదరు ముఠా విక్రయించినట్లు విచారణలో తేల్చిన పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- చోర్ గ్యాంగ్ రవాణా అధికారుల అవతారమెత్తి వాహనదారుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం.
- గతంలో బంగారం విక్రయిస్తామని నరసరావుపేట ప్రాంతంలో రూ.40 లక్షల వరకు కొట్టేసినట్లు అప్పట్లో పోలీసు శాఖకు ఫిర్యాదు అందినా చర్యలు తీసుకోకుండా వదిలేసినట్లు విమర్శలున్నాయి.

కొల్లిపరలో స్క్రబ్ టైఫస్

- అప్రమత్తంగా ఉండాలన్న వైద్యాధికారి

కొల్లిపర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర శ్రీవీరభద్రస్వామి(బీసీ) కాలనీలో ఒకరికి స్క్రబ్ టైఫస్ నిర్ధారించినట్లు వైద్యాధికారి నీహ తెలిపారు. దీంతో కాలనీలో వైద్యాధికారి నీహ వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పంచాయతీ సిబ్బంది శానిటేషన్ నిర్వహించి బ్లీచింగ్ చల్లారు. అంతకముందు మున్నంగి ఆరోగ్య కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించి స్క్రబ్ టైఫస్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వైద్య సిబ్బందికి నీహ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పేడపురుగు కుట్టడం వల్ల స్క్రబ్ టైఫస్ వ్యాధి వస్తుందని, శరీరంపై దద్దుర్లు, జ్వరం, తలనొప్పి, వణుకు, కండరాల నొప్పులు లక్షణాలని తెలిపారు. కొల్లిపరలో ఇంటింటికి తిరిగి సర్వే చేసి స్క్రబ్ టైఫస్ లక్షణాలు ఉంటే వారి పేర్లను నమోదు చేయాలన్నారు. స్క్రబ్ టైఫస్‌ని సకాలంలో గుర్తించకపోతే రోగికి శ్వాస సంబంధిత వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు, ఏఎన్ఎంలు లక్ష్మి, అనితాప్రియదర్శిని, అనితా, కల్యాణి, జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సగం మందికే లబ్ధి

- పీఎం మాతృ వందనపై కొరవడిన అవగాహన

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏటా పాతిక వేలకు పైగా వివాహిత మహిళలు శిశువులకు జననం ఇస్తుండగా వారిలో సగం మంది కూడా ప్రధానమంత్రి మాతృ వందన పథకంలో నమోదు కావడం లేదు. ఈ పథకంపై అవగాహన కొరవడింది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పీఎంఎంవీవై కొన్ని నెలల క్రితమే ఐసీడీఎస్ పరిధిలోకి వచ్చింది. అయినా ఆశించిన రీతిలో గర్భిణులకు ఈ పథకం ద్వారా లబ్ధి జరగలేదు. ప్రధాన మంత్రి మాతృవందన స్కీమ్ కింద గర్భిణులు, పాలిచ్చే తల్లులకు వారి మొదటి కాన్పుకు రూ.5 వేలు చెల్లిస్తారు. అలానే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో కాన్పు అయితే అదనంగా మరో రూ.వెయ్యి చెల్లిస్తారు. రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిస్తే రూ.6 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తారు. ఇది మెరుగైన లింగ నిష్పత్తిని ప్రోత్సహించడానికి ఉద్దేశించింది. తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఈ పథకాన్ని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్నది. 2024-25లో మొదటి కాన్పు మహిళలు 7,656 మంది, రెండో కాన్పులో ఆడ శిశువులకు జననం ఇచ్చిన తల్లులకు 2,484 మందికి లబ్ధి జరిగింది. మొత్తం 11,495 మందికి రూ.4.46 కోట్లను జమ చేశారు. ఈ పథకం గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు తగిన అవగాహన కల్పించడం లేదు. దీంతో గత ఏడాది 28,800 మంది గర్భిణులు శిశువులకు జననం ఇస్తే వారిలో సగం మంది కూడా పీఎంఎంవీవై ద్వారా లబ్ధి పొందలేకపోయారు. ఈ నేపథ్యంలో ఐసీడీఎస్ జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

ఎకరాకు నష్టం.. రూ.28,000



జిల్లాలో పతనమైన మొక్కజొన్న ధర

- గిట్టుబాటు ధర దక్కక రైతుల ఆందోళన
- వ్యాపారులు క్వింటాల్ రూ.1,600 కొనుగోలు మద్దతు రూ.2,400..
- ముఖం చాటేసిన మార్క్‌ఫెడ్

(తెనాలి ఆంధ్రజ్యోతి)

మొక్కజొన్న పంట చేతికి వచ్చిన సమయంలో ధర పతనమైంది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర పతనమైన సమయంలో రంగంలోకి దిగి రైతులను ఆదుకోవాల్సిన మార్క్‌ఫెడ్ ముఖం చాటేసింది. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న కింటాల్‌కు రూ.2,400 మద్దతు ధర ప్రకటించింది. ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నట్లు రైతులు చెప్తున్నారు. కాగా మద్దతు ధర కంటే రూ.800 తక్కువకు వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఈ కారణంగా రైతులు ఎకరాకు రూ.28,000 వరకు నష్టపోతున్నారు. జిల్లాలో పొగాకును నిషేధించిన ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేసుకోవాలని సూచించింది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు ఖరీఫ్‌లో కూడా మొక్క జొన్న సాగు చేశారు. పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 10,348 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఏటా కంటే రెండు రెట్లు అధికంగా సాగైంది. దిగుబడులు ఇంటికి వచ్చే సమయంలో ధర పతనమైంది. రెండు నెలల క్రితం వరకు మొక్కజొన్న క్వింటాల్ రూ.2,200 వరకు (మిగతా 8వ పేజీలో)

రూ.600 కోట్లు రెండు టవర్లు



- జోరుగా ఏపీఎన్ఆర్‌టీ ఐకానిక్ టవర్ల పనులు
- జనవరికి మొదటి దశ ఫౌండేషన్ పనులు పూర్తి



రాజధానిలో ఏపీఎన్ఆర్‌టీ ఐకానిక్ టవర్స్ కాలమ్స్ ఏర్పాటు పూర్తి చేసిన ప్రదేశం



గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి తలమానికంగా ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు (ఏపీఎన్ఆర్‌టీ) సొసైటీ రూ.600 కోట్లతో రెండు టవర్లను మూడు దశల్లో నిర్మించనున్నది. 2019కి ముందే కోర్ క్యాపిటల్ ఏరియాలోని రాయపూడిలో సీఆర్‌డీఏ ద్వారా ఐదు ఎకరాల భూమిని పొందిన ఈ సంస్థ నిర్మాణ పనులు ప్రారంభించేసరికి వైసీపీ అధికారంలోకి వచ్చి రాజధాని పనులను ఎక్కడికక్కడ నిలిపేసింది. ఈ క్రమంలో ఐకానిక్ టవర్స్ పనుల ను అర్ధంతరంగా నిలిపేయాల్సి వచ్చింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సొసైటీ పాలకవర్గాన్ని పిలిపించి మాట్లాడటంతో పనులను పునః ప్రారంభించి నిరంతరాయంగా కొనసాగిస్తోన్నది. 33 అంతస్తుల ఆకాశహర్మ్యం కావడంతో ఫౌండేషన్ పనులను పటిష్ఠంగా పూర్తి చేస్తోన్నది. రాజధానిలో ఈ2, ఈ3 రోడ్ల మధ్య నిర్మాణం చేపట్టింది. ఐకానిక్ టవర్స్‌కు సంబంధించి ఇప్పటికే బ్లూప్రింట్‌ని విడుదల చేసి అన్నిరకాల అనుమతులు కూడా ఏపీసీఆర్‌డీఏ నుంచి తీసుకున్నది. 29 అంతస్తుల వరకు 3 బీహెచ్‌కే ఫ్లాట్స్, కమర్షియల్ స్పేసెస్ ఉంటాయి. పైన నాలుగు అంతస్తులను కామన్ ఏరియాగా అభివృద్ధి చేయనున్నారు. 11.65 లక్షల ఎస్ఎఫ్‌టీతో బిల్టప్ ఏరియా ఉంటుంది. ఇందులో నిర్మించబోయే 52 నివాస ఫ్లాట్లను సొసైటీలోని సభ్యులకే విక్రయించారు. ఇవి ఎప్పుడో బుకింగ్ కూడా అయిపోయాయి. భారీ ఐకానిక్ టవర్ కావడంతో 1176 పిల్లర్లను నిర్మిస్తున్నారు. రాయపూడిలో భూమి తేలికపాటిది కావడంతో దాదాపుగా 12 మీటర్ల లోతులో ఉన్న గట్టి నేల వరకు పిల్లర్ల గుంతలు తవ్వారు. మొత్తం ఎక్స్‌కవేషన్ పనులు 30 శాతం వరకు ఇప్పటికే పూర్తి అయ్యాయి. ఫేజ్-1 ఫౌండేషన్ వర్కులు జనవరి నాటికి పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. మరో రెండేళ్ల వ్యవధి లోనే ప్రాజెక్టు మొత్తాన్ని పూర్తి చేసి ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహించేందుకు సంస్థ సన్నద్ధమౌతున్నది.



జేఈఈ శిక్షణలో విద్యార్థినులు 8

ప్రభుత్వ కళాశాలలో జేఈఈ శిక్షణ

- వారంలో మూడు రోజులు తరగతుల నిర్వహణ
- ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేసిన ప్రభుత్వం

పొలమే... ప్రయోగశాల

- కొత్త వంగడాలు పండించే ఘనాపాటి.. మోహన్ రెడ్డి
- 40కి పైగా వరి సన్న రకాల సాగుతో కొత్త రికార్డు
- తక్కువ ఖర్చు, ఎక్కువ దిగుబడిపై రైతులకు పాఠాలు



8

నేడు,రేపు కలెక్టర్ల సదస్సు

రేపటి నుంచి ఏకీకృత సర్వే

- సిబ్బందికి శిక్షణ నేపథ్యంలో వాయిదా

స్క్రబ్ టైఫస్‌పై నేడు చర్చా కార్యక్రమం

- వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల రాక

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

దుబాయ్‌లో ఉద్యోగావకాశాలు 6

ఇంధన పొదుపు అందరి బాధ్యత

వారోత్సవాల్లో కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంధన వనరుల పొదుపు ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తెరగాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన వనరుల పొదుపు వారోత్సవాలలో భాగంగా విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీని మంగళవారం కలెక్టరేట్ వద్ద జేసీ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఇంధన పరిరక్షణ, పొదుపు చిట్కాల ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఇంధన వనరుల పొదుపు పాటిస్తామని, వృథాను అరికడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధన వనరుల పొదుపుతో భవిష్యత్తు తరాలకు ఇంధన భద్రత భరోసా సాధ్యం అవుతుందన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించటం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వల్ల వచ్చే కర్బన ఉద్గారకాలను తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. ఇంధన వనరుల ఉత్పత్తిని తగ్గించటం వల్ల బొగ్గు, గ్యాస్, క్రూడ్ అయిల్ వంటి శిలాజ ఇంధనాలు, సహజ వనరులను కాపాడుకోవచ్చని వివరించారు. కార్యాలయాలతో పాటు, ఇంటిలోను అవసరం లేనప్పుడు తప్ప సరిగా లైట్లు, ఫ్యాన్లు ఆపివేయాలన్నారు. సోలార్ వంటి పునరాత్పక ఇంధన వనరుల వినియోగించుకోవాలన్నారు. ఎనర్జీ ఎఫిషియన్సీలో దేశంలోనే రాష్ట్రం అవార్డు సాధించిందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజా వలి, సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, సీఆర్డీఏ సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఎమ్ శ్రీనివాసరావు, ఈఈలు తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, కే సత్యనారాయణ, నాగేశ్వరరావు, హరిబాబు, సూర్యప్రకాష్, ఎస్ఏఓ పాశం రామిరెడ్డి, డీఈఈలు రాజమోహనరావు, ఎన్ గురవయ్య, ముస్తాక్ అహ్మద్, సురేష్‌బాబు, రమేష్, కే సాంబశివరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ర్యాలీలో కలెక్టర్ అన్సారియా, జేసీ శ్రీవాస్తవ, ఎస్ఈ రమేష్ తదితరులు

శ్రీనివాసుని కల్యాణంపై సమీక్ష

● నేడు కల్యాణోత్సవం పనులు ప్రారంభం



శ్రీనివాసుని కల్యాణం ఏర్పాట్లపై దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న పిడుగురాళ్లలో జరిగే శ్రీనివాసుని కల్యాణం పల్నాడు ప్రజలు గుర్తుండిపోయేలా జరిపేందుకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టి సారించారు. కల్యాణోత్సవం ఏర్పాట్లపై మంగళవారం ఎమ్మెల్యే యరపతినేని దేవాదాయశాఖ అధికారులు, కూటమి నేతలతో సమీక్ష నిర్వహించారు. కళ్యాణోత్సవం ఏర్పాట్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీని కోసం కూటమి నేతలతో వివిధ కమిటీలను ఏర్పాటు చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏర్పాట్లపై యరపతినేని పలుమార్లు పార్టీ నేతలు, మున్సిపల్ చైర్మన్ కె.వి.సుబ్బారావు, వడ్లపల్లి నరేశ్వరరావు, కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, పిల్లి చెన్నారావు, అధికారులతో మాట్లాడి తగు సూచనలు ఇచ్చారు. సమీక్షలో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ అచ్యుత్, సత్తెనపల్లి డివిజన్ దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి, డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన ఈవోలు పాల్గొన్నారు.

దుబాయిలో ఉద్యోగ అవకాశాలు

గుంటూరు (విద్య), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఓం క్యాప్ ఆధ్వర్యంలో దుబాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి కొండ సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో 21 నుంచి 37 సంవత్సరాల మధ్య గల పురుష అభ్యర్థులు ఇందుకు అర్హులని అన్నారు. దుబాయ్‌లోని ప్రముఖ లాజిస్టిక్స్ ఏవియేషన్ రంగంలో పనిచేయడానికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9988853335, 8712655686 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి ఏకీకృత సర్వే

● సిబ్బందికి శిక్షణ నేపథ్యంలో వాయిదా

గుంటూరు సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి ఆరంభం కావాల్సిన ఏకీకృత కుటుంబ ప్రయోజనాల సర్వే తాత్కాలికంగా వాయిదా వేస్తూ ప్రభుత్వం మెమో జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సిన దృష్ట్యా సర్వేను వాయిదా వేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు సిబ్బందికి మండలస్థాయిలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. 18వ తేదీ నుంచి సర్వేను యథావిధిగా నిర్వహించాలని ఆదేశించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

నరసరావుపేటలీగల్/చిలకలూరిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏడు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను చిలకలూరిపేట పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ, గత నెల 28న చిలకలూరిపేటలోని గాంధీ పేటలో నివసిస్తున్న బైరా సుజాత గృహంలో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ. 5.55 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు చోరీ చేసినట్లు ఫిర్యాదు నమోదైందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టి సాంకేతిక సాయంతో నిందితులను గుర్తించినట్లు చెప్పారు. ఉత్తరాఖండ్, హరి యాణ, ఉత్తర్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన ఈ దొంగల ముఠా సభ్యులు వివిధ రాష్ట్రాల్లో అనేక దొంగ తనాలు చేశారన్నారు. వీరిపై ఏడు రాష్ట్రాల్లో చోరీ కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితులు దుప్పట్లు అమ్మేవారిగా పట్టణంలో పగటిపూట తిరుగుతూ, తాళం వేసిన ఇళ్లను గమనించి రాత్రి సమయంలో చోరీకి పాల్పడతారన్నారు. వీరిలో ఒకరు వెల్డింగ్ పనులు చేస్తూ చిలకలూరిపేటలోనే నివాసం ఉంటున్నారన్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ. లక్ష 25 వేల చోరీ సొత్తును రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన చిలకలూరిపేట పట్టణ సీఐ పి.రమేష్ బాబు, సిబ్బందిని ఆయన అభినందించారు రివార్డు నిమిత్తం ఎస్పీకి సిఫారసు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



సమావేశంలో దొంగల ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు, పక్కన సీఐ రమేష్

పీఎఫ్ రుణాలను తిరస్కరించడం తగదు

గుంటూరు సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న వివిధ క్యాడర్ల ఉపాధ్యాయుల పీఎఫ్ రుణాలను అసంబద్ధ ఆడిట్ అభ్యంతరాలతో తిరస్కరించడం తగదని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఆడిట్ అధికారిణి బి.మధురిమను గుంటూరులో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ, అవసరాలకు ఉపయోగపడని పీఎఫ్ సొమ్ము ఎందుకని ప్రశ్నించారు. లబ్ధిదారులు అనారోగ్యం పాలైనప్పుడు పీఎఫ్ లోన్‌కు దరఖాస్తు చేసుకుంటే రూ. ఐదు లక్షలు దాటితే సివిల్ సర్జన్, ఆ లోపు అయితే అసిస్టెంట్ సివిల్ సర్జన్ మెడికల్ సర్టిఫికెట్ తేవాలని చెబుతూ దరఖాస్తును తిరస్కరిస్తున్నారని అన్నారు. ఈ నిబంధనలు ఉపాధ్యాయులకు పూర్తి విరుద్ధమని, ఎన్జీవోలకు వర్తించే వాటిని ఉపాధ్యాయులకు అన్వయించడం తగదని అన్నారు. అనంతరం ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖలీద్ మాట్లాడుతూ, పీఎఫ్ రుణం పెట్టుకున్నవారిని, పదవీవిరమణ అనంతరం తుది చెల్లింపులకు ఉపాధ్యాయులకు ఫోన్ చేసి వ్యక్తిగతంగా కలవాలని చెబుతున్నారని ఇలా ఎందుకు అడుగుతున్నారో తెలియటం లేదని అన్నారు. వీరి వినతిపై జిల్లా ఆడిట్ అధికారి మధురిమ స్పందిస్తూ, ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, జి.దాస్, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ యు.వందనం, జిల్లా కౌన్సిలర్లు సయ్యద్ జహంగిర్, కృష్ణారావు, గురుమూర్తి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆడిట్ అధికారి మధురిమకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు బసవలింగారావు తదితరులు

కిట్స్‌లో నేటి నుంచి బూట్ క్యాంపులు

వట్టిచెరుకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామ పరిధిలోని కిట్స్ కళాశాలలో బుధవారం నుంచి పీఎం ఎస్‌హెచ్‌ఆర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ బూట్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల్లో ఇన్నోవేషన్ డిజైన్ థింకింగ్‌ను పెంపొందించడమే లక్ష్యంగా మూడు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాదు, ఆర్జేడీ వి.లింగేశ్వరరెడ్డి హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అనుమతించిన ఏఐసీటీఈ ఎంవోఈలకు సుబ్బారావు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కోయ శేఖర్, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, ఎస్‌పీవోసీ డాక్టర్ అరుణ పాల్గొని వర్క్‌షాపులు నిర్వహిస్తారని వెల్లడించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు

హెడ్‌క్వార్టర్స్‌లో పని చేస్తారా..!

● డివిజనల్ ఉద్యోగులకు రైల్వే శాఖ విజ్ఞప్తి
● హెచ్‌ఆర్‌ఎంఎస్ ద్వారా దరఖాస్తుల ఆహ్వానం
● జనవరి 17 వరకు గడువు

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం హెడ్ క్వార్టర్స్‌గా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ (ఎస్‌సీవోఆర్)లో పనిచేసేందుకు తమ ఆసక్తిని తెలియజేయాలని రైల్వే సంస్థ డివిజనల్ రైల్వే ఉద్యోగులకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం నోటీసును జోన్ పరిధిలోని డివిజనల్ ఆఫీసులకు పంపించింది. పర్మినెంట్ నాన్ గెజిటెడ్ రైల్వే ఉద్యోగులు మాత్రమే హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేసేందుకు ఆసక్తిని తెలియజేయాలని కోరింది. దరఖాస్తులను హెచ్‌ఆర్‌ఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా జనవరి 17వ తేదీ లోపు పంపించాలని సూచించింది.

● కొత్త ఆఫీసులో ప్రస్తుత స్థానమే..

ప్రస్తుతం ఏ కేటగిరీలో అయితే ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారో అందుకు సమానమైన పోస్టింగ్‌ను జోనల్ ఆఫీసులో కల్పిస్తారు. ఆప్షన్ ఒకసారి ప్రాసెస్ అయితే అదే ఫైనల్ అవుతుంది. ఇప్పటికే కొంతమంది ఉద్యోగులు దరఖాస్తులను నేరుగా పంపించారు. వాళ్లంతా కూడా హెచ్‌ఆర్‌ఎంఎస్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ముందు పంపినా అందరికంటే ముందుగా దరఖాస్తులను పరిగణించడం కుదరదని జోనల్ రైల్వే స్పష్టం చేసింది. దక్షిణ మధ్య, తూర్పు కోస్తా రైల్వే హెడ్‌క్వార్టర్స్‌లలో వలంటీర్స్‌కు తొలి ప్రాధాన్యమిస్తారు. ఆ తర్వాత విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లతో పాటు ఎస్‌సీఆర్‌లోని ఇతర డివిజన్లకు, వాల్తేరు డివిజన్ కాకుండా ఆ జోన్‌లోని ఇతర డివిజన్లలో విధులు నిర్వహిస్తున్నవారికి ప్రాధాన్యమిస్తారు. మూడో ప్రాధాన్యాన్ని ఇండియన్ రైల్వేస్‌లోని అన్ని డివిజన్ల ఉద్యోగులకు ఇస్తారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటించే పోస్టులకు మాత్రమే ఉద్యోగులు ఆసక్తిని తెలియజేయాలని స్పష్టం చేసింది. దరఖాస్తులన్నింటినీ పరిశీలించి షార్టు లిస్టు చేస్తామని జోన్ అధికారవర్గాలు తెలిపాయి. నిబంధనల ప్రకారం సీనియారిటీపై తుదినిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నాయి.

తప్పుల తడక

● జన్మభూమి 'టైం టేబుల్' సవరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు టైం టేబుల్‌ను దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) అధికారులు సవరించారు. ఫిబ్రవరి 15 వ తేదీ నుంచి విశాఖపట్నం-లింగంపల్లి మార్గంలో నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు వేళలను మారుస్తూ రూపొందించిన టైం టేబుల్‌లో తెనాలి-గుంటూరు-సత్తెనపల్లి రైల్వే స్టేషన్లకు రైలు చేరుకునే వేళల్లో తప్పులు దొర్లాయి. ఈ విషయమై 'తప్పుల తడకగా జన్మభూమి టైం టేబుల్' శీర్షికన ఈ నెల 14న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఎస్‌సీఆర్ ఉన్నతాధికారులు స్పందించారు. తమ తప్పులను ఒప్పుకుంటూ సవరించిన టైంటేబుల్‌ను విడుదల చేశారు. పాత టైంటేబుల్ ప్రకారం తెనాలి నుంచి మధ్యాహ్నం 12.55 గంటలకు బయలుదేరి గుంటూరుకు 1.45 గంటలకు చేరుతుంది. గుంటూరు నుంచి 1.50 గంటలకు బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ 45 కి.మీ దూరంలోని సత్తెనపల్లికి కేవలం ఆరు నిమిషాల్లో 1.56 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. తాజా టైం టేబుల్ ప్రకారం గుంటూరుకు 1.10 గంటలకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు చేరుకొని 1.15 గంటలకు సత్తెనపల్లికి బయలుదేరనుందని టైం టేబుల్ వేళలు మార్చారు. టైంటేబుల్ రూపకల్పనలో అధికారుల నిర్లక్ష్యాన్ని పలువురు ప్రయాణికులు తీవ్రంగా ఆక్షేపించారు. తమను అయోమయానికి గురి చేసే ఇటువంటి చర్యలకు బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



మృతుడు నాగమల్లేశ్వరరావు (ఫైల్)

కొల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం కొల్లూరులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, క్రాప గ్రామానికి చెందిన యేమినేని నాగమల్లేశ్వరరావు (50) కొల్లూరు నుంచి స్వగ్రామానికి టీవీఎస్ మోపెడ్‌పై వెళుతుండగా అదే గ్రామానికి చెందిన గొరికపూడి మోజెస్ వురఫ్ రవిబాబు క్రాప నుంచి వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నాగమల్లేశ్వరరావు, రవిబాబు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో వేమూరు వైద్యశాలకు తీసుకువెళ్లగా అప్పటికే నాగమల్లేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రవిబాబుకు మెరుగైన చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించాలని వైద్యులు సూచించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళ వారం 42.02 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 2 వేల క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసె క్కులు, మొత్తం 2,400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

56,159 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 59,113 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 56,159 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,549 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11500	15400
273	11500	14300
341	10500	16500
4884	---	----
సూపర్ 10	---	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15800
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	16400
దేవనూరు డీలక్స్	11000	17000
ఆర్మూరు	10500	12500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16700
నెంబరు. 5	11000	15300
273	---	----
341	11000	16500
4884	---	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	10000	16300
దేవనూరు డీలక్స్	10500	15800
తాలుకాయలు	5000	7500

పీపీపీపై వైసీపీది దుష్ప్రచారం

● ఆ విధానంపై కేంద్రం కూడా హర్షం ● మంత్రి అనగాని



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగన్ తన ఐదేళ్ళ పాలనా కాలంలో రూ.500కోట్లు ఖర్చు పెట్టి ఐదు మెడికల్ కాలేజీలు కూడా కట్టలేకపోయారని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దుయ్యపట్టారు. రుషికొండను తొలగించి విలాసవంతమైన భవనాలను రూ.500 కోట్లతో నిర్మించుకున్నారని ఆరోపించారు. మంగళవారం బాపట్ల జిల్లా రేపల్లెలో మంత్రి అనగాని విలేకరులతో మాట్లాడారు. వైద్య కళాశాలల నిర్మాణంలో పీపీపీ విధానంపై వైసీపీ అబద్ధపు ప్రచారం చేస్తోందన్నారు. పీపీపీపై కేంద్రప్రభుత్వం కూడా హర్షించిందని తెలిపారు. జగన్ విధానంలో అయితే వైద్య కళాశాలల నిర్మాణానికి 25 ఏళ్ళు పడుతుందన్నారు. వైసీపీ కోటి సంతకాల పేరుతో సిగ్గు లేకుండా తప్పుడు ప్రచారం చెయ్యడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో కూడా వైద్య కళాశాలను నిర్మించుకోలేకపోయారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని జగన్ అండ్ కో దోచుకుతిన్నారే తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అందుకే ప్రజలకు విసుగెత్తి ఆ పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఆ పార్టీ నేతలు కనీసం ఇప్పటికైన బుద్ధి తెచ్చుకుని అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని అనగాని హితవు పలికారు. ఈ సమావేశంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధర రావు, టీడీపీ రైతు రాష్ట్ర కార్యదర్శి మేకా వెంకట శివరామకృష్ణ, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, వడ్డి లక్ష్మీజీ, రేపల్లె పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదో కలెక్టర్ల సదస్సు బుధ, గురువారాల్లో జరగనుంది. ఇందుకోసం అమరావతి రాజధానిలోని సచివాలయంలో ఏర్పాట్లు పూర్తి చశారు. తొలి రోజున సీసీఎల్ఏ, చీఫ్ సెక్రెటరీ, రెవెన్యూ, ఆర్థికశాఖ మంత్రులు తొలుత ప్రసంగిస్తారు. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబు కీలక ఉపన్యాసాలు చేస్తారు. ఆ తర్వాత ఇంటరాక్టివ్ సెషన్ జరుగుతుంది. అనంతరం జీఎస్‌డీపీ, కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్స్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రజంటేషన్లు జరుగుతాయి. జిల్లాల వారీగా కూడా సమీక్ష జరుగుతుంది. మధ్యాహ్న భోజన విరామం అనంతరం పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్‌పై జిల్లాల వారీగా పథకాల అమలు తీరును వివరిస్తారు. ఆ తర్వాత ఈ-ఆఫీసు, ఫైల్స్ డిస్పోజల్, పీజీఆర్ఎస్, డేటా గవర్నెన్స్, డేటా లేక్ తదితర అంశాలపై చర్చ జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్న పథకాలపైనా సమీక్షిస్తారు. పెట్టుబడుల ప్రతిపాదనలు, సూపర్ సిక్స్ హామీల అమలు, సాధికారత, సంక్షేమంపై సమీక్షలతో తొలి రోజు కలెక్టర్ల సదస్సు ముగుస్తుంది.

● రెండో రోజున విజయగాథలపై కలెక్టర్లు ప్రజంటేషన్లు ఇస్తారు. ఆ తర్వాత స్వర్ణాంధ్ర 2047- పది సూత్రాలు, వృత్తి నైపుణ్య శిక్షణ, ఉద్యోగాల కల్పన, రెవెన్యూ, ఇతర ఆదాయ శాఖలు, లా అండ్ ఆర్డర్‌పై సమీక్ష జరుగుతుంది. సదస్సు ముగింపు సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం ప్రసంగిస్తారు. కాగా తొలి రోజున గుంటూరు జిల్లా నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరవుతారు. రెండో రోజు ఎస్పీ వకుల్ జిందాల్ కూడా సదస్సులో పాల్గొంటారు. జిల్లా తరపున పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించేందుకు కలెక్టర్ సిద్ధమయ్యారు.

డెల్టా, రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లకు ఎల్‌హెచ్‌బీ బోగీలు

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం కాచిగూడ-రేపల్లె-వికారాబాద్, సికింద్రాబాద్-రేపల్లె-సికింద్రాబాద్ మధ్యన ప్రయాణించే డెల్టా, రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 22వ తేదీ నుంచి కొత్త రూపును సంతరించుకోనున్నాయి. ఇప్పటివరకు సంప్రదాయ ఐసీఎఫ్ బోగీలతో రాకపోకలు సాగిస్తున్న ఈ రైళ్లు లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) బోగీలతో ప్రయాణించనున్నాయి. దీని వల్ల కోచ్ కంపోజిషన్ మారనుంది. డెల్టా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22 నుంచి, రేపల్లె ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23, 25వ తేదీల నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణిస్తాయి. ప్రస్తుతం ఏసీ టూటైర్-1, ఏసీ త్రీటైర్-1, స్లీపర్-11, జనరల్-7, బ్రేక్‌వ్యాన్-2తో కలిపి మొత్తం 22 బోగీలతో ప్రయాణిస్తున్నాయి. ఎల్‌హెచ్‌బీ బోగీల వల్ల ఏసీ టూటైర్-1, ఏసీ త్రీటైర్-3, స్లీపర్-9, జనరల్-5, బ్రేక్‌వ్యాన్-1, పవర్ కార్-1తో కలిపి మొత్తం 20 బోగీలతో రాకపోకలు సాగిస్తాయి. దీనివల్ల స్లీపర్ క్లాస్ బోగీలు రెండు, జనరల్ రెండో బోగీలు తగ్గుతాయి. త్రీటైర్‌లో రెండు పెరుగుతాయి.

స్క్రబ్ టైఫస్‌పై నేడు చర్చా కార్యక్రమం

● వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల రాక

గుంటూరు మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్, మెలియాయిడోసిస్ జ్వరాలపై వైద్యనిపుణులతో బుధవారం చర్చా కార్యక్రమం జరగనుందని ఐఎంఏ నగర అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్, సీఐడీఎస్ అధ్యక్షుడు డాక్టర్ కె.కల్యాణ్ చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ, ఏపీ సీఐడీఎస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని జీఎంఏ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్, రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ జి.రఘునందన్, ఎన్‌సీడీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రవీణ్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ హాజరు కానున్నారని వారు తెలిపారు. ఈ వ్యాధుల లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్స విధానాలు, నివారణ అంశాలపై వైద్యనిపుణులు చర్చిస్తారని వారు వివరించారు. ఈ చర్చా కార్యక్రమంలో పలువురు వైద్యరంగ నిపుణులు కూడా పాల్గొంటారని డాక్టర్ సేవకుమార్, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి వెల్లడించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.7.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు సిటీ వార్తలు

● గుంటూరు తూర్పు ● పశ్చిమ

డేంజర్... యమ డేంజర్

● విద్యుత్ స్తంభాలకు గుట్టలుగా వేలాడుతున్న కేబుల్ వైర్లు
● పట్టించుకోని అధికారులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ స్తంభాలు ప్రమాద భరితంగా మారాయి. కేబుల్ ఆపరేటర్లు ఇష్టారీతిన విద్యుత్ స్తంభాలకు గుట్టలు గుట్టలుగా కేబుల్ వైర్లను తగిలిస్తున్నారు. అనేక చోట్ల కేబుల్ వైర్లు వేలాడుతూ విద్యుత్ స్తంభాలకు అంటుకొని ప్రమాదభరితంగా మారుతున్నాయి. ఒకవేళ విద్యుత్తు వైర్లకు తగిలితే ఎంతటి ప్రమాదానికి దారి తీస్తాయో చెప్పనక్కర్లేదు. ఇంతటి ప్రమాదభరితంగా ఉన్న కేబుల్ వైర్లను విద్యుత్ స్తంభాల నుంచి తొలగించాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గుంటూరు నగరంలోని విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్ల గుట్టలు



నందివెలుగు ఆర్వోబీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

అసూయ, ద్వేషాలకు కేరాఫ్ అంబటి!

● తూర్పు ఎమ్మెల్యే నసీర్
● నందివెలుగు బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలన

గుంటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అసూయ, ద్వేషాలు మెండుగా కలిగిన వైసీపీ నేత అంబటి రాంబాబుకు అభివృద్ధి అంటే ఏంటో తెలుసా అని తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ప్రశ్నించారు. స్థానిక నందివెలుగు బ్రిడ్జి నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరిన నందివెలుగు బ్రిడ్జిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో నిర్మాణ పనులు చేపట్టామని వెల్లడించారు. మరో ఏడెనిమిది నెలల్లో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందిస్తామని తెలిపారు. అరండల్ పేట శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణాన్ని నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. వీటితోపాటు నగరంలోని సంజీవయ్య నగర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణాలకు సైతం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మిస్తున్నారని అంబటి తెలుసుకోవాలని, పేలడం సరికాదని అన్నారు. గుంటూరు నగర అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ఎవరైనా రావచ్చని సూచించారు. అభివృద్ధికి అడ్డుపడాలనే చౌకబారు విధానాలను వదిలిపెట్టాలని అంబటికి ఎమ్మెల్యే నసీర్ హితవు పలికారు. వైసీపీ నేతలు అమరావతి రాజధానిపై మూడు ముక్కలాట ఆడి విధ్వంసం చేశారని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో క్యూరింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ సమయంలో నిర్దేశిత ప్రమాణాల మేరకు క్యూరింగ్ జరిగేలా ఏఈలు, ఎమినిటీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం ఇంజినీరింగ్ ఏఈలు, డీఈలు, ఈఈలతో సమీక్ష సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ ఏఈల వారీగా అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ పొందినవి, ప్రారంభించినవి, ప్రారంభించాల్సిన వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని హెచ్‌డీని ఆదేశించారు. అనంతరం తాగునీటి సరఫరాపై సమీక్షించి, ఏఈలు, ఎమినిటి కార్యదర్శులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నగరంలో నూతనంగా నిర్మాణం చేయనున్న రిజర్వాయర్లు, యూపిహెచ్‌లకు ఈనెల 21న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శంకుస్థాపన చేస్తారని, అందుకు స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని ఈఈలను ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, విష్ణు, వేణుగోపాల్, అసిస్టెంట్ ఎగ్జామినర్ తిరుపతయ్య, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

డ్రెయిన్ల శుభ్రంపై అధికారులు దృష్టి సారించాలి

నగరంలో ప్రతి సచివాలయం పరిధిలో డ్రెయిన్ల శుభ్రంపై ప్రజారోగ్య అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం అమరావతి రోడ్, నగరాలు, రెడ్డిపాలెం, నాయడుపేట, విద్యా నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అమరావతి రోడ్డులోని ప్రియా గార్డెన్స్ దగ్గర డ్రెయిన్‌లో వ్యర్థాలు నిలిచి ఉండడం గమనించి, సంబంధిత కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసి, శానిటేషన్ కార్యదర్శుల వారీగా డ్రెయిన్ల శుభ్రంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పర్యటనలో గుంటూరు డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, సిటి ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, డీఈఈ రమేష్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులు నిబంధనలు పాటించాలి

నగరంలో ఫ్లెక్సీ బ్యానర్లు ప్రింటింగ్ యజమానులు నిబంధనలు పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఫ్లెక్సీ ప్రింటర్స్‌తో మంగళవారం సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల గోడలపై, పబ్లిక్ ప్రాంతాల్లో పోస్టర్స్ అంటించడం, బ్యానర్లు నిషేధమని, ఏమైనా బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలంటే జీఎంసికి నిర్దేశిత చలాన చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మెరుగైన పారిశుధ్యంతో స్వచ్ఛమైన వాతావరణం

ప్రజలకు మెరుగైన పారిశుధ్యం, తద్వారా స్వచ్ఛమైన వాతావరణం అందించేలా ప్రజారోగ్య విభాగం నుంచి ప్రత్యేక కృషి చేస్తున్నామని, మెప్మా రీసోర్స్‌పర్సన్స్ (ఆర్పీ) కూడా ప్రజలకు వ్యర్థాల నిర్వహణపై అవగాహన కలిగించడంలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రజారోగ్య కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు, మెప్మా ఆర్పీలు, సీవో, సీఎంఎంలతో మంగళవారం ప్రత్యేక సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛ గుంటూరు ప్రతి ఒక్కరి లక్ష్యంగా అధికారులు, కార్మికులు కృషి చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో నగరంలో వ్యర్థాల నిర్వహణ, ఇతర అంశాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక తోడ్పాటు అందేలా చర్యలు తీసుకోబోతున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, ఉపా సెల్ పిఓ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌కు ఆహ్వానం



గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న డాక్టర్ గజల్ శ్రీనివాస్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 3వ తేది నుంచి మూడు రోజుల పాటు గుంటూరులో జరిగే ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొనాలని గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆహ్వానం పలికారు. విజయనగరంలోని నివాసంలో ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. నందమూరి తారక రామారావు వేదికపై జరిగే ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని కోరారు. అనంతరం గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ 5న ఉదయం జరిగే ఆంధ్ర వైభవంలో పాల్గొనేందుకు అశోక్ గజపతిరాజు సుముఖతను వ్యక్తం చేశారని తెలిపారు. తెలుగు భాష వికాసం, సాహిత్య పరిరక్షణకు ఆంధ్ర సారస్వత పరిషత్ చేస్తున్న యజ్ఞాన్ని ఆయన అభినందించారని గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధన మహోత్సవం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్, శ్రీ మారుతి దేవాలయంలో మంగళవారం శ్రీ కంచి కామకోటి పీఠం 68వ పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి 32వ ఆరాధన ఉత్సవ మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

విద్యార్థుల శ్రేయస్సును విస్మరిస్తే చర్యలు

● అనైతిక అడ్మిషన్లకు పాల్పడవద్దు ● డీఈవో సలీం బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో ఎస్‌కే సలీం బాషా

గుంటూరు(విద్య), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల శ్రేయస్సుకు భిన్నంగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, విద్యార్థుల్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయరాదని డీఈవో ఎస్‌కే సలీం బాషా స్పష్టం చేశారు. పరీక్ష భవన్‌లో మంగళవారం జిల్లాలోని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ కొంతమంది ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అనైతిక అడ్మిషన్లకు పాల్పడుతున్నాయని, ఒక పాఠశాలలో విద్యార్థులని మరొక పాఠశాలలో చేర్చుకొని తరువాత ఫీజుల విషయంలో వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి అనైతిక చర్యలకు ఎవరూ పాల్పడవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం రూపొందించిన విధి విధానాల ప్రకారం పాఠశాలలు నిర్వహించాల్సిందేనని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాల ప్రకారం పాఠశాలలను నిర్వహించకుంటే గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఈవోలు హవేల, నాగేంద్రమ్మ, కామన్ ఎగ్జామినేషన్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

జీకేఆర్ పబ్లిక్ స్కూల్ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

● అకడమిక్ ఇన్‌చార్జ్, క్లర్క్ విధుల నుంచి తొలగింపు
● బాలల హక్కుల సంఘానికి ఫిర్యాదు

గుంటూరు (విద్య), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలోని జీకేఆర్ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులపై అమానుషంగా వ్యవహరించిన సిబ్బందిని విధుల నుంచి తొలగించాలని డీఈవో ఎస్‌కే సలీం బాషా ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలో అకడమిక్ ఇన్‌చార్జ్ శైలజ, క్లర్క్ సునీత తదితరులు బాత్రూం డోర్ కొట్టారని ఇద్దరు విద్యార్థినులను మోకాళ్లపై నిలుచోబెట్టిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం గురించి పత్రికల్లో కథనాలు వెలువడడంతో డీఈవో విచారణ ఆదేశించారు. తూర్పు ఎంఈవో కుద్దూస్ మంగళవారం పాఠశాలను సందర్శించి విచారణ చేశారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిన పాఠశాల ఇన్‌చార్జ్, క్లర్కును విధుల నుంచి తొలగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులపై అమానుషంగా వివరించిన సిబ్బందిపై బాలల హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. మరోవైపు స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినట్లు ఎంఈవో కుద్దూస్ వెల్లడించారు. మరోసారి ఇటువంటి సంఘటన పునరావతమైతే పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామని డీఈవో సలీం బాషా హెచ్చరించారు.

వాజపేయి విగ్రహ నిర్మాణానికి మాదల రూ.8 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, హాలీవుడ్, బాలీవుడ్ సెంటర్లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త మాదల రత్నగిరిబాబు రూ.8 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళాన్ని మంగళవారం నిర్మాణ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా నగరానికే తలమానికంగా ఈ విగ్రహాన్ని నిర్మించాలని ఆయన ఆకాంక్షించారు.



వాజపేయి విగ్రహానికి భూమి పూజ చేస్తున్న బీజేపీ నాయకులు, కమిషనర్ పులి శ్రీనివాసులు (ఫైల్)

కిల్కారి కాల్స్‌పై హెల్త్ విజిటర్లకు శిక్షణ

గుంటూరు మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిల్కారి సేవలపై మంగళవారం నల్లపాడులోని ప్రాంతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శిక్షణ కేంద్రంలో మహిళా హెల్త్ విజిటర్లకు, సీనియర్ ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కిల్కారి రీజనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు, కమ్యూనికేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్ వీరికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, టీకాల గురించి, కుటుంబ నియంత్రణ పద్ధతులు, తల్లీ బిడ్డలకు ఆరోగ్య సలహాలు వంటి సమాచారం ఈ కిల్కారి కాల్స్ ద్వారా వినవచ్చని వారు వివరించారు.

19 నుంచి దశావతార కల్యాణ మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థాన సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు దశావతార కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు తెలిపారు. ఆలయ ఆవరణలో మంగళవారం మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా 19న మత్స్యావతారం, 20న కూర్మా, 21న వరాహ, 22న నరసింహ, 23న వామనా, 24న పరుశురామ, 25న రామ, 26న బలరామ, 27న శ్రీకృష్ణ, 28న శ్రీ వెంకటేశ్వస్వామి అవతారాల్లో స్వామి వారు దర్శనమిస్తారని తెలిపారు. కమిటీ సభ్యులు ధనలక్ష్మి, రమాదేవి, అరుణ శాంతి, రత్న, సునీత, సుధారాణి పాల్గొన్నారు.

తిరుప్పావైపై ఆధ్యాత్మిక ప్రవచనం ప్రారంభం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం, అన్నమయ్య కళావేదికపై తితిదే ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో ధనుర్మాసం సందర్భంగా మంగళవారం తిరుప్పావై ఆధ్యాత్మిక ప్రవచనాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం గోదా అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ ఫలరసాలు, పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. సాయంత్రం ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి తిరుప్పావై ప్రవచనం చేస్తూ కార్తీకమాసం లాంటిదే ధనుర్మాసమన్నారు. ఈ మాసం శ్రీకృష్ణపరమాత్మకు అత్యంత ప్రీతికరమైందని ఈనెల రోజులు పండుగ రోజులుగా జరుపుతారన్నారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురు అరెస్టు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను అరెస్టు చేసినట్లు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్‌లు మంగళవారం తెలిపారు. వారి కథనం ప్రకారం.. పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్, అబుల్ బాబా మసీదు ఎదురుగా గల ఖాళీ ప్రదేశంలో ఆకస్మిక దాడులు నిర్వహించి ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 20 గ్రాముల గంజాయి, 4 గ్రాముల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పాత గుంటూరులోని గొలుసు కొండలరావునగర్‌కు చెందిన సేలం వెంకటేష్ కుమారుడు గోపికృష్ణ, గుంటూరు శుద్ధపల్లి డొంక నాగలక్ష్మి నగర్ కు చెందిన చింకా వెంకట శివ ప్రసాద్ కుమారుడు శ్రీనివాసరావు, మహమ్మద్ హుస్సేన్ ఖాన్ కుమారుడు మహబూబ్ ఖాన్, పాత గుంటూరు బాలాజీ నగర్, తొమ్మిది లైన్ కు చెందిన గాలి పవన్ కుమార్ కుమారుడు అర్జున్‌రావు, మాయాబజార్ అహ్మద్‌నగర్‌కు చెందిన షేక్ రియాజ్ కుమారుడు సుభాని అనే ఐదుగురు యువకులు స్నేహితులుగా ఉంటున్నారు. గంజాయి తాగడానికి అలవాటు పడి, గుంటూరు వస్త్రనగర్ వద్ద ఉంటున్న బెంజిమేన్, హౌసింగ్ బోర్డు కాలని వద్ద ఆదర్శ్ నగర్ వద్ద ఉండే ప్రవీణ్, పాత గుంటూరుకి చెందిన చందు వద్ద గంజాయి కొనుగోలు చేసి సేవిస్తుండగా ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మరోసారి గంజాయి సేవిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్

సమస్యల పరిష్కారానికై 'సహకరించండి'

● కలెక్టరేట్‌లో సహకార సంఘాల ఉద్యోగుల నిరసన

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాపై భారంపడని సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు చేపట్టిన దశల వారీ ఆందోళనలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో సహకార కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2019లో తీసుకొచ్చిన జీవో నెం.36ను వెంటనే అమలు చేసి ఉద్యోగులందరికి ప్రొసిడింగ్ ఇచ్చి డీఎల్ఎస్ఎఫ్ ఏర్పాటు చేసి జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో 22న డీసీసీబీ కార్యాలయం ఎదుట, 29న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. అప్పటికి ప్రభుత్వం నుంచి స్పందన లేని పక్షంలో జనవరి 6 నుంచి ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా సహకార అధికారి వీరాచారికి వినతిపత్రం అందజేశారు. నిరసనల్లో ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండవీటి చిన్నారావు, గోగినేని కిషోర్‌కుమార్, నిమ్మగడ్డ శ్రీనివాసరావు, షేక్ బాషా పాల్గొన్నారు.

వెంగళాయపాలెం చెరువు సందర్శన

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వాటర్ షెడ్ పథకంలో అభివృద్ధి చేసిన గుంటూరు రూరల్ మండలం, వెంగళాయపాలెం చెరువును మంగళవారం ఉమ్మడి నెల్లూరు, కృష్ణా జిల్లాల డిప్యూటీ ఎంపీడీవోలు, ఏవోలు, పంచాయతీ కార్యదర్శులు సందర్శించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు, కొబ్బరి చెట్లు పెంపకం వంటి పనులను పరిశీలించారు. చెరువుకు కేటాయించిన నిధులు, చేపట్టిన పనులను రూరల్ మండల ఎంపీడీవో బండి శ్రీనివాసరావు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ లలితా కుమారి, పంచాయితీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, డీఆర్వో షేక్ ఖాజావలీ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొని కేక్ కట్ చేసి జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రైస్తవ మత పెద్దలు క్రీస్తు ను స్తుతిస్తూ పాటలు పాడారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ అధి కారి పార్థసారథి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను మండలంలో త్వరితగతిన పూర్తి చేయాలని గుంటూరు రూరల్ మండలం ఎంపీడీవో బండి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు ఈ సర్వే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ సర్వేను జనవరి 12వ తేదీలోపు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవోలు కే.శ్రీనివాసరావు, ఆర్ అంబయ్యా తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రేపు ధర్నా

గుంటూరు(తూర్పు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్షిప్(పీపీపీ) విధానంలో నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాకు జిల్లాలోని పార్టీ శ్రేణులు, విద్యార్థి, యువజనులు, మేధావులు పెద్దసంఖ్యలో తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జీవో 590తో పాటు గతంలో తీసుకువచ్చిన జీవోలు 107, 108లను రద్దు చేయాలన్నారు. వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జరిగే ధర్నాలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

అంబటి రాంబాబు అండ్ కో దుష్ప్రచారం మానాలి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : నగరంలో నిర్మాణంలో ఉన్న శంకర్ విలాస్ ఆర్వోబీ అంశంపై అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, వైసీపీ నేతలు కావాలనే దుష్ప్రచారం చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఉద్దేశించి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను మంగళవారం ఆమె తీవ్రంగా ఖండించారు. అంబటి రాంబాబును ప్రజలు సత్తెనపల్లిలో ఫుట్‌బాల్ లాగా తంతే గుంటూరులో వచ్చి పడి, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అంబటి, మోదుగుల, డైమండ్ బాబు వంటి వైసీపీ నేతలు తమ మీద బురద జల్లి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. గుంటూరు నగరంలో ఉన్న ఎమ్మెల్యేలు డమ్మీలు అని అంబటి విమర్శించడం ఆయన చౌకబారు రాజకీయాలకు నిదర్శనమన్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంపై అంబటి హేళనగా మాట్లాడటం అవగాహన లోపమేనని అన్నారు.

39వ డివిజన్ నేతలతో ఎమ్మెల్యే ముఖాముఖి

గుంటూరు పశ్చిమ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మంగళవారం 39వ డివిజన్‌కు చెందిన టీడీపీ నేతలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీ సన్నద్ధతపై మాట్లాడారు. డివిజన్ స్థాయి నుంచే కమిటీల్లో మార్పులు, కొత్త నాయకత్వానికి అవకాశం, పాత అనుభవాల వినియోగంతో పూర్తిగా మార్పులు చేశామని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, పశ్చిమ నియోజకవర్గం మొత్తం క్లీన్ స్వీప్ చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.

పశ్చిమలో తొమ్మిదో మహిళా గ్రీవెన్స్

పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మహిళా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తమ వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే మాధవి వారికి హామీ ఇచ్చారు.

జగన్‌కు మెడికల్ కాలేజీలపై శ్రద్ధ లేదు

● ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌కు రుషికొండ ప్యాలెస్‌పై ఉన్న శ్రద్ధ మెడికల్ కాలేజీలపై లేదని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. కోటి సంతకాలంటూ వైసీపీ నేతలు నాటకం మొదలుపెట్టారని విమర్శించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క మెడికల్ కాలేజీ కూడా పూర్తిచేయలేదన్నారు. 2019-24 మధ్య రాష్ట్రాన్ని అంధకారంలోకి తీసుకెళ్లారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఉందని తెలిపారు. అరాచకం నుంచి అభివృద్ధి వైపు వేగంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందని, విధ్వంసానికి, వికాసానికి ప్రజలు తేడా గమనించి కూటమి పాలనను ఆదరిస్తున్నారన్నారు.

కోటి సంతకాల పేరిట వైసీపీ కొత్త నాటకం

● మన్నవ మోహనకృష్ణ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలపై కోటి సంతకాల పేరుతో వైసీపీ కొత్త నాటకం ఆడుతోందని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 'పచ్చ కామెర్లు వచ్చినోడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది' అన్నట్లు, కూటమి ప్రభుత్వంపై కత్తిగట్టిన జగన్‌కు ప్రభుత్వం చేపట్టే మంచి పనులు కూడా ఘోరమైన తప్పుల్లాగానే కనిపిస్తున్నాయన్నారు. మెడికల్ కాలేజీల పీపీపీ విధానం వల్ల చాలా లాభాలు ఉన్నాయని ప్రభుత్వం స్పష్టంగా చెబుతున్నా, ఏదో అన్యాయం జరిగిపోతోందని వైసీపీ నాయకుల రాద్ధాంతం చేయడం హాస్యాస్పదమన్నారు. సామాన్య ప్రజల విషయం పక్కన పెడితే, వైసీపీ చేస్తున్న నిరసనలకు కనీసం ఆ పార్టీ కార్యకర్తల నుంచి కూడా స్పందన కరువైందని ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీల నిర్మాణంపై హైకోర్టు సమర్థించినా ప్రతిపక్ష నేతల్లో మార్పు కనిపించకపోవడం దురదృష్టకరమని, మెడికల్ కాలేజీల నిర్మాణంపై ఎక్కడైనా చర్చకు తమ కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మోహనకృష్ణ అన్నారు.

ఘనంగా యడ్లపాటి వెంకట్రావు జయంతి వేడుకలు

గుంటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షుడు యడ్లపాటి వెంకట్రావు జయంతి వేడుకలు జిల్లా కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. పలువురు టీడీపీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మాట్లాడుతూ యడ్లపాటి వెంకట్రావు రైతు బాంధవుడని, సంగం డైరీ స్థాపకులలో ఒకరని తెలిపారు. భావితరాలకు యడ్లపాటి జీవితం ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో హుస్సేన్, సుందరంబాబు, సతీశ్, సురేష్, వడ్డే శ్రీనివాసరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



యడ్లపాటి వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

పార్లమెంట్ స్థాయి సంఘ నివేదికను వక్రీకరించడం తగదు

● డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యపై ఇటీవల పార్లమెంట్ స్థాయి సంఘం ఇచ్చిన నివేదికకు వక్ర భాష్యాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టడం సబబు కాదని ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ తెలిపింది. మంగళవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని పార్లమెంటరీ స్థాయి సంఘం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించగా, మన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. రాష్ట్ర కో కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ ప్రజాభిప్రాయాన్ని గౌరవించి కూటమి ప్రభుత్వం వెంటనే 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. రాష్ట్ర కో కన్వీనర్ జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ పీపీపీ విధానాన్ని వ్యతిరేకించే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులందరినీ కలుపుకొని ఐక్యంగా ఉద్యమించాలని, జనవరి 9న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద ధర్నా, డిసెంబరు 22న ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని, డిసెంబరు 18న భారత కమ్యూనిస్ట్ పార్టీ పీపీపీ విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగస్వామ్యమౌతామన్నారు. సమావేశంలో జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

పొలమే.. ప్రయోగశాల

● కొత్త వంగడాలు పండించే ఘనాపాటి.. మోహన్ రెడ్డి

● 40కి పైగా వరి సన్న రకాల సాగుతో కొత్త రికార్డు

● తక్కువ ఖర్చు, ఎక్కువ దిగుబడిపై రైతులకు పాఠాలు

● 2023లో ఆదర్శ రైతుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం

సాగులో ఈ రైతు సాహసాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఇంకా మార్కెట్‌లోకి విడుదల కాని విత్తనాలను తీసుకొచ్చి తన పొలంలో నాటుతాడు. అవి ఎలా మొలుస్తాయో, తెగుళ్లను ఎలా తట్టుకుంటాయో గమనిస్తాడు. మిగిలిన రైతులందరూ ఈ మందూ, ఆ మందూ అంటూ కిందా మీదా అవుతుంటే ఈయన మాత్రం నింపాదిగా ఉంటాడు. చివరికి ఎకరాకు ఒకే ఒక్క యూరియా కట్ట వేసి అద్భుతమైన దిగుబడులు సాధిస్తాడు.



నూతన వరి వంగడాన్ని సాగుచేస్తున్న మోహన్ రెడ్డి

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

శాస్త్రవేత్తలు నూతనంగా సృష్టించిన 40 రకాల వరి వంగడాలను మొట్ట మొదట సాగు చేసి వాటిలో మంచి చెడులు కనిపెట్టి అన్నదాత లోకానికి ఆదర్శంగా నిలుస్తోన్న రైతు పేరు ఆళ్ళ మోహన్ రెడ్డి. దుగ్గిరాల మండలం వీర్ల పాలెం స్వంత గ్రామం. ఆయనకున్న నాలుగు ఎకరాల భూమిలో ప్రతి ఏటా ప్రయోగం చేస్తుంటారు. ముఖ్యంగా వ్యవసాయ పరిశోధనా స్థానాలు నుంచి వచ్చిన కొత్త వరి వంగడాలను సాగు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

● ఎన్నో రకాలు.....

శాస్త్రవేత్తలు ఒక కొత్త వంగడం సృష్టించే సమయంలో అందులో ఏదో ఒక ప్రత్యేకతను పొందుపరుస్తారు. వాళ్ల చెప్పిన ప్రత్యేకత నిజంగా ఆ విత్తనంలో కనపడుతుందా లేదా అన్న విషయాన్ని సాగులో మోహన్ రెడ్డి గుర్తిస్తారు. అందుకోసం ఒక్కో సంవత్సరం సాగు అత్యంత సాహసంగా చేస్తారు. కొన్ని సందర్భాల్లో శాస్త్రవేత్తలు చెప్పినన్ని విశిష్టతలు లేక పంటలు పాడయిన అనుభవం కూడా ఉన్నట్లు ఆయన చెబుతున్నారు. బాపట్ల పరిశోధనా స్థానం నుంచి విడుదలయిన బీపీటీ 2787, 2846, 2824, 3082 వంటి రకాలను ఆయన మొదట సాగు చేశారు. అవిగాక మనిషికి క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా నివారించే బీపీటీ 2841 (బ్లాక్ రైస్), బీపీటీ 2858 (రెడ్ రైస్)ను కూడా ఆయన సాగు చేశారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీలో డాక్టర్ పీవీ సత్యనారాయణ వంటి లబ్ధ ప్రతిష్ఠులైన శాస్త్రవేత్తలు ఆవిష్కరించిన కొత్త సన్న రకాలను కూడా మోహన్ రెడ్డే ప్రస్తుతం సాగు చేశారు.

20 ఏళ్లు... 40 రకాలు

మోహన్ రెడ్డి డిగ్రీ వరకు చదివారు. ఆ తర్వాత ఉద్యోగం కోసం వేట ప్రారంభించలేదు. ఉన్న పొలంలోనే సాగు ఆరంభించారు. చదువుకున్న వాడు కావడంతో వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పే విషయాలు బాగా ఆకళింపు చేసుకోగలిగారు. అలా వారితో పరిచయం ఏర్పడటంతో ఏ కొత్త వరి విత్తనాలు కనిపెట్టినా వాటిని తొలుత సాగు చేసేది మోహన్ రెడ్డే. ఇప్పటికి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఆవిష్కృతమైన సుమారు 40 సన్న రకాల వరి వంగడాలను తన పొలంలో సాగు చేశారు. నూతనంగా విత్తనాలు తయారు చేసిన తర్వాత మొదటి సంవత్సరం పరిశీలన అంతా శాస్త్రవేత్తల కనుసన్నల్లో జరుగుతుంది. రెండో సంవత్సరం పరిశీలన అంతా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మోహన్ రెడ్డి లాంటి ఆదర్శ రైతుల ఆధ్వర్యంలో జరుగుతుంది.



రాష్ట్రస్థాయిలో ఆదర్శ రైతు అవార్డు అందుకుంటున్న ఆళ్ళ మోహన్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

● ప్రభుత్వ గుర్తింపు

కొత్త వరి వంగడాలను ప్రయోగ దశలో తన పొలంలో సాగు చేసి మంచి ఫలితాలు సాధించటంతో పాటు, వ్యవసాయ రంగం అభివృద్ధికి పాటు పడుతున్న ఆళ్ళ మోహన్ రెడ్డికి 2023లో రాష్ట్రప్రభుత్వం ఆదర్శ రైతు అవార్డు ఇచ్చింది. ఆయన అనుభవాలను రైతాంగానికి విరివిగా అందించాలని ప్రభుత్వం భావించింది.

● రైతులకే ఎక్కువ తెలుసు...

- ఆళ్ల మోహన్ రెడ్డి, ఆదర్శ రైతు

పంటకు ఎప్పుడు ఏది అవసరమో వాస్తవానికి రైతులకే ఎక్కువ తెలుసు. కానీ పురుగు మందుల వాడకంపై వ్యాపారి ప్రభావం రైతులపై ఎక్కువగా ఉంటుంది. వ్యాపారి చెప్పగానే దోమ రాకపోయినా ముందు గానే దోమల మందు కొడతారు. దానివల్ల పంటకు పూర్తిగా నష్టం జరుగుతుంది. అవసరం ఉన్నా లేకున్నా యూరియా చల్లేస్తారు, దానివల్ల భూమి సహజతత్వం దెబ్బ తింటుంది. ఏడాదికి నాలుగుసార్లు గడ్డి మందు కొట్టిన తర్వాత పొలం ఎలా ఆరోగ్యంగా ఉంటుంది. రైతులు ఎలా ఆరోగ్యంగా ఉంటారు. ప్రభుత్వం కూడా రైతులకు మరింత వెన్ను దన్నుగా నిలవాలి. ధాన్యం పండించే రైతులను ఆదుకునేందుకు డ్రైయింగ్ ప్లాట్ ఫారాలు నిర్మించాలి. దానివల్ల పండించిన పంటను పొలంలోనే ఆరబెట్టుకునే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ కళాశాలలో జేఈఈ శిక్షణ

● వారంలో మూడు రోజులు తరగతుల నిర్వహణ

● ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేసిన ప్రభుత్వం

గుంటూరు (విద్య), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు జేఈఈ మెయిన్, అడ్వాన్స్ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నారు. గత ఏడాది ప్రయోగాత్మకంగా ఈ శిక్షణా తరగతులను జిల్లాలో ప్రారంభించారు. గుంటూరు నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను నోడల్ సెంటర్‌గా ఏర్పాటుచేసి జిల్లాలోని ఇతర కళాశాలల విద్యార్థులకు ఐఐటీ జేఈఈ శిక్షణ అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 23కు పైగా ఉన్నాయి. ఆయా కళాశాలల్లో దాదాపు పదివేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు ప్రధానంగా గ్రామీణ నేపథ్యంతో పాటు పేద మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వారే. విద్యార్థుల్లో ప్రతిభ ఉన్నా పేదరికం కారణంగా ఐఐటీ జేఈఈ శిక్షణకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేకంగా జూనియర్ కళాశాలలో ఇంటర్, ఎంసెట్ శిక్షణతో పాటు గత ఏడాది నుంచి జేఈఈ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా అధ్యాపకులను నియమించి సబ్జెక్టుల వారీగా శిక్షణ అందిస్తున్నారు.

● వారంలో మూడు రోజులు శిక్షణ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు వారంలో మూడు రోజులపాటు జేఈఈ శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ఫిజిక్స్ ,కెమిస్ట్రీ, గణితం సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ తరగతులతో పాటు అధ్యాపకులు ప్రత్యేకంగా విద్యార్థులకు శిక్షణ అందించి వారిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. వారాంతంలో పరీక్షలు నిర్వహించి అందులో వచ్చిన మార్కుల ఆధారంగా మరింత మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి వెల్లడించారు. గత ఏడాది నుంచి ప్రతిష్టాత్మకంగా ఈ శిక్షణ తరగతులను ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అందిస్తున్నారు. త్వరలో జరిగే మెయిన్స్‌తో పాటు అడ్వాన్స్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు.

● ముమ్మరంగా సంకల్ప శిక్షణ

ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు ఒకవైపు జేఈఈ మరోవైపు ఎంసెట్ శిక్షణ తో పాటు సంకల్ప పేరుతో ఇంటర్ పరీక్షలకు వారిని సిద్ధం చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించి వారాంతంలో సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్‌ను, పాత ప్రశ్నపత్రాల సెట్లను పంపిణీ చేసినట్లు అధ్యాపకులు చెబుతున్నారు. ప్రయోగాత్మకంగా ప్రారంభమైన ఇతర శిక్షణ తరగతులు మంచి ఫలితాలు ఇస్తాయని అధ్యాపకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





ప్రభుత్వ జూనియర్ కళాశాల

టీడీపీ అధ్యక్షులు వీరేనా?

(5వ పేజీ తరువాయి)

సంకేతాలను పంపే క్రమంలో బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడిగా మరో మారు సలగల రాజశేఖర్‌బాబు పేరును ఖరారు చేసినట్లు సమాచారం. గతేడాది ఎన్నికలకు ముందు బాపట్ల పార్లమెంట్ పగ్గాలను సలగల చేపట్టారు. తాజాగా చేపట్టిన నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఆయనకు బావుడా చైర్మన్ దక్కింది. పార్టీ పీఠం ఎవరికి కేటాయించాలనే అంశంపై నాలుగు నెలల నుంచి వివిధ కోణాల్లో అధిష్ఠానం కసరత్తు చేసింది. చీఫ్ విప్ అనురాధ నేతృత్వంలో త్రిసభ్య కమిటీ దరఖాస్తులు స్వీకరించి 21 మంది నుంచి నాలుగు పేర్లను ప్రతిపాదించింది. అయితే తుది కూర్పులో సలగల వైపే అధిష్ఠానం మొగ్గుచూపింది.

రెండో సారి కొమ్మాలపాటి

పల్నాడు పార్టీ పగ్గాలు రెండో సారి కూడా మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌కు అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలిసింది. ఒకరిద్దరు జిల్లా అధ్యక్ష పదవికి తమ పేర్లు సిఫార్సు చేయాలని త్రిసభ్య కమిటీని కోరారు. అయితే జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఏకగ్రీవంగా కొమ్మాలపాటి పేరును ప్రతిపాదించారు. గతంలో కొమ్మాలపాటి పెదకూరపాడు నుంచి 2009, 2014 ఎన్నికల్లో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో కూడా పెదకూరపాడు సీటును ఆశించగా ఆయన స్థానంలో భాష్యం ప్రవీణ్‌ను అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారంలో కొమ్మాలపాటిని ఎమ్మెల్సీగా ఎంపిక చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే టీడీపీ అధికారంలోకి రాగానే కొమ్మాలపాటిని జిల్లా అధ్యక్షుడిగా నియమించింది. ఆయనకు ప్రాధాన్యం ఇచ్చేలా రెండో సారి కూడా ఆ బాధ్యతలను అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించింది.

13వ ఏట నుంచే ఉద్యమాల్లో

పిల్లి మాణిక్యరావు 13వ ఏట నుంచే ఉద్యమాల్లో ఉన్నారు. దళిత నాయకుడిగా ఎదిగిన మాణిక్యరావు పేరు జిల్లా అధ్యక్ష పదవికి దాదాపు ఖరారైనట్లు తెలిసింది. బాపట్ల జిల్లాలోని కారంచేడులో 1973లో జన్మించారు. కాగా ఆయన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగతో కలిసి ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. టీడీపీ సిద్ధాంతాలు, చంద్రబాబు నాయకత్వానికి ఆకర్షితులై 2017లో ఆ పార్టీలో చేరారు. 2019లో టీడీపీ అధికారం కోల్పోయిన సమయంలోనూ వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలపై తిరుగుబాటు చేశారు. ఆయన నిబద్ధత పార్టీలో చురుగ్గా వ్యవహరించడంపై అధిష్ఠానం జిల్లా పార్టీ బాధ్యతలు అప్పగించే యోచన చేస్తున్నట్లు తెలిసింది.

చోర్ గ్యాంగ్‌తో .. చెట్టపట్టాల్

(5వ పేజీ తరువాయి)

బెల్లంకొండ గోపి(నకరికల్లు), షేక్ నబీబాషా(చినతురకపాలెం), నాలి వెంకటరావు(నరసరావుపేట) అరెస్టు చేయగా వారు అనేక నేరాలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా 50కి పైగా కార్లను చోరీ చేసి విక్రయించినట్లు దర్యాప్తులో వెలుగుచూసినా పోలీసు శాఖ తొక్కిపెడుతున్నట్లు తెలిసింది. కార్ల అపహరణపై కేసులు నమోదు చేస్తే పోలీసు శాఖలోని వ్యక్తులు గ్యాంగ్‌కు సహకరించిన విషయం బయటకు వస్తుందని మిన్నకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రమాదాల్లో పనికిరాని కార్లను తుక్కు కింద విక్రయించే నెంబర్లు వినియోగించి అక్రమంగా విక్రయించినట్లు తెలిసింది. దీంతో రవాణాశాఖ పాత్రపై ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి. ఖరీదైన కార్లను నెంబరు ప్లేట్లు మార్చి అతి తక్కువ ధరకు విక్రయించారని తెలు స్తోంది. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తుల నుంచి తుక్కు నెంబర్లు సేకరించనట్లు సమాచారం. ఎవరెవరికి కార్లు ఇచ్చారన్న విషయాన్ని బహిర్గతం చేస్తేనే పోలీసు శాఖపై వస్తున్న విమర్శల కు చెక్ పడుతుంది. అయినా గ్యాంగ్ నేరాలను నీరు గార్చి వారిని రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు వస్తున్న విమర్శలపై పోలీసులు పెద్ద వాస్తవాలు వెల్లడించడంలేదన్న వాదన వినిపిస్తోంది.

ఎస్ఐ సస్పెన్షన్‌కు కారణం ఏమిటో?

చిలకలూరిపేట ఎస్ఐ రహంతుల్లా సస్పెన్షన్‌కు కారణాలను పోలీసుశాఖ వెల్లడించడం లేదు. గ్యాంగ్‌కు సహకరించడం వల్లే ఆయనపై వేటు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరికి సమాచారం ఇవ్వకుండా రహంతుల్లా ప్రమాదస్థలికి వెళ్లడం సస్పెన్షన్‌కు కారణంగా అధికారులు చెబుతున్నారు. అయితే ఆయన చోర్ ముఠాకు ఏ విధంగా సహకరించారన్న అంశాన్ని తొక్కిపెట్టినట్లు తెలిసింది. సదరు అధికారి గ్యాంగ్ వద్ద నాలుగు కార్లు తీసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని చెబుతున్నారే తప్ప అధికారికంగా వెల్లడించలేదు. ఆయన నుంచి రెండు కార్లు స్వాధీనం చేసుకున్నా వాటి వివరాలు బయటకు వెల్లడించలేదు. ఈ కార్లు గ్యాంగ్‌కు ఎలా వచ్చాయి.. వాటిని అపహరించారా అన్న అంశాలను బహిర్గతం చేయకపోవడానికి గల కారణాలు ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరో పోలీసు అధికారికి కూడా నాలుగు కార్లు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతున్నా వాటి వివరాలు బయటకు చెప్పేందుకు పోలీసు శాఖ ఇష్టపడటంలేదు. ఏఎస్ఐ శ్రీనివాసరావుపై శాఖాపరమైన విచారణ చేపట్టినట్లు తెలిసింది. మరో పోలీసు అధికారి పాత్రపై కూడా లోతుగా విచారణ చేస్తున్నారని తెలుస్తోంది.



బాపట్ల : మండలంలో బంతిపూల తోటలు

ముద్ద బంతి సాగు బహు బాగు

బాపట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలంలోని సన్న, చిన్న కారు రైతులు ముద్దబంతి పూలసాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఆశించిన స్థాయిలో ధరలు ఉండటంతో ఏటా సాగును విస్తరిస్తున్నారు. మండలంలోని పడమర బాపట్ల, వెదుళ్ళపల్లి, బేతపూడి, ధరివాదకొత్తపాలెం, స్టువర్టుపురం తదితర ప్రాంతాలలో వందలాది ఎకరాలలో సాగు చేస్తున్నారు. పసుపు,కాషాయ రంగులలో పూల తోటలు చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. ప్రతి ఏటా జూలై నెలలో మొక్కలు నాటితే వినాయకచవితి నాటికి పూలు వస్తాయి. అక్కడ నుంచి వరుసగా పండుగరోజులలో పూలకు మంచి గిరాకి ఉంటుంది. దీనికితోడు వివిధ శుభకార్యాలకూ బంతిపూలను కొనుగోలు చేస్తుంటారు. దాంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం గడించే బంతిపూలసాగుపై అనేకమంది దృష్టిసారిస్తున్నారు. బాపట్ల నుంచి చీరాల వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపుల బంతిపూల తోటలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

ఎకరాకు నష్టం.. రూ. 28000

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేశారు. తీరా పంట రైతుల లోగిళ్లకు చేరడంతో వ్యాపారులు ధరను తగ్గించి క్వింటాల్ రూ.1,600 కు కొను గోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల రూ.1,500 కు కొనుగోలు చేస్తున్నా రని రైతులు తెలిపారు. దిగబడులు ఆశాజనకంగా ఉండటంతో ధర కూడా ఉంటే ఒడ్డునపడొ చ్చని ఆశపడిన సాగుదారులకు అడియాసే మిగిలింది. ధరల స్థిరీకరణ నిధిని వినియోగించి మొక్కజొన్నను కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం స్పందించడంలేదు. దీంతో రైతులు నష్టపోతు న్నారు. రబీలో పెద్దఎత్తున మొక్కజొన్న రైతులు సాగు చేశారు. ఇప్పుడే ధర ఇలా ఉంటే రబీ దిగుబడులు చేతికొచ్చే సమయానికి పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన సాగుదారుల్లో నెలకొంది. మద్దతు ధరకు మొక్కజొన్న ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బీమా రంగంలో విప్లవాత్మక మార్పులు కావాలి

● బీమా పాలసీలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

● లోక్‌సభలో టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీమా పథకాల అమలు మరింత క్షేత్ర స్థాయిలో జరగాలని, ఇందుకోసం బీమా విధానాలలో పెద్ద ఎత్తున సంస్కరణలు చేపట్టాలని టీడీపీ ఎంపీ లావు కృష్ణదేవరాయలు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం, 'సబ్ కా బీమా సబ్ కీ రక్షా బిల్లు'కు లోక్‌సభలో మద్దతు ప్రకటిస్తూ ఆయన ప్రసంగించారు. భారత్‌లో బీమా లభ్యత రేటు కేవలం 3.7 శాతం మాత్రమే ఉందని, ఇది ప్రపంచ సగటు రేటు 7 శాతం కంటే చాలా తక్కువని పేర్కొన్నారు. ఈ అంతరాన్ని తగ్గించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన నొక్కి చెప్పారు. భారీ జనాభా ఉన్న భారత్ వంటి దేశంలో కేవలం 70 నుంచి 72 బీమా కంపెనీలు మాత్రమే ఉండటం సరికాదన్నారు. శ్రీలంక వంటి చిన్న దేశంలోనూ 50 బీమా కంపెనీలు ఉన్నాయని గుర్తు చేశారు. బీమా రంగంలో ఇటీవల కేంద్రం తీసుకున్న రెండు నిర్ణయాలను స్వాగతించారు. భారత్‌లో బీమా కంపెనీలను నియంత్రించే సంస్థ అయిన ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా విధానాలు కొంత కఠినంగా ఉన్నాయని అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుసరించిన విధానాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ కృష్ణదేవరాయలు సూచించారు.

ప్రమాదం జరిగితే..?

● బస్సుల్లో లేని ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ? ● స్త్రీ శక్తి పథకంతో పెరిగిన ప్రయాణికుల రద్దీ ● నిత్యం ప్రమాదాలు ● పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో ఆర్టీసీ బస్సులు అనేక ప్రమాదాలకు గురవుతున్నాయి. అధిక రద్దీ మూలంగా చిన్నచిన్న ప్రమాదాలలో ప్రయాణికులు గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అయితే ఆర్టీసీ బస్సుల్లో ఉండాల్సిన ప్రథమ చికిత్సకు సంబంధించిన బాక్సులు కనిపించడం లేదు. కొన్ని బస్సుల్లో బాక్సులు ఉన్నా వాటిల్లో మందులు మాత్రం ఉండటం లేదు.

● స్త్రీ శక్తితో పెరిగిన రద్దీ

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించింది. బస్సులన్ని నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతు న్నాయి. ప్రభుత్వం అదనంగా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ఉన్న బస్సుల్లోనే రద్దీ పెరిగింది. చాలా మంది బస్సుల్లో నిలబడే ప్రయాణిస్తున్నారు. దీంతోపాటు ప్రధాన రహదారులపై ఇటీవలి కాలంలో ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురైన సంఘటనలు పెరుగుతున్నాయి. పలు ప్రమాద సంఘటనల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందడం లేదు. ఇదివరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్సకు సంబంధించిన బాక్సులు ఇతర మెడిసిన్ ఉండేది. ఆ బాక్సుల్లో అవసరమైన మందులు, కాటన్ తదితర పరికరాలు ఉండేవి.

● విజయవాడ నుంచి మందులు తెప్పిస్తాం

ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు విజయవాడ జోన్ కార్యాలయం నుంచి తెప్పించుకుంటాము. పల్నాడు జిల్లాలో 295 సంస్థ బస్సులు, 145 అద్దె బస్సులు ఉన్నాయి. 295 సంస్థ బస్సుల్లో మేమే మందులు పెడుతున్నాం. అవసరమైన మందులు కావాలని ఇప్పటికే ఇం డెంట్ ఇచ్చాం. పల్నాడు జిల్లాలో ఫస్ట్‌ఎయిడ్ బాక్సుల్లో మందులు అందించేందుకు స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. త్వరలో అన్ని బస్సుల్లో మందులు ఏర్పాటు చేస్తాం.

-ఆర్‌టీసీ రీజనల్ మేనేజరు అజితకుమారి



● మాయమైన కిట్లు

ప్రస్తుతం 70 శాతం బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్‌లు లేవు. దాంతో ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో ప్రయాణికులకు ప్రథమ చికిత్స చేయడం కుదరడం లేదు. ఆర్టీసీ అధికారులు బస్సుల్లో ప్రథమ చికిత్సకు సంబంధించిన కిట్లను అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. పల్నాడు జిల్లాలో 295 ఆర్‌టీసీ సంస్థ బస్సులు, 145 అద్దె బస్సులు ఉన్నాయి. ఆయా బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో అత్యవసరమైన మందులు ఉండాలని డాక్టర్లు పేర్కొంటున్నారు. ఇందులో జ్వరం, దగ్గు, విరేచనాలు, కడుపునొప్పి, గాయాలు పాలయినపుడు శిక్షణకు దూది, ఆయిట్‌మెంటు, హైడ్రోజన్ పెరాక్సైడ్ పెట్టాల్సి ఉంటుంది.



బస్సులో ఖాళీగా ఉన్న ఫస్ట్‌ఎయిడ్ బాక్సు

ఫ్యాషన్



జీన్స్‌తో కలిపి ధరించే టాప్స్‌లో పెప్లమ్ టాప్స్ ప్రత్యేకంగా ఉంటాయి. రొటీన్‌కు భిన్నంగా కనిపించాలనుకునే మహిళలు తప్పనిసరిగా ఎంచుకోవలసిన టాప్స్ ఇవి. దుస్తులకు వినూత్నమైన ఆకర్షణను తెచ్చిపెట్టే ఈ కుచ్చుల టాప్స్ మీకోసం...

పసందైన పెప్లమ్

- నడుము దగ్గర కనిపించే కుచ్చుల వల్ల ఎబ్బెట్టుగా కనిపిస్తామేమోననే భయం అవసరం లేదు. నిజానికి పెప్లమ్ శరీర సౌష్టవాన్ని ఇంపుగా కనిపించేలా చేస్తుంది. అవర్ గ్లాస్ శరీరాకృతిని కోరుకునేవారు ఈ తరహా టాప్స్‌ను నిస్సందేహంగా ఎంచుకోవచ్చు.
- పెప్లమ్ టాప్స్‌ను లెహంగాతో కూడా కలిపి వేసుకోవచ్చు. అయితే నడుముకు బెల్ట్, మెడకు చున్నీ తప్పనిసరి. ధరించే లెహెంగాను బట్టి యాక్సెసరీస్ ఎంచుకోవాలి. డ్రెస్ భారీగా ఉంటే ఆభరణాలు సింపుల్‌గా ఉండేలా చూసుకోవాలి. హైహీల్స్ తప్పక ధరించాలి.



- సెక్విన్, శాటిన్, గోల్డ్ వర్క్, నెట్... ఎలాంటి మెటీరియల్ అయినా పెప్లమ్ స్టైల్‌కు చక్కగా సూటవుతుంది. వేడుకలకు తగినట్టుగా సందర్భానుసారంగా తయారవాలనుకుంటే అందుకు తగినంత హెవీగా పెప్లమ్ టాప్ ఎంచుకుంటే సరిపోతుంది.

భోజనం చేసేటప్పుడు

భోజనం... ఆకలిని తీరుస్తుంది. ఆరోగ్యాన్ని ఇస్తుంది. ఇంతటి ప్రాముఖ్యమున్న భోజనాన్ని ఆహార సూత్రాలు పాటించకుండా పూర్తిచేయడంవల్ల అనారోగ్య సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు.

- భోజనం చేసేటప్పుడు క్రమశిక్షణతో వ్యవహరించాలి. టీవీ, ఫోన్, ల్యాప్‌టాప్ తదితరాలను చూస్తూ భోజనం చేయకూడదు. ఆహారాన్ని ప్రశాంతంగా ఆస్వాదిస్తూ ఆరగించాలి. పదార్థాలను బాగా నమిలి మింగాలి.
- ఒకప్పుడు నేలమీద కూర్చుని భోజనం చేసేవారు. తరువాత డైనింగ్ టేబుల్స్ వచ్చాయి. ప్రస్తుతం నిలబడి తినేస్తున్నారు. ఇది అంత మంచి పద్ధతి కాదు. కింద కూర్చుని తినేటప్పుడు



ముద్ద నోట్లో పెట్టుకోవాలంటే కొద్దిగా ముందుకు వంగాల్సి వస్తుంది. దీంతో పొట్టమీద ఒత్తిడి పడి తిన్న ఆహారం సరిపోయిందీ లేనిదీ వెంటనే తెలుస్తుంది. అదే నిలబడి తింటున్నప్పుడు కావాల్సినదాని కన్నా ఎక్కువగా తినడం అందరికీ అనుభవమే. ఇలా పొట్టను పూర్తిగా నింపడంవల్ల అసిడిటీ, అజీర్తి లాంటి సమస్యలు వస్తాయి. కాబట్టి ఎలాంటి ఆహారాన్ని ఎంత మోతాదులో తింటున్నామో గమనించుకుంటూ ఉండాలి. మితంగా, పోషకాహారం తీసుకోవాలి.

- పొట్టలో ముప్పావు వంతు నిండే వరకు మాత్రమే తినాలి. మిగిలిన భాగాన్ని ఖాళీగా ఉంచాలి. అప్పుడే జీర్ణక్రియ సజావుగా జరుగుతుంది.
- భోజనం మధ్యలో లేదా పూర్తయిన తరువాత ఎక్కువ నీళ్లు తాగకూడదు. అవసరం మేరకు కొద్దిగా తాగాలి.
- భోజనం చేసిన తరువాత కనీసం నాలుగు గంటల వరకు ఏ ఇతర ఆహార పదార్థాలు తీసుకోకూడదు.
- రాత్రి భోజనం మితంగా, తేలికగా జీర్ణమయ్యేలా ఉండాలి. వీలైనంత త్వరగా ముగించాలి.

పొందూరుకు కొత్త హంగు

స్వదేశీ వస్తువులనే వినియోగిద్దామన్న గాంధీ స్ఫూర్తితో... నేతన్నలను సంఘటితం చేయాలన్న సంకల్పంతో ఏర్పడింది... 'ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం'. ఏడున్నర దశాబ్దాల కిందట శ్రీకాకుళం జిల్లా పొందూరులో ఆవిర్భవించిన ఈ సంఘం... మన్నికైన ఖాదీ వస్త్రాలను రూపొందిస్తూ ప్రత్యేకతను సంతరించుకుంది. సినీ, రాజకీయ ప్రముఖులను సైతం ఆకర్షిస్తూ... ఇటీవల జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) ట్యాగ్ పొందిన పొందూరు ఖాదీపై 'నవ్య' కథనం.

సంస్కృతి



నూలు వడికి... మగ్గంపై నేసే వరకు... పొందూరు ఖాదీ తయారీలో ప్రతి ప్రక్రియా చేత్తోనే జరుగుతుంది. ఇదే ఇక్కడి ప్రత్యేకత. మిషన్లు ముంచెత్తినా... ఫ్యాషన్ ప్రపంచం ఆధునికతను సంతరించుకున్నా... పొందూరు నేతన్నలు మాత్రం సంప్రదాయ పద్ధతులనే అనుసరిస్తున్నారు. గాంధీ స్ఫూర్తితో 1949-50లో ఏర్పడిన 'ఆంధ్ర ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం'... నాటి నుంచీ ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా చిత్తశుద్ధితో కళను కొనసాగిస్తోంది.

మూడు రకాలు...

పొందూరులో మూడు రకాల ఖద్దరు వస్త్రాలు... ప్రాంతీయ, ఎస్ఎంసీ, ఏఎంసీ ఖాదీ తయారవుతాయి. ఇందులో పాట్నూలుతో చేసిన ఖద్దరుకు ఆదరణ ఎక్కువ. దీన్నే 'ఫైన్ ఖాదీ' అంటారు. చేతి రుమాలు నుంచి తువ్వాళ్లు, ధోవతీలు, లుంగీలు, వెండి జరీ అంచు పంచెలు, షర్టులు, జమదానీ చీరలు ఇక్కడ రూపొందిస్తారు. అలాగే మజిలీ ఖాదీతో తయారీ చేసిన చీరలూ ప్రత్యేకమే. అప్పట్లో గాంధీ మనవడు దేవదాస్‌గాంధీ వచ్చి పొందూరు ఖాదీని పరిశీలించారు. క్రమంగా రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభించింది. అయితే తయారీ ఖర్చు పెరగడం... ఆశించిన కూలి రాకపోవడంతో చాలామంది నేతన్నలు ఈ వృత్తిని వదిలేశారు. కొన్ని కుటుంబాలు మాత్రం సంప్రదాయ నేత పనిని వదులుకోలేక కొనసాగిస్తూ వస్తున్నారు. భార్యాభర్తలు కలిసి మగ్గం నడిపిస్తూ కళను బతికిస్తున్నారు.

ఆర్థిక భద్రత కల్పించాలి



జీఐ లభించడం సంతోషదాయకమే. అయితే ఇప్పుడు కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. నేతన్నలకు ఆర్థిక ప్రయోజనం, ఆర్థిక భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. దీనివల్ల ఖాదీ సంఘం పటిష్ఠమవుతుంది. సంఘానికి రూ.30 లక్షలు రుణాలు కావాలని బ్యాంకును కోరాం. కానీ స్పందన లేదు. సంఘం భవనం మరమ్మతులకు రూ.1.5 కోట్లు కేటాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రికి విన్నవించాం. ఇంకా మంజూరు కాలేదు.

- దండి వెంకటరావు, సంఘం కార్యదర్శి

ఎంత చేసినా...

ఒకప్పుడు పొందూరులో మాత్రమే లభించే ఖాదీ... క్రమంగా శ్రీకాకుళం, పాలకొండ, చీపురుపల్లి, రాజాంలో కూడా విస్తరించింది. ఆ ప్రాంతాల్లో సేల్స్ అవుట్‌లెట్‌లు ఏర్పాటయ్యాయి. సంఘం ద్వారా తయారైన ఖాదీ వస్త్రాలను వీటిల్లో విక్రయిస్తున్నారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో 'పొందూరు ఖాదీ' పేరుతో 20 వేలకు పైగా దుకాణాలు వెలిశాయి. వీటికీ... సంఘంతో సంబంధం లేదు. దీనివల్ల పొందూరు నేతన్నలకు ఆదాయం తగ్గింది. అంతేకాకుండా... ఖాదీ వస్త్రాల ధరలు గణనీయంగా పెరగడంతో స్వల్పాదాయ వర్గాలు వీటికి దూరమయ్యాయి. గతంలో పొందూరు వచ్చిన కేంద్ర మంత్రి నిర్మాలా సీతారామన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లింది సంఘం. అదేసమయంలో స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు పొందూరు ఖాదీకి ప్రత్యేక గుర్తింపు కోసం ప్రయత్నించారు. ఆయన కృషితో ఇక్కడి ఖద్దరుకు ఇటీవల 'జియోగ్రాఫికల్ ఇండికేషన్' (జీఐ) లభించింది. దీనిపై నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదు కోట్ల టర్నోవర్...

ఒకప్పుడు సంఘంలో ఐదు వేల మంది కార్మికులు ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య ఆరొందలకు తగ్గింది. వీరిలో నేత కార్మికులు వందమంది లోపే. ఇక ఖరీదైన జమదానీ చీరలు నేసే కుటుంబాలు ఐదే ఉన్నాయి. ఈ చీరలు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎంతో ఇష్టం. వీటి ఖరీదు సుమారు రూ.25 వేలు. నేసినవారికి రూ. 3వేల కూలి దక్కుతుంది. చీర తయారీకి అవసరమైన సామగ్రి అంతా సంఘం సమకూరుస్తుంది. ఇక వెండి జరీ అంచు పంచెల తయారీ చాలా శ్రమతో కూడుకున్నది. పట్టు నూలు అంచు, వెండి జరీ అంచు పంచెల తయారీకి ఆరు రోజులు పడుతుంది. ఒక్కో పంచెకు రూ.1800 కూలీ దక్కుతుంది. ఫైన్ ఖాదీ వస్త్రాలను ఎక్కువగా షర్ట్‌ల కోసం వినియోగిస్తారు. మీటరు వస్త్రం తయారీకి రూ. 300 కూలి ఇస్తారు. అలా రూపొందించిన ఫైన్ ఖాదీ వస్త్రాన్ని మీటరు రెండు వేలకు విక్రయిస్తున్నారు. మజిలీ క్లాత్‌తో రూపొందించిన షర్టులు, చీరలు మరో ఆకర్షణ. మొత్తంగా ఏపీ 'ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం' ఏడాదికి రూ.5 కోట్ల మేర టర్నోవర్ సాధిస్తోంది.

ఇద్దరం శ్రమించినా...



సంఘం నుంచి ఇచ్చిన సామగ్రితో పాట్నూలు చొక్కా కోసం వస్త్రాన్ని తయారు చేసి ఇస్తాం. భర్త శ్రీనివాసరావు, నేను... ఇద్దరం రాత్రింబవళ్లూ శ్రమించినా ఇల్లు గడవడం కష్టంగానే ఉంటోంది. ఆర్థిక ప్రయోజనం పెంచితే మా కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది. దీనిపై ప్రభుత్వం ఆలోచించాలి. **- ముప్పాన కమల**

వారందరి ఫేవరెట్...

చాలామంది రాజకీయ నాయకులు, ప్రముఖులు పొందూరు ఖాదీనే ధరిస్తున్నారు. మాజీ సీఎం వైఎస్సార్, ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావుకు ఎంతో ఇష్టమైన వస్త్రం ఇది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పొందూరు ఖాదీ ధరిస్తున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంఘాన్ని నడిపిస్తున్నామని, ప్రభుత్వం చేయూతనందిస్తే ఈ చేనేత కళను నమ్ముకొని జీవిస్తున్నవారికి భరోసా కలుగుతుందని నేతన్నలు అంటున్నారు.

• టి.సురేష్‌బాబు, శ్రీకాకుళం
ఫొటోలు: **జోగారావు**

ఇల్లంతా సువాసన నిండేలా

ఇల్లు తుడిచే నీటిలో సువాసనభరితమైన లిక్విడ్ క్లీనర్స్‌ను కలుపుతూంటాం. వీటిలో ఉండే రసాయనాలవల్ల నేలమీద ఆడుకునే పిల్లలకు రకరకాల చర్మ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అలాకాకుండా నీటిలో వేటిని కలిపితే ఇల్లు శుభ్రంగా సువాసనలతో నిండుతుందో చూద్దాం.



- రెండు నిమ్మకాయలను కోసి వాటి రసాన్ని బకెట్ నీటిలో కలపాలి. ఈ నీటిని ఇల్లంతా చల్లి గుడ్డతో తుడవాలి. దీంతో ఇల్లు తాజాగా అహ్లాదకరంగా మారుతుంది. ఈగలు, దోమలు బయటికి వెళ్లిపోతాయి.
- ఇల్లు తుడిచే నీటిలో కొద్దిగా వైట్ వెనిగర్ లేదా ఒక చెంచా బేకింగ్ సోడా వేసి కలపాలి. ఈ నీటిలో మాప్‌ను ముంచి ఇల్లంతా తుడిస్తే తాజాగా అనిపిస్తుంది. మరకలు, మురికి వదిలిపోయి ఫ్లోర్ చక్కగా మెరుస్తుంది.
- చెంచా లావెండర్ లేదా యూకలిప్టస్ ఆయిల్‌ను తీసుకుని బకెట్ నీటిలో వేసి బాగా కలపాల్షి. ఈ నీటిలో మాప్‌ను ముంచి తుడిస్తే ఇల్లంతా సువాసన వెదజల్లుతుంది. ఇంట్లోకి పురుగులు, దోమలు, ఈగలు రావు.

చలిలో చిలగడదుంప



శీతాకాలంలో చలికి బద్ధకంగా అనిపిస్తుంది. ఆకలి కూడా అంతగా వేయదు. శరీరం త్వరగా శక్తిని కోల్పోతూ ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో చిలగడ దుంపలను తింటే ప్రయోజనకరం.

- చిలగడదుంపల్లో ఎ, సి, డి విటమిన్లతోపాటు బీటా కెరోటిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శ్వాసకోశాన్ని ఇన్ఫెక్షన్ల బారి నుంచి కాపాడతాయి. చిలగడదుంపలను ఉడికించి తింటే శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు బలోపేతమవుతాయి. కంటి సమస్యలు తొలగిపోతాయి.
- చలికాలంలో తరచూ చిలగడదుంపలను తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన పిండిపదార్థాలు లభిస్తాయి. ఇవి క్రమంగా శక్తిని విడుదల్ష చేస్తూ అలసటను పోగొడతాయి.

ముత్యాల ముగ్గు

25 చుక్కలు...
13 సందుచుక్కలు



పద్మావతి గరిమెళ్ల
విశాఖపట్నం

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

ట్రెండ్

చీర కట్టు... కళాత్మకంగా

చీరలు కాలాతీతమైనవి. అయితే కాలక్రమేణా చీరకట్టులో ఎన్నో మార్పులొచ్చేశాయి. సామాజిక మాధ్యమాల్లో కొత్త తరం క్రియేటర్లు చీరకట్టులో కొత్త పంథాలను అనుసరిస్తూ, సంప్రదాయ చీరలకు ఆధునిక హంగులను అద్దుతున్నారు. వాళ్ల వినూత్న ప్రయోగాలు, పొందుతున్న ఆదరణల గురించి తెలుసుకుందాం!

చీరకట్టు సంక్లిష్టమనీ, అసౌకర్యాన్ని కలిగిస్తుందనీ నేటి తరం భావిస్తోంది. కాబట్టే రెడీమేడ్ చీరలు మార్కెట్లోకి ఉప్పెనలా వచ్చిపడుతున్నాయి. కానీ చీరకట్టులో మెలకువలు తెలుసుకోగలిగితే, మరింత సులభంగా, మరింత ఆధునికంగా సింగారించుకోవచ్చని ఇన్‌ఫ్లుయన్సర్లు, శారీ డ్రేప్ నిపుణులూ పేర్కొంటున్నారు.

డాలీ జైన్



ప్రముఖ బ్రైడల్ శారీ డ్రేపర్, డాలీ జైన్, ఏకంగా 350 రకాల చీరకట్టు స్టైల్స్‌ను రూపొందించింది. ఈ సెలబ్రిటీ బ్రైడల్ శారీ డ్రేపర్, కనుమరుగైపోయే ప్రమాదం ఉన్న చీరల గురించి తన అనుభవాన్నీ, అభిప్రాయాన్నీ ఓ సందర్భంలో ఇలా పంచుకుంది. "ఓసారి నా దగ్గరకొక చేనేత కళాకారుడు వచ్చాడు. తన చీరలకు ప్రచారం కల్పించడం కోసం నన్ను ఆశ్రయించిన అతను తన చీరల గురించి మాట్లాడడం మొదలుపెట్టాడు. ఆ మాటల్లో చీరల పట్ల అతనికున్న ప్రేమ, మక్కువలు నన్ను కట్టిపడేశాయి. వెంటనే ఆ చీరలను తెచ్చివ్వమని అన్నాను. అలా కోటా డోరియా చీరలు నాకు మొదటిసారి పరిచయమయ్యాయి. నిజానికి ఆ చీరలు కళాకారుడి వర్ణనను మించి ఎంతో మనోహరంగా ఉన్నాయి. రంగు, ఆకృతి, కట్టుకున్నప్పుడు ఒంటికి హత్తుకునే తీరు నాకెంతో నచ్చాయి. సాధారణంగా చలికాలం రాగానే, 'ఇక కాటన్ చీరలను అటకెక్కించి, సిల్క్ చీరలు కట్టడం మొదలుపెట్టాలి' అని మహిళలందరూ అనుకుంటారు. కానీ నేనది ఒప్పుకోను. కాటన్ చీరలు చలికాలానికి కూడా అనువైనవే! వేసవి, శీతాకాలం, వానాకాలం... కాలంతో సంబంధం లేకుండా ఈ చీరలను ఎప్పుడైనా కట్టుకోవచ్చు. చీరలకు క్రమేపీ ఆదరణ తగ్గుతోంది. నేటి తరం అమ్మాయిలు చీరలను ఓల్డ్ ఫ్యాషన్‌గా పరిగణించకుండా ఉండాలంటే తల్లులు, అత్తలు కొత్త కాపురంలో అడుగుపెట్టే వాళ్ల కూతుళ్లు, కోడళ్లకు తప్పకుండా చీరలను బహుమతిగా అందించాలి. ఏడు వారాల నగలతో పాటు ఏడు వారాల చీరలను కూడా అందించాలి. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో మనందరం ఒక తప్పు చేస్తూ ఉంటాం. 'ఈ అమ్మాయికి చీరలు ఇచ్చి ఏం ప్రయోజనం? ఈ రోజుల్లో చీరలెవరు కడుతున్నారు? ఇంత డబ్బు పోసి కొన్న చీరలను వీళ్ల వార్డ్‌రోబ్‌కే పరిమితం చేసేస్తారు' అంటూ కూతుళ్లు, కోడళ్ల ముందే నిట్టూరుస్తూ ఉంటాం. ఇలా అన్నప్పుడు, ఒకప్పుడు మనం ప్రేమలో పడినట్టు ఇప్పుడు మన అమ్మాయిలు చీరతో ప్రేమలో ఎలా పడగలుగుతారు? కాబట్టి ఈ ధోరణకు స్వస్తి పలికి... 'నువ్వు ఏడు చీరలు, ఏడు కథలు, ఏడు జ్ఞాపకాలు, ఏడు సాంస్కృతిక నిధులను వెంట తీసుకెళ్లాలి' అంటూ చీరలతో కూతుళ్లు, కోడళ్లను సాగనంపాలి' అంటూ చీరలకు పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది డాలీ జైన్

అశ్విని నారాయణ్

శారీ స్టైలిస్ట్ అశ్విని నారాయణ్, కంటెంట్ క్రియేటర్ కూడా! సంప్రదాయ చీరలకు ఆధునిక హంగులు జోడించే అశ్విని, చేనేత కళాకారులతో కలిసి పని చేస్తూ, మన్నికతో కూడి సహజసిద్ధ వస్త్రాలను ఎంచుకోవడం ఉత్తమమని యువతను ప్రేరేపిస్తోంది. ఈమె అనుసరించే చీరకట్టు ఎంతో సులభంగా, సౌకర్యవంతంగా ఉంటుంది. ఉద్యోగాలకూ, ఆరుబయట కాలక్షేపాలకూ, ఇంట్లో ధరించడానికీ వీలుగా ఉండే చీరకట్టును యువతులకు నేర్పిస్తూ ఉంటుందీమె.

నటాషా తాసన్



శారీ ఆర్కిటెక్ట్‌గా పేరు తెచ్చుకున్న నటాషా కెనడాలో స్థిరపడింది. చీరకట్టును స్వీయ వ్యక్తీకరణకు చిహ్నంగా మార్చేసిన నటాషా 'డ్రేప్ థెరపీ'ని స్థాపించి, చీరకట్టును నేర్పిస్తోంది. పవిట, కుచ్చిళ్లను పలు రకాలుగా ఎలా మలుచుకోవచ్చో ఆన్‌లైన్ క్లాసుల ద్వారా బోధిస్తూ ఉంటుంది నటాషా. బిగినర్స్ గైడ్‌తోపాటు, గాడెస్ శారీ డ్రేపింగ్, మల్టీ వేర్ శారీస్, టు వే సిల్క్ శారీస్ చీరకట్టును నేర్పిస్తోంది. సృజనాత్మకమైన, సంప్రదాయేతర చీరకట్టును నిమిషం వ్యవధిలోనే కట్టి చూపించడం ఈమె ప్రత్యేకత.

మోహిని బసు

ఈ ఫ్యాషన్ క్రియేటర్, ఆధునిక శైలిలో చీరకట్టును సాధన చేస్తూ ఉంటుంది. సంక్లిష్టమైన చీరకట్టుతో ప్రయోగాలు చేస్తూ, పిన్నులు పెట్టడం మొదలు, ఒంటికి హత్తుకునేలా చీరలను కట్టడం ఈమె ప్రత్యేకత. ఈమె రూపొందించే చీరల డిజైన్లు ఉన్నత ఫ్యాషన్ల నుంచి ప్రేరణ పొందినవే! సంప్రదాయ వస్త్రాలకు సమకాలీన హంగులు జోడించి, చీరలను శక్తివంతమైన స్టేట్‌మెంట్ పీస్‌గా మార్చేస్తూ ఉంటుందీమె.

సిరీస్ పట్టేస్తారా?

● సూర్య, గిల్ ఫామ్ ఆందోళనకరం
● బుమ్రా డౌటే ● సమంపై దక్షిణాఫ్రికా గురి

నాలుగో టీ20 నేడు



కోచ్ గంభీర్, కెప్టెన్ సూర్య, శివమ్ దూబే

లఖ్‌నవూ: బౌలర్లు గాడిలో పడడంతో పైచేయి సాధించిన భారత్.. స్వదేశంలో మరో పొట్టి సిరీస్‌పై గురి పెట్టింది. దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగే నాలుగో టీ20లో గెలిచి.. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను సొంతం చేసుకోవాలనుకొంటోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 2-1తో ఆధిక్యంలో ఉంది. అయితే, గిల్ వైఫల్యాలు ఇప్పటికే చర్చనీయాంశం కాగా.. కెప్టెన్ సూర్యకుమార్ పేలవ ఫామ్ జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. ఇక ఈ మ్యాచ్‌లోనూ బుమ్రా ఆడే పరిస్థితి లేకపోవడంతో అర్ష్‌దీప్, హర్షిత్‌లను కొనసాగించవచ్చు. లఖ్‌నవూ పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని కుల్దీప్ స్థానంలో సుందర్ తుది జట్టులోకి రావచ్చు. మరోవైపు సౌతాఫ్రికా సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో ఉంది. అయితే, జట్టులో తరచూ మార్పులు సఫారీల బ్యాటింగ్‌ను దెబ్బతీస్తోంది.

జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, జితేశ్, హార్దిక్, దూబే, హర్షిత్, అర్ష్‌దీప్, కుల్దీప్/సుందర్, వరుణ్.

దక్షిణాఫ్రికా: డికాక్, హెండ్రిక్స్, మార్‌క్రమ్ (కెప్టెన్), బ్రేవిస్, మిల్లర్, ఫెరీరా, యాన్సెన్, బాష్, కేశవ్ మహరాజ్/లిండే/నోకియా, ఎన్‌గిడి, బార్ట్‌మన్.


గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో వంతారా వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సోమవారం సందర్శించిన సాకర్ స్టార్ మెస్సీతో అనంత్ అంబానీ దంపతులు


ఆంధ్ర, హైదరాబాద్ జట్లకు నిరాశ

పుణె: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆంధ్ర, హైదరాబాద్ ఫైనల్ చేరడంలో విఫలమయ్యాయి. సూపర్ లీగ్ తమ ఆఖరి మ్యాచ్‌లో హరియాణా చేతిలో ఓడిన హైదరాబాద్ తుది పోరుకు చేరుకొనే సువర్ణావకాశాన్ని చేజార్చుకొంది. అలాగే ఆంధ్ర జట్టు జార్ఖండ్‌పై గెలిచినా టోర్నీనుంచి ఎలిమినేట్ అయింది. గురువారం జరిగే తుది పోరులో సూపర్ లీగ్ గ్రూప్-ఎ టాపర్ జార్ఖండ్‌తో గ్రూప్-బి టాపర్ హరియాణా తలపడతాయి.

అభిజ్ఞాన్ డబుల్ సెంచరీ



అండర్-19 ఆసియా కప్

● విజృంభించిన దీపేష్
● సెమీస్‌కు యువ భారత్
● 315 రన్స్‌తో మలేసియా చిత్తు

దుబాయ్: వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసిన యువ భారత జట్టు అండర్-19 ఆసియా కప్ సెమీస్‌కు దూసుకెళ్లింది. అభిజ్ఞాన్ కుందు (125 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్స్‌లతో 209 నాటౌట్) ద్విశతకంతో అదరగొట్టగా.. దీపేష్ దేవేంద్రన్ (5/22) నిప్పులు చెరిగాడు. దీంతో గ్రూప్-ఎలో మంగళవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 315 పరుగుల తేడాతో మలేసియాను చిత్తు చేసింది. 3 మ్యాచ్‌ల నుంచి 6 పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా భారత్ నాకౌట్‌కు చేరుకోగా.. మలేసియా టోర్నీ నుంచి అవుటైంది. తొలుత భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 408 పరుగులు చేసింది. వేదాంత్ త్రివేది (90), వైభవ్ సూర్యవంశీ (50) హాఫ్ సెంచరీలు చేశారు. మహ్మద్ అక్రమ్ 5 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో మలేసియా 32.1 ఓవర్లలో 93 పరుగులకే కుప్పకూలింది. హమ్జా పంగీ (35) టాప్ స్కోరర్. యూత్ వన్డేల్లో భారత్ తరపున అభిజ్ఞాన్ అత్యధిక స్కోరు నమోదు చేయగా.. భారత 315 పరుగుల గెలుపు యూత్ క్రికెట్‌లో రెండో అతి పెద్దది.

కామెరూన్ గ్రీన్.. ఐపీఎల్‌లో విదేశీ ఆటగాళ్ల ఆధిపత్యాన్ని మరోసారి చాటి చెప్పాడు. అంచనాలకు తగ్గట్టుగానే ఈ ఆసీస్ ఆల్‌రౌండర్‌పై ఫ్రాంచైజీలు అమితాసక్తిని ప్రదర్శించాయి. అధిక మొత్తం కలిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ గ్రీన్ కోసం నువ్వా.. నేనా? అనే రీతిలో బిడ్డింగ్ వేశాయి. చివరకు రూ.25.20 కోట్ల దగ్గర సీఎస్‌కే చేతులెత్తేయగా.. కేకేఆర్ అతడిని వశం చేసుకుంది. ఇక ఈసారి వేలంలో అన్‌క్యాప్డ్ ప్లేయర్ల హవా సాగింది. ఎవరికీ పెద్దగా తెలియని కుర్రాళ్లు కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్‌లపై చెన్నై.. కశ్మీర్ క్రికెటర్ అకీబ్ నబీపై ఢిల్లీ కోట్లు కుమ్మరించాయి.


గ్రీన్

కోట్లు కుమ్మరించారు

రూ.25.20 కోట్లతో కోల్‌కతాకు గ్రీన్ ● పథిరనకు రూ. 18 కోట్లు

● దేశవాళీ కుర్రాళ్లపై కాసుల వర్షం
● కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్‌లకు చెరో రూ.14.2 కోట్లు



పథిరన

అబుదాబి: ఐపీఎల్ వేలం ఎప్పుడు జరిగినా ఆయా ఫ్రాంచైజీలు ఎక్కువగా విదేశీ ఆటగాళ్ల పైనే ఆసక్తి ప్రదర్శిస్తుంటాయి. మంగళవారం జరిగిన తాజా మినీ వేలంలోనూ ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ అంచనాలకు తగ్గట్టుగానే అత్యధిక ధర పలికాడు. చెన్నై నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటూ కోల్‌కతా నైట్‌రైడర్స్ అతడిని రూ.25.20 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పటివరకు ఏ విదేశీ ఆటగాడికి ఇంత మొత్తం లభించలేదు. దీంతో ఆసీస్‌కే చెందిన మిచెల్ స్టార్క్ (రూ.24.75 కోట్లు) పేరిట ఉన్న రికార్డు బద్దలైంది. ఓవరాల్‌గా రూ.27 కోట్లతో రిషభ్ పంత్ టాప్‌లో ఉన్న విషయం తెలిసిందే. మొత్తంగా 359 మంది క్రికెటర్లు వేలానికి అందుబాటులో ఉండగా ఆయా ఫ్రాంచైజీలు 77 మందిని కొనుగోలు చేశాయి. జట్లన్నీ కలిపి వీరిపై రూ.215.45 కోట్లు ఖర్చు చేశాయి. అత్యధికంగా కేకేఆర్ రూ.64.30 కోట్లు, సీఎస్‌కే రూ.43.40 కోట్ల మొత్తంతో ఈ వేలంలో అడుగుపెట్టాయి. అందుకే ఈ రెండు జట్లే గ్రీన్ కోసం ఎంతైనా వెచ్చించేందుకు ఆసక్తి చూపాయి. ఇక నాలుగు సీజన్ల పాటు సీఎస్‌కేకు ఆడిన శ్రీలంక యువ పేసర్ పథిరన అంచనాలకు మించి రూ.18 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. ఢిల్లీ, లఖ్‌నవూలతో పోటీపడి మరీ కేకేఆర్ ఇతడిని తమ జట్టులో చేర్చుకుంది. ఐపీఎల్‌లో ఓ లంక ఆటగాడికి ఇంత ధర పలకడం ఇదే తొలిసారి. అలాగే బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్‌పైనా కేకేఆర్ రూ.9.20 కోట్లు పెట్టింది. మొదటి రౌండ్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలిన లివింగ్‌స్టోన్‌ను సన్‌రైజర్స్ రూ.13 కోట్లకు, జోష్ ఇన్‌గ్లిస్‌ను లఖ్‌నవూ రూ.8.60 కోట్లకు, ఎన్‌గిడిని రూ.2 కోట్లకు డీసీ, మ్యాట్ హెన్రీని సీఎస్‌కే రూ.2 కోట్లకు, రచిన్‌ను కేకేఆర్ రూ.2 కోట్లకు తీసుకోవడం విశేషం. జాసన్ హోల్డర్‌ను రూ.7 కోట్లకు గుజరాత్ దక్కించుకుంది.

వేలంలో టాప్-5 ఆటగాళ్లు

ఆటగాడు	ధర	జట్టు
కామెరూన్ గ్రీన్	రూ.25.20 కోట్లు	కోల్‌కతా
పథిరన	రూ.18 కోట్లు	కోల్‌కతా
కార్తీక్ శర్మ	రూ.14.20 కోట్లు	చెన్నై
ప్రశాంత్ వీర్	రూ.14.20 కోట్లు	చెన్నై
లివింగ్‌స్టోన్	రూ.13 కోట్లు	సన్‌రైజర్స్

రూ.30 లక్షల నుంచి రూ.14.2 కోట్లకు..

కనీవినీ ఎరుగని రీతిలో ఈసారి వేలంలో అన్‌క్యాప్డ్ ఆటగాళ్ల హవా సాగింది. ఒక్కసారి కూడా భారత్‌కు ఆడని వీరిపై ఫ్రాంచైజీలు కోట్లు కుమ్మరించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా భవిష్యత్ జట్టును దృష్టిలో ఉంచుకుని సీఎస్‌కే వీరి విషయంలో దూకుడుగా వ్యవహరించింది. దేశవాళీల్లో రాణిస్తున్న 19 ఏళ్ల వికెట్ కీపర్ కార్తీక్ శర్మ, 20 ఏళ్ల ప్రశాంత్ వీర్‌ల కనీస ధర కేవలం రూ.30 లక్షలే. అయినా ఈ ఇద్దరిపై చెన్నై రూ.14.2 కోట్ల చొప్పున ఖర్చు చేసి మరీ దక్కించుకుంది. దీంతో ఈ ఇద్దరు అన్‌క్యాప్డ్ ఆటగాళ్లపైనే ఆ జట్టు రూ.28.4 కోట్లు వెచ్చించడం గమనార్హం. ఈ వేలంలో వీరిదే మూడో అత్యధిక ధర కావడం విశేషం. ఇక కశ్మీర్‌కు చెందిన పేసర్ అకీబ్ నబీని ఢిల్లీ జట్టు రూ.8.40 కోట్లకు, ఆల్‌రౌండర్ మంగేశ్‌ను ఆర్‌సీబీ రూ.5.20 కోట్లకు తీసుకున్నాయి.

ఈసారి అదృష్టం వరించె..

దేశవాళీ మ్యాచ్‌ల్లో పరుగుల వరద పారిస్తున్న సర్ఫరాజ్ ఖాన్, పృథ్వీ షాలపై ఈసారి వేలంలో అందరి దృష్టి పడింది. ఈసారి కూడా మొదట ఈ జోడీపై ఏ జట్టూ ఆసక్తి ప్రదర్శించలేదు. అయితే చివరకు సర్ఫరాజ్‌ను సీఎస్‌కే, పృథ్వీ షాను ఢిల్లీ క్యాపిటల్స్ వారి కనీస ధర రూ.75 లక్షలకే తీసుకోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

గ్రీన్‌కు దక్కేవి రూ.18 కోట్లే..

కామెరూన్ గ్రీన్ రూ.25.20 కోట్లతో అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా నిలిచినప్పటికీ, అతడి ఖాతాలో చేరేది రూ.18 కోట్లు మాత్రమే. దీనికి కారణం ఐపీఎల్‌లో ఉన్న గరిష్ఠ ఫీజు నిబంధన. వేలంలో పాల్గొనే విదేశీ ఆటగాళ్లకు చెల్లించే గరిష్ఠ వేతనం రూ.18 కోట్లుగానే నిర్ణయించారు. అంతకుమించి ఎంత మొత్తమైనా అది బీసీసీఐ నిర్వహించే ప్లేయర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు మళ్లిస్తారు. భారత ఆటగాళ్లకన్నా విదేశీ ప్లేయర్లకే ఎక్కువ మొత్తం దక్కుతుందనే విమర్శల నేపథ్యంలో బోర్డు ఈ స్లాబ్ తీసుకొచ్చింది. దీంతో గ్రీన్ ధరలో మిగిలిన రూ.7.2 కోట్లు బీసీసీఐ ఖాతాలో చేరనున్నాయి.

ఎవరీ కుర్రాళ్లు?


ప్రశాంత్ అకీబ్ నబీ కార్తిక్

ఐపీఎల్ మినీ వేలంలో అత్యధిక ధర పొందిన అన్‌క్యాప్డ్ ప్లేయర్లుగా కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్‌ల పేర్లు మార్మోగిపోతున్నాయి. దీంతో ఎవరీ ఆటగాళ్లంటూ నెట్‌లో శోధించసాగారు. రాజస్థాన్‌కు చెందిన 19 ఏళ్ల కార్తీక్ పవర్ హిట్టర్. అలాగే వికెట్ కీపర్ కూడా అయిన తను మిడిలార్డర్‌లో బరిలోకి దిగి భారీ షాట్లతో ఆకట్టుకోగలడు. ఉత్తరాఖండ్‌పై రంజీ అరంగేట్రంలోనే శతకం బాదగా, గత విజయ్ హజారే ట్రోఫీలో రాజస్థాన్ తరపున ఎక్కువ పరుగులు (445) సాధించాడు. గతంలో స్థానికంగా జరిగిన వన్డే మ్యాచ్‌లో 300 పరుగులతో అదరగొట్టాడు. ఇక ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన 20 ఏళ్ల ప్రశాంత్ లెఫ్టామ్ స్పిన్ బౌలింగ్‌తో పాటు లోయరార్డర్‌లో బ్యాటింగ్ చేయగలడు. జడేజా లోటును సీఎస్‌కే తనతో భర్తీ చేయాలనుకుంటోంది. ఈ ఏడాది యూపీ టీ20 టోర్నీలో ప్రశాంత్ 10 మ్యాచ్‌ల్లో 320 రన్స్, 8 వికెట్లు తీశాడు. ఈ ఇద్దరూ గతేడాది సీఎస్‌కే క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందిన వారే కావడం విశేషం.

భారత స్టార్ ఆటగాళ్లకు నిరాశే..

మినీ వేలంలో భారత స్టార్ ఆటగాళ్ల విషయంలో ఫ్రాంచైజీలు ఆచితూచి వ్యవహరించాయి. గతంలో మాదిరి ఎక్కువ ధర పెట్టేందుకు ఇష్టపడలేదు. దీంతో రవి బిష్ణోయ్‌ను రాజస్థాన్ రూ.7.20 కోట్లకు, వెంకటేశ్ అయ్యర్‌ను ఆర్‌సీబీ రూ.7 కోట్లకు తీసుకున్నాయి. గత మెగా వేలంలో వెంకటేశ్‌పై కోల్‌కతా రూ. 23.75 కోట్లు వెచ్చించిన విషయం తెలిసిందే.

తెలుగు క్రికెటర్లు ఇద్దరే..

వేలంలో పలువురు తెలుగు రాష్ట్రాల క్రికెటర్లు అందుబాటులో ఉన్నా కొందరినే అదృష్టం వరించింది. ఇందులో ఆంధ్ర ఆటగాడు పృథ్విరాజ్ యర్రాను గుజరాత్ రూ.30 లక్షలకు తీసుకోగా, హైదరాబాద్‌కు చెందిన అమన్ రావును రాజస్థాన్ రూ.30 లక్షలకు తీసుకుంది. ఇక చామ మిలింద్, శ్రీకర్ భరత్, తనయ్ త్యాగరాజన్‌లకు నిరాశే ఎదురైంది.

రూపాయి @ 91

డాలర్ మారకంలో ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపీ

- ఇంట్రాడేలో ఏకంగా 91.14 స్థాయికి
- చివరికి 15 పైసల నష్టంతో 90.93 వద్ద క్లోజింగ్
- 10 ట్రేడింగ్ సెషన్లలో 90 నుంచి 91కి
- త్వరలోనే 92 స్థాయికి పడిపోయే చాన్స్!



న్యూఢిల్లీ: ఫారెక్స్ మార్కెట్లో రూపాయి యథేచ్ఛగా దిగజారుతూనే ఉంది. మంగళవారం డాలర్ మారకంలో రూపాయి విలువ మరో 15 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 90.93 వద్ద స్థిరపడింది. అంతకు ముందు ఇంట్రాడేలో 36 పైసలు క్షీణించి జీవితకాల కనిష్ఠ స్థాయి 91.14 వరకు కూడా దిగజారింది. కేవలం 10 ట్రేడింగ్ సెషన్లలోనే డాలర్ మారకంలో రూపాయి 90 నుంచి 91 స్థాయికి పడిపోయింది. కేవలం ఐదు సెషన్లలోనే 1 శాతం మేరకు నష్టపోయింది. డాలర్ బలహీనత, క్రూడాయిల్ ధరల తగ్గుదల సైతం రూపాయి పతనాన్ని నిలువరించలేకపోయాయి. మంగళవారం బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.54 శాతం దిగజారి 59.63 డాలర్లకు దిగి వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నెలలోనే రూపాయి 92 కన్నా దిగజారవచ్చని ఫారెక్స్ ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. కాగా బుధవారం రూపాయి కదలికలు 90.75 -91.25 మధ్యన ఉండవచ్చని విశ్లేషకులంటున్నారు. ఇదిలా ఉండగా 2027 జూన్ నాటికి రూపాయి 92-94 స్థాయికి దిగజారవచ్చని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ నీలకంఠ్ మిశ్రా అంచనా వేస్తున్నారు. అయితే రూపాయి ఎంత దిగజారినా మనం భయపడాల్సిందేమీ లేదన్నది ఆయన అభిప్రాయం. మనం 68,500-69,000 కోట్ల డాలర్ల భారీ విదేశీ మారకపు నిల్వలతో అత్యంత శక్తివంతంగా ఉన్నామని ఆయన అన్నారు.

ఎందుకు ఈ పతనం: అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారత్ చేసిన కొత్త ప్రతిపాదనలను స్వీకరించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించలేదన్న వార్తలు రూపాయి మారకాన్ని ప్రభావితం చేశాయని ఫారెక్స్ ట్రేడర్లంటున్నారు. సరికొత్త ప్రతిపాదనలను భారత్ ఖరారు చేసే వరకు డీల్ నిలిచిపోయినట్టే అన్న భయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మరోపక్క రూపాయి పతనాన్ని నిలువరించేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోవడం వల్ల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) నిధులు ఉపసంహరించడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టయింది.

వాణిజ్య లోటే కారణం

రూపాయి విలువ ఇంతగా పడిపోవడానికి వాణిజ్య లోటే కారణమని ప్రభుత్వం చెబుతోంది. మంగళవారం రూపాయి నిరంతర పతనం అంశాన్ని కొందరు సభ్యులు రాజ్యసభలో ప్రస్తావించగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ ప్రకటన చేశారు. ఈ ఏడాది రూపాయి విలువను వాణిజ్య లోటు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రభావితం చేశాయని మంత్రి చెప్పారు. రూపాయి విలువ క్షీణత వల్ల ఎగుమతి రంగం పోటీ సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు. ఇదే సమయంలో దిగుమతుల విలువ పెరగవచ్చని కూడా ఆయన అంగీకరించారు. రూపాయి విలువను మార్కెట్ నిర్ణయిస్తుందని, దానికి ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించలేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే రూపాయి కదలికలను ఆర్‌బీఐ నిరంతరం ట్రాక్ చేస్తున్నదని, ఆటుపోట్లు తీవ్రంగా ఉంటే అవసరమైన మేరకు జోక్యం చేసుకుంటుందని ఆయన చెప్పారు.

2017 నుంచి క్షీణతే...

ఈ ఏడాది డిసెంబరు 3వ తేదీ వరకు రూపాయి విలువ 5.1% క్షీణించిందని మంత్రి పంకజ్ వెల్లడించారు. వివిధ సంవత్సరాల్లో రూపాయి ట్రెండ్‌ను వివరిస్తూ 2015 సంవత్సరంలో 4.5%, 2016లో 2.6% దిగజారిన దేశీయ కరెన్సీ 2017లో 6.4% పెరిగిందన్నారు. అయితే 2017 నుంచి రూపీ విలువ క్షీణిస్తూనే వచ్చింది. రూపీ 2018లో 8.5%, 2019లో 2.3%, 2020లో 2.3%, 2021లో 1.7%, 2022లో 10.2%, 2023లో 0.6%, 2024లో 2.8% క్షీణించిందని తెలిపారు.

ఈ ఏడాది భారత వృద్ధి రేటు 7.3%

బ్రిక్‌వర్క్ రేటింగ్ అంచనా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 7.2-7.3 శాతం మధ్యన ఉండొచ్చని బ్రిక్‌వర్క్ రేటింగ్ అంచనా వేస్తోంది. గడచిన కొన్ని త్రైమాసికాలుగా దేశీయ ఆర్థిక వ్యవస్థ నిలకడగా వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని, రానున్న కాలంలో అదే జోరును కనబరిచే వీలుందని బ్రిక్‌వర్క్ రేటింగ్ సీఈఓ మను సెహగల్, చీఫ్ రేటింగ్ ఆఫీసర్ కేహెచ్ పట్నాయక్ తెలిపారు. ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు, వినియోగం పెరగటంతో పాటు ఇటీవలి జీఎస్‌టీ సంస్కరణలు, వడ్డీ రేట్ల తగ్గింపు వంటి అంశాలు వృద్ధికి చోదక శక్తులుగా నిలవనున్నాయని వారు పేర్కొన్నారు. కాగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5-7 శాతం మధ్యన ఉండే అవకాశం ఉందని పట్నాయక్ తెలిపారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రం కూడా వృద్ధి పథంలో పయనిస్తోందని, రానున్న సంవత్సరాల్లో ఏటా 12-13 శాతం వృద్ధితో 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించే వీలుందన్నారు.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,33,860 ▼	1,22,700 ▼	2,11,000 ▼
విజయవాడ	1,36,000 ▼	1,27,000 ▼	1,98,400 ▼
విశాఖపట్నం	1,36,320 ▼	1,23,500 ▼	2,11,000 ▼
రాజమండ్రి	1,33,850 ▼	1,22,700 ▼	1,93,000 ▼
ప్రొద్దుటూరు	1,31,600 ▼	1,21,070 ▼	1,92,000 ▲
ముంబై	1,31,777 ▼	1,20,708 ▼	1,91,975 ▼

సెన్సెక్స్ మరో 534 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ మార్కెట్ వరుస నష్టాల నుంచి బయటపడలేకపోతోంది. నిరంతరాయంగా తరలిపోతున్న విదేశీ నిధులు, దేశీయ కరెన్సీ రూపాయి బలహీనత, ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాలు ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను దారుణంగా దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ ఒక దశలో 592.75 పాయింట్లు నష్టపోయి 84,620.61 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరికి ఆ నష్టాన్ని 533.50 పాయింట్లకు పరిమితం చేసుకుని 84,679.86 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 167.20 పాయింట్ల నష్టంతో 25,860.10 వద్ద క్లోజైంది.

యశోద హాస్పిటల్స్, ఆర్ఎస్ బ్రదర్స్
పబ్లిక్ ఇష్యూలకు సెబీ ఓకే

మరో ఐదు ఐపీఓలకు అనుమతి ▸▸ రూ.6,000 కోట్ల వరకు సమీకరణ



న్యూఢిల్లీ: దేశంలో పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ) జోరు కొనసాగుతోంది. సెకండరీ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లలో ఉన్నా ప్రమోటర్లు, ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు... ఐపీఓల ద్వారా సొమ్ము చేసుకునేందుకు ఎగబడుతున్నారు. దీంతో ఈ నెల 8-12 మధ్య మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో ఏడు కంపెనీల పబ్లిక్ ఇష్యూలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో హైదరాబాద్ కేంద్రంగా యశోద హాస్పిటల్స్‌ను నిర్వహిస్తున్న యశోద హెల్త్‌కేర్ సర్వీసెస్, ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్స్ పేరుతో రిటైల్ షోరూమ్స్‌ను నిర్వహిస్తున్న ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా కూడా ఉన్నాయి. ఈ ఏడు కంపెనీలు ప్రైమరీ మార్కెట్ నుంచి దాదాపు రూ.6,000 కోట్ల వరకు సమీకరించనున్నాయి. ఈ కంపెనీలన్నీ ఐపీఓల కోసం ఈ ఏడాది మే-సెప్టెంబరు మధ్య కాలంలో సెబీకి దరఖాస్తు చేశాయి.

యశోద హెల్త్‌కేర్ రూ.4,000 కోట్ల సమీకరణ

తాజాగా సెబీ ఆమోదం పొందిన ఐపీఓల్లో యశోద హెల్త్‌కేర్ సర్వీసెస్ ఇష్యూనే పెద్దది. సెబీకి సమర్పించిన డ్రాఫ్ట్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) ప్రకారం ఈ కంపెనీ ఐపీఓ ద్వారా రూ.3,000 కోట్ల నుంచి రూ.4,000 కోట్ల వరకు సమీకరించే వీలుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా కూడా తాజాగా షేర్ల జారీ ద్వారా రూ.500 కోట్లు సమీకరించనుండగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద 2.98 కోట్ల షేర్లను విక్రయిస్తోంది. కంపెనీ ఈ నిధులను రుణాల చెల్లింపు, ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్స్ పేరుతో కొత్త స్టోర్ల ఏర్పాటుకు, ఇతర వ్యాపార కార్యకలాపాలకు వినియోగించనుంది.

ఈ రెండు కంపెనీలతో పాటు ఫ్యూజన్ సీఎక్స్, ఓరియంట్ కేబుల్స్ (ఇండియా) లిమిటెడ్, టర్టిల్‌మెంట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్, ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్, లోహియా కార్ప్ కంపెనీల ఐపీఓలకూ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో ఫ్యూజన్ సీఎక్స్ రూ.1,000 కోట్లు, ఓరియంట్ కేబుల్స్ (ఇండియా) లిమిటెడ్ రూ.700 కోట్ల వరకు ఐపీఓల ద్వారా సమీకరించనున్నాయి.

ఈక్విటీ పెట్టుబడులకు ఢోకా లేదు

క్వాంటమ్ ఎంఎఫ్ సీఈఓ సీమంత్ శుక్లా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయ ఈక్విటీ మార్కెట్లలో పెట్టే పెట్టుబడులకు ఏ మాత్రం ఢోకా లేదని క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ సీమంత్ శుక్లా అన్నారు. ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న ఆటుపోట్లన్నీ తాత్కాలికమైనవని, దీర్ఘకాలంలో ఇవి మరింత వృద్ధి పథంలో సాగే అవకాశం ఉందన్నారు. మంగళవారం నాడిక్కడ క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ రీజినల్ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టే మదుపరులు దీర్ఘకాలంలో అత్యుత్తమ రిటర్నులు అందుకునే వీలుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు స్టాక్ మార్కెట్లు ఆటుపోట్లలో సాగుతున్నప్పటికీ భారత ఈక్విటీ మార్కెట్లు నిలకడగా సాగుతూ వస్తున్నాయని, ఇది మదుపరులకు కలిసిరానుందని ఆయన పేర్కొన్నారు. క్రమానుగత పెట్టుబడుల (సిప్) రూపంలో పెట్టే పెట్టుబడులు నిలకడైన రిటర్నులు అందిస్తుండటంతో చాలా మంది మదుపరులు వాటిపై మక్కువ చూపిస్తూ వస్తున్నారన్నారు. ప్రస్తుతం బ్యాంకింగ్, ఐటీ రంగాలు బుల్లిష్‌గా ఉన్నాయన్నారు. కాగా ప్రస్తుతం క్వాంటమ్ పోర్టుఫోలియోలో 14 పథకాలు ఉండగా నిర్వహణలో ఉన్న ఆస్తుల (ఏయూఎం) విలువ రూ.3,700 కోట్లుగా ఉందన్నారు. క్వాంటమ్ దేశవ్యాప్తంగా 9 కార్యాలయాలను నిర్వహిస్తుండగా వచ్చే ఏడాది నాటికి మరో 4 కొత్త కార్యాలయాలను ప్రారంభించాలని చూస్తున్నట్లు శుక్లా వెల్లడించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	671	విజయవాడ	700
వరంగల్	673	గోదావరి	675
చిత్తూరు	688	విశాఖపట్నం	675
		డజను గుడ్లు రూ.	96



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	115
వరంగల్	114	గుంటూరు	125
కరీంనగర్	114	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	124
కర్నూలు	114	నెల్లూరు	129
విశాఖపట్నం	111	అనంతపురం	129
గోదావరి	115		



చైనా బల్క్ డ్రగ్స్‌ను కట్టడి చేయాల్సిందే

త్వరగా కనీస దిగుమతి ధర అమలు చేయండి

ప్రభుత్వానికి బీడీఎంఏ వినతి

హైదరాబాద్: చైనా నుంచి చౌకగా వచ్చిపడుతున్న బల్క్ డ్రగ్స్ దిగుమతులను అడ్డుకోవాలని దేశీయ బల్క్ డ్రగ్స్ పరిశ్రమ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇందుకోసం త్వరగా కనీస దిగుమతి ధర (ఎంఐపీ) విధానం అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. లేకపోతే చౌకగా వచ్చిపడుతున్న చైనా బల్క్ డ్రగ్స్‌తో పోటీపడలేక దేశీయ బల్క్ డ్రగ్ కంపెనీలు మూతపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. చైనా ఇటీవల తన బల్క్ డ్రగ్స్ ధరలను భారీగా తగ్గించి అతి తక్కువ ధరకు భారత్ వంటి దేశాలకు పెద్దఎత్తున ఎగుమతి చేస్తోంది. దీంతో ఇప్పుడిప్పుడే పురుడు పోసుకుంటున్న దేశీయ బల్క్ డ్రగ్స్ కంపెనీలు అల్లాడి పోతున్నాయి. కీలకమైన యాంటీబయాటిక్స్ ఔషధాల్లో ఉపయోగించే పెన్సిలిన్ జీ వంటి బల్క్ డ్రగ్స్ విషయంలోనూ చైనా ఇదే పద్ధతి అనుసరిస్తోంది. వీలైనంత త్వరగా ఎంఐపీ నిర్ణయిస్తే తప్ప, చైనా అడ్డగోలు ఎగుమతులకు చెక్ పెట్టేందుకు వీలుపడదని బల్క్ డ్రగ్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (బీడీఎంఏ) స్పష్టం చేసింది. దీర్ఘకాలిక దేశ భద్రత దృష్ట్యా చూసినా ఇది అనివార్యమని పేర్కొంది. బల్క్ డ్రగ్స్ ఎంఐపీని ధరల స్థిరీకరణ చర్యగా చూడాలే తప్ప, వాణిజ్య రక్షణ చర్యగా చూడకూడదని తెలిపింది.



పండ్ల ఉత్పత్తిలో ఏపీ టాప్

- రాష్ట్రంలో 8.07లక్షల హెక్టార్లలో ఉద్యాన తోటలు
- 2024-25లో 1.93 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తి
- 21.05 లక్షల టన్నుల ఉత్పత్తితో తెలంగాణకు 15వ స్థానం

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పండ్ల ఉత్పత్తిలో రాష్ట్రం దూసుకెళ్తోంది. 2024-25లో 1.93 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తితో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా 71.70 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు పండిస్తుండగా, 11.87 కోట్ల టన్నులు పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. 2024-25లో ఉద్యాన పంటల సాగు, ఉత్పత్తిపై ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. దేశంలో ఉద్యాన పంటల సాగులో రెండో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్.. పండ్ల ఉత్పత్తిలో మాత్రం మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రంలో 8.07 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉండగా.. 1.93 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తితో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో 1.81 లక్షల హెక్టార్లలో సాగు, 21.05 లక్షల టన్నుల పండ్ల ఉత్పత్తితో తెలంగాణ 15వ స్థానంలో నిలిచింది. అయితే సాగులో 8.96 లక్షల హెక్టార్ల అగ్రస్థానంలో ఉన్న మహారాష్ట్ర ఉత్పత్తిలో మాత్రం 1.68 కోట్ల టన్నులతో రెండో స్థానం దక్కించుకుంది. 5.89 లక్షల హెక్టార్లలో సాగు, 1.47 కోట్ల టన్నుల ఉత్పత్తితో ఉత్తరప్రదేశ్ మూడో స్థానంలో నిలిచాయి. పండ్ల ఉత్పత్తిలో మధ్యప్రదేశ్ (1.02 కోట్ల టన్నులు), గుజరాత్ (93.47 లక్షల టన్నులు), తమిళనాడు (78.32 లక్షల టన్నులు), కర్ణాటక (53.26 లక్షల టన్నులు), బిహార్ (46.56 లక్షల టన్నులు), పశ్చిమబెంగాల్ (42.89 లక్షల టన్నులు), కేరళ (41.17లక్షల టన్నులు), ఒడిశా (30.28 లక్షల టన్నులు), అసోం (27 లక్షల టన్నులు), జమ్ము కశ్మీర్ (26.92 లక్షల టన్నులు), పంజాబ్ (26.17 లక్షల టన్నులు), తెలంగాణ (21.05 లక్షల టన్నులు), ఛత్తీస్‌గఢ్ (20.60 లక్షల టన్నులు), జార్ఖండ్ (13.59 లక్షల టన్నులు), రాజస్థాన్ (12.68 లక్షల టన్నులు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మిగతా రాష్ట్రాల్లో వేల హెక్టార్లలో సాగు చేస్తుండగా, పండ్ల ఉత్పత్తి 10 లక్షల టన్నులలోపే ఉంది. దేశంలోని 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉద్యాన తోటలు ఉండగా, 18 రాష్ట్రాల్లోనే లక్ష హెక్టార్లపైన సాగవుతున్నాయి. ఈ రాష్ట్రాలే 10 లక్షల టన్నులపైన దిగుబడి సాధించాయి. కాగా 2024-25లో ఏపీలో అరటి 1.11 లక్షల హెక్టార్లలో 67.34 లక్షల టన్నులు, మామిడి 3.99 లక్షల హెక్టార్లలో 49.86 లక్షల టన్నులు, బత్తాయి 1.13 లక్షల హెక్టార్లలో 23.73 లక్షల టన్నులు, బొప్పాయి 15 వేల హెక్టార్లలో 12.62 లక్షల టన్నులు, నిమ్మ 45 వేల హెక్టార్లలో 9.08 లక్షల టన్నులు, పుచ్చకాయలు 18 వేల హెక్టార్లలో 8.77 లక్షల టన్నులు, జామ 31 వేల హెక్టార్లలో 5.01 లక్షల టన్నులు, దానిమ్మ 15 వేల హెక్టార్లలో 3.86 లక్షల టన్నులు, సపోట 14 వేల హెక్టార్లలో 2.80 లక్షల టన్నుల ఉత్పత్తి వచ్చింది. రాష్ట్రంలో ఉద్యాన పంటలకు సూక్ష్మసేద్యం అత్యధిక శాతం విస్తరించడంతో పండ్ల ఉత్పత్తి గతం కంటే పెరిగిందని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే ఉద్యాన రైతులకు కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా రాయితీలు ఇస్తుండటంతో రాయలసీమలో పండ్ల తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని చెప్పారు.

భారతి సిమెంట్స్‌కు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

కూడా నోటీసులు వెళ్లాయి. 2023, 2024లలో అప్పటి జగన్ సర్కారు ఈ మూడు కంపెనీలకు వేర్వేరుగా సున్నపురాయి నిల్వలున్న భూములను కేంద్ర గనులు, ఖనిజాలు(అభివృద్ధి-నియంత్రణ) చట్టం-1957 (ఎంఎండీఆర్ యాక్ట్) నిబంధనలు, మార్గదర్శకాలకు విరుద్ధంగా.. వేలంలో కాకుండా లీజులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో భారతి సిమెంట్స్‌కు ఇచ్చిను లీజులు ఎంఎండీఆర్ యాక్ట్‌ను ఉల్లంఘించడమే కాదు, 2023 సెప్టెంబరులో రాష్ట్ర హైకోర్టు ఇచ్చి ఆదేశాలను ఉల్లంఘించి, న్యాయసలహా పేరిట భారీ డ్రామా నడిపి లీజులను నిర్ధారిస్తూ, కాలపరిమితిని 50 ఏళ్లుగా ప్రకటించారు. ఈ మూడు లీజులపై 2024లోనే కేంద్రానికి ఫిర్యాదులు వెళ్లగా విచారణ జరపాలని రాష్ట్రాన్ని ఆదేశించింది. దీనిపై ఈ ఏడాది జూన్ 10న 'భారతికి భూహారతి' పేరిట 'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించింది. అయితే రాష్ట్ర సర్కారు నింపాదిగా ఇప్పుడు ఆ కంపెనీలకు నోటీసులు ఇచ్చింది. జగన్ సర్కారు చేసిన అక్రమాలు, కోర్టు ఆదేశాల ఉల్లంఘన తెలియాలంటే అసలు కేంద్ర చట్టంలో ఏముందో తెలుసుకోవాలి.

వేలం ద్వారానే లీజులు: కేంద్ర చట్టం

2015 వరకు ప్రభుత్వానికి అందిన దరఖాస్తుల ఆధారంగా సున్నపురాయి లీజులను మైనింగ్ కోసం కేటాయించేవారు. అయితే 2015లో ఎంఎండీఆర్ చట్టానికి కేంద్రం సవరణ చేసి కొత్తగా సెక్షన్ 10లో ఏ అనే క్లాజును చేర్చింది. దీని ప్రకారం సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల కాలపరిమితి దానంతట అదే ముగిసిపోతుంది. ఇక ఆ దరఖాస్తులు పనికిరావు. మైనింగ్ కోసం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. ఈ మేరకు రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని 2016 నవంబరు 23న కేంద్రం లేఖలు రాసింది. పర్యావరణ ఇతర అనుమతులు లేని ఒప్పందాలకు ఇదే వర్తిస్తుందని తెలిపింది. కొత్తగా కేటాయించే లీజులు వేలంద్వారానే జరగాలని 2021లో మరో సవరణ చేసింది. వీటిని ఉల్లంఘించి భారతి సిమెంట్స్‌కు లీజుల కేటాయింపు జరిగింది.

ఇదీ భారతి సిమెంట్స్ కథ

భారతి సిమెంట్స్ కన్నా ముందు రఘురామ్ సిమెంట్స్ ఉంది. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడప జిల్లా ఎర్రగుంట్ల, కమలాపురం మండలాల్లో రఘురామ్ సిమెంట్స్‌కు 2006, మార్చి 27న 2037.52 ఎకరాలను కేటాయించారు. అయితే, నాణ్యమైన సున్నపురాయి నిల్వలు లేవనే కారణంతో ఆ భూమిలో 475.16 ఎకరాలను 2008 నవంబరులో ఆ కంపెనీ వదలుకుంది. రఘురామ్ సిమెంట్స్ అనేది 2009 ఫిబ్రవరిలో భారతి సిమెంట్స్‌గా అవతరించింది. ఇందుకు ఆనాటి ప్రభుత్వం ఆమోదముద్రవేస్తూ 2009 ఫిబ్రవరి 13న జీవో 5ను విడుదల చేసింది. అధికారికంగా రఘురామ్ సిమెంట్స్ ద్వారా భారతి సిమెంట్స్‌కు 1562.36 ఎకరాల్లో సున్నపురాయి నిల్వలున్న లీజులున్నాయి. ఇందులో 744.74 ఎకరాలకు మాత్రమే కంపెనీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌ఓఐ)లు ఇచ్చారు. ఆ వెంటనే లీజు అమలు ఉత్తర్వులు ఇచ్చారు. ఆ మేరకు కంపెనీ మైనింగ్ చేపట్టాలి. అందుకోసం చట్టబద్ధమైన ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. కానీ, అది జరగలేదు. భారతి సిమెంట్స్ యజమాని భారతి రెడ్డి. ఆమె వైఎస్ జగన్ సతీమణి. ఆ తర్వాత తెరవెనక ఏం జరిగిందో జగన్‌పై నమోదయిన కేసుల్లో వీటిని సీబీఐ పొందుపరిచింది. రఘురామ్ సిమెంట్స్ అనేది భారతి సిమెంట్స్‌గా మారిపోతే అన్నీ అనుకూలంగా ఉంటాయని భావించారు. వేలకోట్ల విలువైన లీజులు, ఎల్‌ఓఐ, పర్యావరణ అనుమతులు కూడా సింపుల్‌గానే మారిపోతాయనుకున్నారు. కానీ, అదేమీ జరగలేదు. భారతి సిమెంట్స్‌కు అనుమతులు రాలేదు. ఒప్పందాలు జరగలేదు. రాష్ట్ర విభజన తర్వాత జగన్ తనకున్న పరిచయాలతో భారతి సిమెంట్స్‌లో కదలిక తీసుకొచ్చారు. మైనింగ్ ప్లాన్‌కు 2015లో కేంద్రం అనుమతి ఇచ్చింది. అప్పటికి ఆ కంపెనీకి పర్యావరణ అనుమతి(ఈసీ), కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీఎస్‌ఈ) వంటివి రాలేదు. ఇక మైనింగ్ ఒప్పందం ఎలాగూ రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకోలేదు. దీంతో మైనింగ్ ప్లాన్‌కు ఆమోదం పొందినా, 2015 నాటికి ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు గనుక 2015లో ఎంఎండీఆర్ చట్ట సవరణ ప్రకారం లీజు రద్దయిపోవాల్సిందే.

2016లోనే రద్దు నోటీసులు..

2015లో ఎంఎండీఆర్ చట్టంలో చేసిన సవరణ మేరకు సెక్షన్ 10 (ఏ) ప్రకారం ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని, అనుమతులు పొందని లీజులు చెల్లవు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని 2016 నవంబరులోనే కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు ఆనాటి ప్రభుత్వం తొలిసారిగా భారతి సిమెంట్స్‌కు నోటీసులు ఇచ్చింది. చట్టసవరణ ప్రకారం లీజులు ఎందుకు రద్దుచేయకూడదో వివరణ ఇవ్వాలని 2016 డిసెంబరు 30న భారతి సిమెంట్స్‌కు నోటీసులు ఇచ్చింది. ఆ కంపెనీ స్పందించకపోవడంతో 2017 జనవరి 10న లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ)ని రద్దుచేసింది.

జగన్ వచ్చాక మేలు..

జగన్ సర్కారు వచ్చాక భారతి సిమెంట్స్‌కు మేలుచేయడం మొదలుపెట్టారు. తొలుత తమకు లీజులు కొనసాగించాలని కేంద్ర గనుల శాఖ వద్ద రివిజన్ అప్లికేషన్ వేయగా దాన్ని కేంద్రం తిరస్కరించింది. సవరణ చట్టం ప్రకారం కొత్తగా దరఖాస్తు చేసుకొని వేలంలో లీజులు దక్కించుకోవాల్సిందే అని స్పష్టం చేసింది. దీంతో చేసేదేమీలేక కంపెనీ 2021లో హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును కోర్టు సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచింది. దీంతో జగన్ సర్కారు నాటి గనుల శాఖ డైరెక్టర్‌తో ఓ లేఖ రాయించారు. 'భారతి సిమెంట్స్ కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. అది ఇప్పట్లో తేలేలా లేదు. కాబట్టి, ఆ కంపెనీకి ఎంఎండీఆర్ చట్టం ప్రకారం 744 ఎకరాల్లో ఉన్న సున్నపురాయి నిల్వలపై 50 ఏళ్ల లీజులు ఇవ్వాలి' అని ఆ లేఖ సారాంశం. మరోవైపు హైకోర్టు ఇచ్చే ఆదేశాలకు లోబడి తుది నిర్ణయం తీసుకుందామని, ఇప్పటికయితే, భారతి సిమెంట్స్‌కు 50 ఏళ్ల లీజులు ఇస్తున్నట్లుగా 2022 సెప్టెంబరు 8న గనుల శాఖ ఉత్తర్వులిచ్చింది. అయితే, ఆ జీవో 63ను అప్పట్లో చీకట్లో ఉంచారు. వెలుగులోకి రానివ్వలేదు.

> **ఏసీసీ, రామ్‌కోకూ అడ్డగోలు మేలే..**
>
> ఏసీసీ ప్రస్తుతం అదానీ గ్రూప్ నియంత్రణలో ఉంది. దానికి 2010లోనే 2,463 ఎకరాల సున్నపురాయి నిల్వలున్న భూములు కేటాయించారు. అయితే, సకాలంలో అనుమతులు పొందలేకపోయింది. మూడేళ్లలో సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయలేకపోయింది. దీంతో ఆ సంస్థ లీజుల కాలపరిమితి కూడా దాటింది. జగన్ సర్కారు ఆ కంపెనీకి 997 హెక్టార్లలో లీజులను కేటాయిస్తూ 2023 నవంబరు 15న ఆదేశాలు ఇచ్చింది. ఇది కేంద్ర చట్టానికి పూర్తి విరుద్ధంగా జరిగిందని తేలింది. అలాగే, ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్దిరోజుల ముందు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురంలోని 267 ఎకరాల్లోని సున్నపురాయి లీజులను 2024 మార్చి 15న రామ్‌కోకు జగన్ సర్కారు కట్టబెట్టింది. ఇదీ చట్ట విరుద్ధమే అని కేంద్రం చెబుతోంది. భారతి సిమెంట్స్, ఏసీసీ, రామ్‌కోకు ఇచ్చిన లీజులు ఎందుకు రద్దుచేయకూడదంటూ గనుల శాఖ నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లోగా వివరణ ఇవ్వకపోతే ఎంఎండీఆర్ చట్టం ప్రకారం ఆ లీజులను రద్దుచేసే అధికారం ప్రభుత్వానికి ఉంది.

హైకోర్టులో చుక్కెదురు..

భారతి సిమెంట్స్ హైకోర్టులో 2021లో దాఖలు చేసిన కేసులో అనుకూల తీర్పురాలేదు. కేవలం ఆ కంపెనీ వాదనలు విని చట్టం మేరకు చర్యలు తీసుకోవాలని 2023 సెప్టెంబరు 21న హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎలాగైనా దొడ్డిదారిన లీజు పునరుద్ధరణ ఉత్తర్వులు ఇవ్వాలని గట్టి ప్రయత్నమే చేశారు. హైకోర్టు తీర్పుపై ఓ మాజీ న్యాయమూర్తి నుంచి సలహా తీసుకొని లీజులు పునరుద్ధరించుకోవచ్చని సలహా తీసుకున్నారు. దాన్ని నాటి ఏజీతో కూడా సర్టిఫై చేయించారు.

2024 ఎన్నికల ముందు హడావుడిగా..

భారతి సిమెంట్స్ వాదన వినమని మాత్రమే హైకోర్టు చెప్పింది. ఆ కంపెనీకి అనుకూలంగా లీజులు ఇవ్వమని చెప్పనేలేదు. కానీ, నాటి జగన్ సర్కారు తన ఇంటి కంపెనీ కోసం వ్యవస్థలను తప్పుదోవపట్టించి ఏకంగా హైకోర్టు తీర్పుపై మాజీ న్యాయమూర్తి సలహా తీసుకొని లీజులు పునరుద్ధరించేశారు. 2024 ఫిబ్రవరి 2న జీవోలు 4, 5 ద్వారా భారతి సిమెంట్స్‌కు ఎర్రగుంట్ల, కమలాపురం మండలాల్లో అత్యంత విలువైన సున్నపురాయి నిల్వలున్న 744 ఎకరాల భూమిని ధారాదత్తం చేశారు. మైనింగ్ లీజును ఏకంగా 50 ఏళ్లకు పొడిగించారు.

జూన్‌కంటే ముందే భోగాపురం విమానాశ్రయం

- ప్రపంచ ఏవియేషన్ అవసరాలు తీర్చేదిశగా ఎడ్యుసిటీ నిపుణులు
- ఉద్యోగాల కల్పనకు ఇది ఉపయుక్తం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



విశాఖపట్నం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'వచ్చే జూన్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించాలనుకున్నాం. అయితే ఇంకా నెల రోజుల ముందే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది' అని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు చెప్పారు. విశాఖపట్నం రాడిసన్ బ్లూ హోటల్‌లో జీఎంఆర్-మాన్సాస్ సంస్థల మధ్య మంగళవారం జరిగిన ఎడ్యుసిటీ ఒప్పంద కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'ఏవియేషన్ అనేది ఫ్యూచరిస్టిక్ అంశం. సీఎం చంద్రబాబు తన విజన్‌తో ఎడ్యుసిటీని ప్లాన్ చేశారు. ఇక్కడ తయారయ్యే నిపుణులు డొమెస్టిక్ రంగంలోనే కాకుండా ప్రపంచ ఏవియేషన్ అవసరాలు తీర్చే స్థాయికి ఎదుగుతారు. అన్ని అవకాశాలు ఉన్నాయి. ఇకపై వలసలు వెళ్లే అవసరం ఉండదు. ఇతర దేశాల వారే ఇక్కడికి వలస వస్తారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా యూనివర్సిటీలు కూడా ఇక్కడికే వస్తాయి. ఏవియేషన్ ఒక వర్గానికి చెందినది కాదు. ఇప్పుడు ఇది అందరికీ అవసరమైనది. ప్రస్తుతం దేశంలో 800 విమానాలు ఉన్నాయి. మరో 1,700 విమానాలకు ఆర్డర్ పెట్టారు. ప్రతి విమానానికి వంద మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఆ ఉద్యోగాల కల్పనకు ఎడ్యుసిటీ ఉపయోగపడుతుంది. గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు గతంలో సివిల్ ఏవియేషన్ మంత్రిగా పనిచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఏటా 12 శాతం వృద్ధి రేటుతో విమాన రంగం ముందుకు వెళుతోంది. ఇప్పుడు ఉత్తరాంధ్రకు, రేపటి తరం చూడబోయే ఉత్తరాంధ్రకు చాలా తేడా ఉంటుంది' అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

జి.మాడుగులలో 3.8 డిగ్రీలు

- ఏజెన్సీలో కొనసాగనున్న చలి
- మైదానంలో స్వల్పంగా తగ్గే అవకాశం

విశాఖపట్నం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. తెల్లవారుజాము నుంచి మంచు దట్టంగా కురుస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో విజిబులిటీ వంద మీటర్ల కంటే తక్కువగా నమోదవుతోంది. దీంతో ఉదయం పూట వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 3.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు, మూడు రోజుల్లో మైదాన ప్రాంతాల్లో చలి స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని, ఏజెన్సీలో మాత్రం అదేవిధంగా కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

'అఖండ' విజయం ఆనందాన్నిచ్చింది

- బోయపాటి శ్రీను



"'అఖండ 2: తాండవం' సినిమాను డబ్బుల కోసం తీయలేదు. అఖండ భారతం గురించి అందరికీ తెలియాలన్న ఉద్దేశంతో తెరకెక్కించా. ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఈ అఖండ విజయం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని అన్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. బాలకృష్ణ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం' ఇటీవలె విడుదలైంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

● 'అఖండ'ను చూసిన ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా పెరిగాయి. తర్వాత వచ్చే సినిమా ఇంతకన్నా గొప్పస్థాయిలో ఉండాలని అనుకున్నాం. అలాగే మన ధర్మం గురించి చెప్పడం కూడా ఒక గొప్ప విషయంగా భావించాం. ప్రకృతి, పసిబిడ్డ, పరమాత్మ తర్వాత దేశం, ధర్మం, దైవమే నాకు కనిపించింది. అలాంటి కసితో వస్తేనే ప్రేక్షకుల అంచనాలను అందుకోగలం అని అనుకున్నాం. అందుకే ఆ అంశాన్ని టచ్ చేశాం.

● సినిమా విడుదలకు కొద్ది గంటల ముందు జరిగిన పరిణామాలతో మేము భయపడలేదు. మాకు బాలకృష్ణగారు ఉన్నారనే ధైర్యం ఉంది. బాలయ్య గారు వచ్చి సినిమా విడుదలకు కావాల్సినవన్నీ చేశారు. ఆ తర్వాత అన్నీ సజావుగా సాగాయి. సినిమా విడుదలై అఖండ విజయం సాధించింది. ఈ విషయంలో బాలయ్యగారు మాకు ఇచ్చిన సపోర్టును మరచిపోలేము.

రణ్‌వీర్ అలా చేయడం ఇబ్బందిగా అనిపించింది

రిషబ్ శెట్టి



'కాంతార' సినిమాలోని ఓ సన్నివేశాన్ని బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ అనుకరించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై 'కాంతార' చిత్రం దర్శకుడు, కథానాయకుడు రిషబ్ శెట్టి స్పందించారు. 'రణ్‌వీర్ అలా చేయడం ఇబ్బందిగా అనిపించింది. దైవిక అంశాలతో రూపొందిన సినిమా అది. ఆ అంశాలతో మా కన్నడ ప్రజలకు చాలా లోతైన అనుబంధం ఉంది. అందుకే నేను ఎక్కడికెళ్లినా ఈ సినిమాలోని సన్నివేశాలను వేదికలపై హాస్యాస్పదంగా అనుకరించవద్దని కోరుతుంటాను' అని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో రణ్‌వీర్ 'కాంతార'లోని 'ఓ...' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించి కన్నడిగుల ఆగ్రహానికి గురయ్యారు.



ఇటీవలె విడుదలైన 'ఓజీ' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు పవన్‌కల్యాణ్. ఈ సినిమా దర్శకుడు సుజీత్‌కు ఓ ఖరీదైన బహుమతినిచ్చారు ఆయన. నలుపు రంగులో ఉన్న ల్యాండ్ రోవర్ డిఫెండర్ కారును కానుకగా అందజేశారు. ఈ ఆనందాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు సుజీత్.

చివరి వరకూ సస్పెన్సే

- మహి కోమటిరెడ్డి



సాధారణంగా థ్రిల్లర్ సినిమాలంటే కేవలం ఉత్కంఠ మాత్రమే ఉంటుందని భావిస్తారు. కానీ అందులోనూ, ప్రేమ, భావోద్వేగాలను మిళితం చేసి, ఊహించని మలుపులతో 'మిస్టీరియస్' చిత్రాన్ని రూపొందించామని దర్శకుడు మహి కోమటిరెడ్డి తెలిపారు. రోహిత్ హీరోగా జయ్ వల్లందాస్ నిర్మాణంలో తెరకెక్కిన చిత్రమిది. ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మహి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. 'థ్రిల్లర్ సినిమా అయినా కథ డిమాండ్ మేరకు మూడు పాటలు పెట్టాం. సంగీత దర్శకుడు ఎం.ఎల్ రాజా మంచి బాణీలు అందించారు. పోలీసుల గొప్పతనాన్ని వివరించేలా రూపొందించిన పాటకు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రంలో కిల్లర్ ఎవరనేది చివరివరకూ సస్పెన్స్‌గానే సాగుతుంది. క్లైమాక్స్ ఎపిసోడ్‌లో ఎవరూ ఊహించని ట్విస్ట్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది. జయ్ వల్లందాస్ సహకారంతో సినిమాను అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కించాం. 150కు పైగా స్క్రీన్లలో విడుదల చేస్తున్నాం' అని ఆయన చెప్పారు.

తల్లీ కూతుళ్ల అనుబంధం



జ్యోతి అపూర్వ, రవిరావణ్ రుద్ర, శ్రేయ తివారీ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'విచిత్ర'. సైఫుద్దీన్ మాలిక్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. తల్లీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా సైఫుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ 'ప్రతీ ఒక్కరి హృదయాన్ని హత్తుకునేలా ఉంటుందీ చిత్రం. ఇందులోని పాటలు ప్రతీ ఒక్కరినీ అలరిస్తాయి. చిత్రం అందరినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది. వచ్చే ఏడాది ఆరంభంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కడిమిశెట్టి లక్ష్మీనారాయణ.

వినోదం పంచే కథతో



పవన్ మహావీర్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి'. శివాల ప్రభాకర్ దర్శకత్వంలో జి. శైలజా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి రచయిత వి. విజయేంద్రప్రసాద్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిదని దర్శకుడు చెప్పారు. ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథతో రూపొందిస్తున్నాం అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రంలో సుహానా, మేఘశ్రీ కథానాయికలు.

నేనెవరినీ పెళ్లాడలేదు

- మెహ్రీన్



గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో తనపెళ్లి గురించి జరుగుతున్న ప్రచారంపై కథానాయిక మెహ్రీన్ ఫిర్జాదా స్పందించారు. మెహ్రీన్ వివాహం రహస్యంగా జరిగిందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదనీ, అవన్నీ వదంతులేనని స్పష్టం చేశారు. 'నా పెళ్లి గురించి వస్తున్న వార్తల్లో నిజం లేదు. నేను ఎప్పుడూ కలవనీ, చూడని ఓ వ్యక్తితో నా వివాహం జరిగిందంటూ కొన్ని వెబ్‌సైట్లలో రాశారు. దయచేసి ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మకండి. పెళ్లి గురించి ఏ నిర్ణయం తీసుకున్నా స్వయంగా ప్రకటిస్తాను. అప్పటి వరకూ ఇలాంటి ఊహాగానాలను నమ్మొద్దు' అని మెహ్రీన్ కోరారు. గతంలో హర్యానాకు చెందిన భవ్య బిష్ణోయ్‌తో మెహ్రీన్ నిశ్చితార్థం జరిగినప్పటికీ ఆ పెళ్లి రద్దయిన విషయం తెలిసిందే.

కొత్త తరహా సినిమాలను ఆదరించాలి

- బ్రహ్మానందం



"'గుర్రం పాపిరెడ్డి' చిత్రం ఒక వైవిధ్యమైన కథతో రూపొందింది. ఇందులో నేను జడ్జి పాత్రను పోషించాను. కథలో కీలకమైన పాత్ర నాది. ఈ చిత్రాన్ని నేటి తరం ప్రేక్షకులకు నచ్చేలా కొత్త పద్ధతిలో దర్శకుడు మురళీ మనోహర్ తెరకెక్కించారు. కొత్తవాళ్లు తీసిన ఇలాంటి సినిమాను ఆదరిస్తే చిత్రపరిశ్రమ బాగుంటుంది. వారు మరిన్ని మంచి చిత్రాలు తీసే అవకాశం ఉంటుంది' అని అన్నారు సీనియర్ హాస్య నటుడు బ్రహ్మానందం. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా మురళీ మనోహర్ తెరకెక్కించిన చిత్రమిది. వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్(బాబీ) నిర్మించారు. సినిమా ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. చిత్ర దర్శకుడు మురళీ మనోహర్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులకు కొత్త తరహా సినిమాని పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తీశాం' అని చెప్పారు. హీరో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ 'ఈ చిత్రంలో కథానాయకుడిగా నటించే అవకాశం దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. నిర్మాత అమర్ బురా మాట్లాడుతూ 'మా ట్రైలర్ చూసిన యూఎస్ మిత్రులు, డిస్ట్రిబ్యూటర్లు కంటెంట్ గురించే మాట్లాడుకుంటున్నారు' అని చెప్పారు.

మంగపతిలా మెప్పించే పాత్ర చేశా

- శివాజీ



"'దండోరా' చిత్రంలో నా పాత్ర కొత్తగా ఉంటుంది. మంచోడా, కాదా?' అనేది సినిమా చూస్తే గానీ అర్థం కాదు. అయితే ఈ చిత్రంలోని పాత్రలన్నీ నా చుట్టూనే తిరుగుతాయి. అంతటి ప్రాధాన్యమున్న పాత్ర నాది. ఇలాంటి చిత్రాలు, కథలు, పాత్రలు చాలా అరుదుగా వస్తుంటాయి' అని అన్నారు నటుడు శివాజీ. మురళీకాంత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. ఇందులో శివాజీ కీలక పాత్రను పోషించారు. సినిమా ఈనెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివాజీ మీడియాతో మాట్లాడుతూ... 'దండోరా' పూర్తిగా సందేశాత్మక సినిమా కాదు. పూర్తిగా వాణిజ్య హంగులతో తెరకెక్కించిన చిత్రమిది. అన్ని రకాల భావోద్వేగాలు, గొప్ప స్క్రీన్‌ప్లేతో ఎంతో సహజంగా ఉండే చిత్రమిది. 'కోర్ట్'లో మంగపతి పాత్రకు ఎంత పేరు వచ్చిందో అంతే స్థాయిలో 'దండోరా'లోని క్యారెక్టర్‌కూ పేరొస్తుంది. ప్రతీ ఒక్కరూ సినిమాతో, పాత్రలతో కనెక్ట్ అవుతారు' అని తెలిపారు.

నవ్విస్తూ.. భయపెడుతూ..



వరలక్ష్మి శరత్‌కుమార్ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్న చిత్రం 'పోలీస్ కంప్లెయింట్'. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో బాలకృష్ణ మహారాణా నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్ రిలీజ్ వేడుక మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'దర్శకుడు చెప్పిన కథ నచ్చి ఈ సినిమా చేశా. ఇందులో యాక్షన్‌తో పాటు ఫుల్‌లెంగ్త్ కామెడీ రోల్ చేశా. సినిమా బాగా వచ్చింది' అని చెప్పారు. వరలక్ష్మి పవర్‌ఫుల్ యాటిట్యూడ్‌తో పాటు తొలిసారి పూర్తి ఎంటర్‌టైనింగ్ రోల్‌ను అద్భుతంగా పోషించారని నిర్మాత చెప్పారు. దర్శకుడు సంజీవ్ మాట్లాడుతూ 'ప్రేమ, పగ, తప్పు, ఒప్పు, మంచి చెడు.. అంశాల మధ్య హైడ్ అండ్ సీక్ డ్రామాగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నాం' అన్నారు.

అందరికీ నచ్చేలా...



తల్లాడ సాయికృష్ణ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న సినిమా 'మ్యాజిక్ మూమెంట్స్'. 'మీరు అనుకున్నది కాదు' అనేది ఉపశీర్షిక. దర్శకుడు కే దశరథ్ సమర్పణలో తల్లాడ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉందీ చిత్రం. తాజాగా ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ కార్యక్రమంలో తల్లాడ సాయికృష్ణ మాట్లాడుతూ 'మంచి సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో భక్తిపరమైన అంశాలు కూడా మిళితమై ఉంటాయి' అని అన్నారు. 'సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది. ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని కే దశరథ్ తెలిపారు.

ఏపీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు భేష్

» మహారాష్ట్ర పీసీబీ ప్రతినిధుల బృందం కితాబు

అమరావతి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధులు కితాబిచ్చారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద అనుమతుల మంజూరు ప్రక్రియపై అధ్యయనం కోసం మహారాష్ట్ర పీసీబీ బృందం మంగళవారం విజయవాడలోని ఏపీ పీసీబీ కార్యాలయాన్ని సందర్శించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద దరఖాస్తుల స్వీకరణ నుంచి అనుమతుల మంజూరు వరకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, పారదర్శకత, డిజిటలైజేషన్ ద్వారా పరిశ్రమలకు అందుతున్న సౌలభ్యాలపై ఏపీ పీసీబీ చైర్మన్ కృష్ణయ్య, సభ్య కార్యదర్శి శరవణన్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర బృందం అధ్యయనం చేసింది. సర్క్యులర్ ఎకానమీ పాలసీ, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాల నిర్వహణలో ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని మహారాష్ట్ర పీసీబీ సాంకేతిక సలహాదారు నందకుమార్ గౌరవ్ ప్రశంసించారు. ఈ విధానాలను భవిష్యత్‌లో తమ రాష్ట్రంలోనూ అమలు చేస్తామని మహారాష్ట్ర బృందం తెలిపింది.

కోడి గీతలతో 'కోటి సంతకాలు'

» వైసీపీ సంతకాల సేకరణపై మంత్రి సత్యకుమార్ ఎద్దేవా

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'వైద్య కళాశాలల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన ఉద్యమానికి ప్రజా మద్దతు లభించలేదు. దీంతో దిక్కు తెలియక రాజకీయ ఉనికి కోసం.. ఆ పార్టీ అధినేత జగన్ కోడిగీతలతో కోటి సంతకాల డ్రామా ఆడుతున్నారు' అని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజారోగ్యాన్ని, విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని 10 మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో నడపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయిస్తే.. ప్రయివేటుపరం చేస్తున్నారని జగన్ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా పీపీపీ విధానానికి వ్యతిరేకంగా ఆ పార్టీ తరపున చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కనిపించకపోవడంతో, ఆ పార్టీ వారే కుడి, ఎడమ చేతులతో సంతకాలను కోడి గీతల మాదిరిగా పెట్టేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పీపీపీ విధానం అమలును సమర్థిస్తూ చేసిన వ్యాఖ్యలతో ఆమెను కలిసి వైసీపీ ఎంపీలు కంగుతిన్నారని తెలిపారు. దేశంలో 10 రాష్ట్రాల్లో పీపీపీ విధానం అమల్లో ఉందని, తాజాగా ఢిల్లీ ప్రభుత్వం కూడా 11 వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నడపాలని ప్రతిపాదించిందని మంత్రి గుర్తు చేశారు.

టూరిజం హబ్‌గా పోలవరం ప్రాజెక్టు: నిమ్మల

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): టూరిజం హబ్‌గా పోలవరం ప్రాజెక్టును తయారు చేయాలని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో పోలవరం పర్యాటక అభివృద్ధిపై జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమీక్షించారు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు ప్రధాన పనులు పూర్తికానున్న నేపథ్యంలో లేఔట్ ప్లాన్ డిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. స్పిల్‌వే బ్యూటిఫికేషన్‌కు సంబంధించి ప్రణాళికను తయారు చేయాలని సూచించారు. పోలవరం పరిసర ప్రాంతాల్లో తెలుగుదనం ఉట్టిపడేలా కళాకృతులు ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పోలవరం లెఫ్ట్ బ్యాంకును కలుపుతూ వంతెనల నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

25.04 లక్షల టన్నుల ధాన్యం సేకరణ: నాదెండ్ల

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'మునుపెన్నడూ లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే 25.04 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ధాన్యం సేకరణ లక్ష్యంలో మరో మైలురాయిని దాటాం' అని మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం తెలిపారు. 'ఈ ఖరీఫ్ సీజన్‌లో పీడీఎస్ అవసరాల కోసం 51 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం. కాగా, మంగళవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 3,96,854 మంది రైతుల నుంచి రూ.5,938.20 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశాం. అందులో ఇప్పటికే 3,79,538 మంది రైతుల ఖాతాల్లో రూ.5,682.77కోట్లు జమ చేశాం. ఇంకా రూ.255.43 కోట్లు జమ చేయాల్సి ఉంది' అని మంత్రి నాదెండ్ల తెలిపారు.

నేటి నుంచి రబీ పంటల నమోదు

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ సీజన్‌లోని అన్ని రకాల పంటలు, భూకమతాలకు సంబంధించి బుధవారం నుంచి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ, డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టనున్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ తెలిపారు. దీనిపై మంగళవారం జిల్లాల వ్యవసాయ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట నమోదుకు గరిష్ఠంగా 20మీటర్ల దూరం నుంచే చేయాలని స్పష్టం చేశారు. రైతు విశిష్ఠ సంఖ్య(యూనిక్ ఐడీ) నమోదు కాని వారికి వెంటనే నమోదు చేయించాలని ఆదేశించారు.

మావోయిస్టు నేత దామోదర్ అరెస్ట్?


» ఆయనతో పాటు మరో 15 మందిని కూడా అదుపులోకి తీసుకున్న ఆసిఫాబాద్ పోలీసులు

ఆసిఫాబాద్/చర్ల/ములుగు/కామారెడ్డి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌తోపాటు అతడి అనుచరులను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ) మండలంలోని పెద్దదోబ అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి 16 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ ఇంట్లో మావోయిస్టులు తలదాచుకున్నారన్న సమాచారం మేరకు ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఎదురు కాల్పులకు తావు లేకుండానే వారందరినీ అదుపులోకి తీసుకున్నాయి. పట్టుబడిన వారిలో తొమ్మిది మంది మహిళలు, ఏడుగురు పురుషులు ఉన్నారు. వీరందరూ ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని పోలీసులు చెబుతున్నా.. మాయిస్టు పార్టీ కీలక నేత బడే చొక్కారావు సైతం వారిలో ఉన్నట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న మావోయిస్టులను హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి తరలించినట్లు సమాచారం.

దామోదర్‌ది ములుగు జిల్లా...

బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌ది ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామం. మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఉండి 2008లో తాడ్వాయి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన బడే నాగేశ్వర్‌రావుకు సోదరుడైన దామోదర్.. చిన్న వయసులోనే మావోయిస్టు పార్టీ భావాజాలానికి ఆకర్షితులయ్యారు. కాగా, పోలీసులకు దామోదర్ చిక్కలేదని ఆయన స్వగ్రామంలో ప్రచారం జరుగుతోంది. దామోదర్ అరెస్టు విషయమై దామోదర్ తల్లి మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తన కొడుకును కొట్టవద్దని పోలీసులను వేడుకున్నారు. కాగా, పోలీసులు అరెస్టు చేసిన వారిలో కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఆరేపల్లికి చెందిన ఎర్రగోల్ల రవి అలియాస్ దినేష్ అలియాస్ సంతోష్ సైతం ఉన్నట్లు తెలిసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేందర్ యాదవ్ ఎదుట మంగళవారం 34మంది మావోయిస్టులు లొంగిపోయారు.

పోలీస్‌కు సెల్యూట్



(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యర్థులు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు 31 కేసులేశారు. అయినప్పటికీ రికార్డు సమయంలో పరీక్షలు నిర్వహించి 60 రోజుల్లో ఫలితాలు వెల్లడించి, ఎక్కడా రూపాయి లంచానికి తావు లేకుండా, సిఫారసులు లేకుండా 6,014 కానిస్టేబుల్ ఉద్యోగాలిచ్చాం. 3,343 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 2,414 ఏపీఎస్‌పీ, 993 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. ఆర్టీసీలో 33 శాతం కండక్టర్లు మహిళలే ఉండాలనుకున్నాను. అది జరిగింది. ఆర్టీసీలో డ్రైవర్లుగా కూడా మహిళలు ఉండాలని కోరుకున్నా. అది నెరవేరలేదు. డ్రైవర్లుగా కూడా వస్తారని ఆశిస్తున్నా. 183 మంది గిరిజన పిల్లలు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. 1999 - 2004లో 8,109 మందికి పోలీసు ఉద్యోగాలిచ్చా. 2014-19లో 9,464 మందికి, ఇప్పుడు 6,014 మందికి ఉద్యోగాలిచ్చాం. ఇలా మొత్తం 23,676 ఉద్యోగాలిచ్చాం. రాష్ట్రంలో 55,000 మంది కానిస్టేబుళ్లు ఉంటే, 24వేల మందికి నేనే ఉద్యోగాలిచ్చాను."అని చంద్రబాబు తెలిపారు. హోం మంత్రి అనిత, డీజీపీగా హరీశ్ కుమార్ గుప్తా రాష్ట్రంలో సమర్థవంతమైన పోలీసు వ్యవస్థకు శ్రీకారం చుట్టారని అభినందించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

20 లక్షల ఉద్యోగాలు కచ్చితంగా ఇస్తాం

"కూటమి మ్యానిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నాం. మెగా డీఎస్సీ ద్వారా 15,591 మందికి ఉద్యోగాలిచ్చాం. అన్ని శాఖల్లో 4,51,347 మందికి ఇప్పటికే ఇచ్చాం. ఇవి కాకుండా 197 పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలు...రూ.8,55,170 కోట్ల పెట్టుబడులు... ఇవన్నీ పూర్తయితే కొత్తగా 8,23,922 మందికి ఉద్యోగాలొస్తాయి. విశాఖ భాగస్వామ్య సదస్సులో 538 ఎంవోయూలు చేశాం. 11 లక్షల 38,000 కోట్ల పెట్టుబడులు తెస్తున్నాం. వాటి ద్వారా 11 లక్షల 37,000 మందికి ఉద్యోగాలొస్తాయి. 735 పరిశ్రమలు వస్తాయి."

గంజాయిని నియంత్రిస్తున్నాం

"రాష్ట్రంలో గంజాయి బ్యాచ్ వల్ల చెడ్డ పేరొస్తోంది. పిల్లల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారు. ఏజెన్సీలో గంజాయి లేకుండా నివారిస్తున్నాం. ఎవరైనా రౌడీయిజం చేసేవారికి ఈ రాష్ట్రంలో ఉండే అర్హత లేదు. ఒకప్పుడు రౌడీలను రాష్ట్రం నుంచి బయటకు పంపేశాం. ఇప్పటికీ అదే నా పంథా. నేర స్వభావం ఉన్న వ్యక్తులపై కన్నేయాలి. నేరాలు జరిగిన వెంటనే వేగంగా స్పందించాలి. పాస్టర్ ప్రవీణ్ మృతిని ప్రభుత్వానికి అంటగట్టాలని కొన్ని దుష్టశక్తులు ప్రయత్నించాయి. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఆయన తాగి తూలుతూ, పడుతూ లేస్తూ రాజమండ్రి కళ్లెముందు ప్రమాదవశాత్తూ చనిపోయారని పోలీసులు గుర్తించారు. గతంలో రాజకీయాల్లో నేరస్థులు ఉండేవారు కాదు. నేరస్థులకు మద్దతిచ్చేవారు కూడా కాదు. ఇప్పుడు రాజకీయ నేరస్థులకు అండదండలు దొరుకుతున్నాయి. ఎప్పుడూ లేని విధంగా గత ఐదేళ్లలో లేడీ డాన్లు కూడా తయారయ్యారు. మహిళల్లో రౌడీలు ఉంటారని ఊహించలేదు. వారు ఏకంగా చంపేస్తున్నారు. పెద్దపెద్ద నాయకులను వాడుకుంటున్నారు. నేరాలు అరికట్టడానికి పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. ఎంటెక్ చేసి కానిస్టేబుల్‌తో సరిపెట్టుకోవాలని అనుకోవద్దు. కష్టపడండి.ప్రతిభకు సాన బెట్టుకోండి."

నా ఓటమికి ఇది కూడా కారణమే..

"రాజకీయ ముసుగులో నేరాలు చేసే రాజకీయ రౌడీలు తయారయ్యాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య వంటి ఘటనలు నాలాంటి వ్యక్తులకు కొన్ని గుణపాఠాలు నేర్పించాయి. పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని ఆ అనుభవంతో గ్రహించాను. 2019 ఎన్నికల సమయంలో వివేకా హత్య జరిగింది. ముందు గుండెపోటు అంటే... నేను నమ్మాను. కానీ ఆయనది హత్య. ఒక సీఐ దగ్గరుండి ఆయన గదిలోని రక్తం కడిగించారు. ముఖ్యమంత్రిపైనే ఆ నేరాన్ని నెట్టేశారు. నా చేతిలో కత్తి పెట్టి 'నారాసుర రక్తచరిత్ర' అని రాశారు. అప్పుడే విషయం పసిగట్టి నిందితుల్ని పట్టుకుని ఉంటే నేను ఓడిపోయేవాడిని కాదు. ఇప్పుడు నన్ను ఇక ఎవరూ మభ్యపెట్టలేరు."



కానిస్టేబుల్ అభ్యర్థికి నియామక పత్రం అందిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన డిప్యూటీ సీఎం పవన్

పోలీసులను బెదిరిస్తే ఊరుకోం

» ఎవరు రెచ్చిపోయినా ఉపేక్షించం
» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరిక
» శాంతిభద్రతల విషయంలో రాజీ లేదు
» కానిస్టేబుల్ కేవలం పోస్టు కాదు..బాధ్యత
» నైతిక విలువలు,సేవాభావం ముఖ్యం: పవన్

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): "కానిస్టేబుళ్లు పోలీసు శాఖకు మూల స్తంభా లు.. పోలీసు శాఖలో నైతిక విలువలతోపాటు ప్రజల పట్ల సేవాభావంతో మెలగండి" అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. కొత్తగా కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ సందర్భంగా మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్స్ ప్రాంగణంలో నియామక పత్రాల జారీ పండగలా జరిగింది. ఏపీ పోలీసు శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఏ రాష్ట్రంలో అయినా శాంతి భద్రతలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని, ఖాకీ బలంగా ఉంటేనే రాష్ట్రం ముందుకు వెళుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. "నాలుగు లక్షల దరఖాస్తుల్లో నుంచి కేవలం 6100మంది ఎంపికై అందులో 5,757 మంది ఇవాళ ఖాకీ ధరిస్తున్నారు. అయితే, ఈ గణాంకాల వెనుక ఎన్నో కుటుంబాల కన్నీళ్లు, ఆశలు కోల్పోయిన మూడేళ్ల విలువైన కాలం దాగి ఉన్నాయి. ఆ కాలాన్ని తిరిగి మీకు ఇవ్వలేం. కానీ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. 2022లో నోటిఫికేషన్ ఇచ్చి న్యాయ పరమైన చిక్కులు పట్టించుకోని గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది.' అని పవన్ కల్యాణ్ అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో పదివేల మందికి పదోన్నతులు ఇచ్చామని, అవినీతి రహిత పాలన అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. ఈ పండగ వాతావరణానికి కారణమైన మంత్రి లోకేశ్ రాలేక పోవడం వెలితిగా ఉందని తెలిపారు. కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థుల తల్లితండ్రుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని, వారిలో తన తల్లితండ్రుల్ని చూసుకున్నానన్నారు. "మాజీ సీఎం (జగన్) పోలీసు అధికారులను బెదిరిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ఏదేదో చేస్తామంటూ ఆయన మాట్లాడుతున్నారు.. పోలీసులను బెదిరిస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. చంద్రబాబు నేతృత్వంలో గట్టిగా బదులిస్తాం. పోలీసు అధికారే కాదు, కానిస్టేబుల్ గౌరవానికి భంగం కలిగించినా ఉపేక్షించబోం." అని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. రాష్ట్ర సుస్థిరత, యువత భవిష్యత్తు కోసం కూటమిగా ఏర్పాటై మాటిచ్చామని, ఆ ప్రకారమే నడుస్తున్నామన్నారు. "ఉత్తరప్రదేశ్ లాంటి చోట పెట్టుబడులు, ప్రగతికి ప్రధాన కారణం అక్కడ శాంతి భద్రతలు అదుపులో ఉండటమే. ఈ విషయం ఇటీవల కలిసినప్పుడు యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఏపీలో కూడా ఎవరు రెచ్చిపోయినా ఉపేక్షించే ప్రసక్తే లేదు." అని స్పష్టం చేశారు. తాను కూడా ఒక కానిస్టేబుల్ కుమారుడినేనని ఆయన గుర్తు చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గంజాయి, బెట్టింగ్స్ యథేచ్ఛగా సాగాయని, ఉగ్రమూలాలు కూడా కనిపించాయన్నారు. ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధపడాలని యువ కానిస్టేబుళ్లకు పవన్ కల్యాణ్ దిశా నిర్దేశం చేశారు.

"నూతన కానిస్టేబుళ్లకు ఇది ఉద్యోగ ప్రారంభ సందర్భం మాత్రమే కాదు.. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుగా వారు మారే బాధ్యత. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు. నాలుగేళ్ల నిరీక్షణకు ముగింపు. పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధించాలన్న రాజకీయ పరిపాలనా సంకల్పానికి ప్రతీక."
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ప్రజాభద్రతే ప్రగతికి పునాది

ప్రజా భద్రతే ప్రగతికి పునాది అనే స్పష్టమైన దృక్పథంతో చంద్రబాబు ప్రభుత్వం ముందుకు వెళుతోందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఇన్విజబుల్ పోలీసింగ్‌తో రాష్ట్రంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం చేస్తామన్నారు. ఏపీలో తొలిసారి పోలీసు అకాడమీ ఏర్పాటు చేసిన ఘనత టీడీపీదేనని గుర్తు చేశారు. ఆరువేల ఉద్యోగాలకు ఐదు లక్షల దరఖాస్తు రావడం యువతలో పోలీసు ఉద్యోగం పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం అన్నారు. నేరం జరగక ముందే అడ్డుకోవడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం టెక్నాలజీని విస్తృతంగా వినియోగిస్తూ, వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు. సీసీ టీవీలు, డ్రోన్లు, ఆధునిక ఫోరెన్సిక్‌ను వినియోగంలోకి తీసుకొచ్చామని వివరించారు. ఎంపికైన కానిస్టేబుళ్లలో ఉత్తరాంధ్రులే అధికంగా ఉన్నారని సరదాగా అనిత వ్యాఖ్యానించారు. శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు భద్రతను బలోపేతం చేసినట్లు తెలిపారు. పోలీస్ చొక్కా ప్రజలకు భరోసా కావాలని హోంమంత్రి సూచించారు.



కొత్త కానిస్టేబుళ్లతో కరచాలనం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. చిత్రంలో హోం మంత్రి అనిత

సీఎం, డిప్యూటీ సీఎంతో యూఎస్ కాన్సుల్ జనరల్ భేటీ



అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌ను సత్కరిస్తున్న సీఎం

సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు కీలక అంశాలపై చర్చించారు. యూఎస్ ఎంబసీకి చెందిన మెరెడిత్ మెట్లర్, యూఎస్ పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ అబ్దుల్ రెహ్మాన్ హబీబ్, పొలిటికల్ స్పెషలిస్ట్ శ్రీమాలికారి, ఎకనమిక్ స్పెషలిస్ట్ శిబా త్రిపాఠి పాల్గొన్నారు



పవన్‌తో భేటీ అయిన లారా



తన ఊరికి రోడ్డు కావాలని కోరుతూ విజ్ఞప్తి చేస్తున్న లాకే బాబూరావు(ఫైల్)



కానిస్టేబుల్ అభ్యర్థి బాబూరావును అభినందిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

వేదికపై రోడ్డు కోసం విన్నపం

సభ ముగిసేలోగా మంజూరు

కానిస్టేబుల్ నియామక పత్రాల ప్రదాన కార్యక్రమ వేదికపై కానిస్టేబుల్‌గా నియమితుడైన గిరిజన యువకుడు లాకే బాబూరావు తమ గ్రామానికి రోడ్డు వేయించాలని కోరారు. ఈ బాధ్యతను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సీఎం అప్పగించగా.. ఆయన సభ ముగిసేలోగా ఆ గ్రామానికి రోడ్డు మంజూరు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, జీకే వీధి మండలం, దేవరపల్లి పంచాయతీ పరిధిలోని తిమ్మలబండ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి అవసరమైన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఆగమేఘాలపై కదిలిన యంత్రాంగం ఎలుగురాతిబండ నుంచి తిమ్మలబండ వరకు 2 కిలోమీటర్ల మేర రూ.3.9 కోట్లు బీటీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేశారు. వెంటనే ఉపముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా అల్లూరి జిల్లా కలెక్టర్ రోడ్డు నిర్మాణానికి పరిపాలన అనుమతులిచ్చారు. "కానిస్టేబుల్ పోస్టు దక్కిన బాబురావు ఒక కోరిక కోరారు. తన ఊరు ఎలుగురాతిబండ - తిమ్మలబండ మధ్య రోడ్డు కావాలని అడిగారు. వెంటనే పవన్‌కల్యాణ్ స్పందించారు. 3.9కోట్లు మంజూరు చేశారు. త్వరలో పనులు ప్రారంభమ వుతాయి. ఇది పవన్, కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం." అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

కష్టానికి ఓర్చి.. కలను సాధించి..

» కొత్త కానిస్టేబుళ్ల కన్నీటి గాథల ఆవిష్కరణ
» సీఎం సమక్షంలో పంచుకున్న ట్రైనీలు
» పేద బిడ్డలను అభినందించిన చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నడవడానికి రోడ్డు కూడా లేని మారుమూల గిరిజన గూడెం యువకుడు.. వ్యవసాయ కూలీ కుమారుడు.. ఆడబిడ్డలకు చదువొద్దన్న గ్రామస్థులకు ఎదురెళ్లిన దళిత ఆడబిడ్డ.. మతాచారాల పేరుతో కలలను చిదిమేసి పెళ్లి చేసిన పెద్దల తప్పు ఎత్తి చూపిన వివాహిత....ఇలా పేదరికంలో పుట్టి, ఆర్థిక ఇబ్బందులు అధిగమించి, కష్టాలకు ఓర్చి, కన్నీళ్లు బిగపట్టి పోలీసు ఉద్యోగం సాధించిన వీరి గాథలు ఐదు కోట్ల మంది ఆంధ్రుల్లో ఆలోచనలు పుట్టించేలా ఉన్నాయి. మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్స్ ప్రాంగణంలో జరిగిన పోలీసు నియామక ఉత్తర్వుల స్వీకరణ సందర్భంగా లకే బాబూరావు, మణికంఠ, అఖిల్ గోపి, శిరీష, హఫీజాన్ జీవితంలోని అనుభవాలు సభికులను కన్నీరు పెట్టించాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కళ్లు సైతం చెమ్మగిల్లాయి. ఆ వ్యాఖ్యలు వారి మాటల్లోనే...

అమ్మానాన్నల రుణం తీర్చుకుంటా..

"మా నాన్న లారీ డ్రైవర్. అమ్మ వ్యవసాయ కూలీ. పేదరికంలోనే పుట్టి పెరిగాను. కష్టపడి బీఎస్సీ వరకూ చదివాను. నా తల్లి తండ్రులు పడిన కష్టానికి విలువ ఉండాలని పోలీసు ఉద్యోగం సాధించాను. మీరు (సీఎంను ఉద్దేశించి) ఇచ్చిన ఈ ఉద్యోగం చేస్తూ మా అమ్మ, నాన్నల రుణం తీర్చుకుంటా. వారిని బాగా చూసుకుంటా."

- మణికంఠ, పశ్చిమ గోదావరి జిల్లా

ఏడేళ్లు కష్టపడ్డా..

"నా తల్లితండ్రులు చదువుకోలేదు. నాన్న కార్పెంటర్. అమ్మ టైలర్. వారు కష్టపడి నన్ను బీఎస్సీ కంప్యూటర్స్ వరకు చదివించారు. యూనిఫాం సర్వీస్ పట్ల ఇష్టంతో ఇప్పటికి ఎన్నోసార్లు ప్రయత్నించా. ఏడేళ్ల తర్వాత ఎట్టకేలకు పోలీసు కానిస్టేబుల్ తెచ్చుకున్నాను."

- కాసింశెట్టి అఖిల్ గోపి , గుంటూరు సిటీ

సీఎం : చదువుకున్నవాళ్లు వస్తే పోలీస్ శాఖ విలువలు పెంచుతారు. ఉద్యోగాలు తెచ్చుకున్న మీ ఆనందం చూస్తే మాకు తృప్తిగా ఉంది.

ఉద్యోగం సాధించాలని.....

"మా ముస్లిం సమాజంలో ఆడబిడ్డలకు కట్టుబాట్లు ఎక్కువ. బయటికెళ్లి ఉద్యోగాలు చెయ్యనివ్వరు. మాకూ కొన్ని కలలు ఉంటాయి. వాటిని చిదిమేయ్యొద్దు. నాకు 2017లో పెళ్లయింది. బాబు ఉన్నాడు. ప్రభుత్వ ఉద్యోగం కొట్టాలని నేను పోలీసు జాబ్‌కు దరఖాస్తు చేశాను. తినటానికి సరిపోక అన్న క్యాంటీన్‌లో భోజనం చేసేవాళ్లం. నా భర్తకు అనారోగ్యం. కరోనాతో తల్లి మరణించింది. అప్పటి నుంచి మా కుటుంబాన్ని కూడా నేనే చూసుకుంటున్నాను. యువత పోటీ పరీక్షలు రాయాలి. వయస్సు అయిపోతే తిరిగి రాదు."

- షేక్ హఫీజాన్, మైదుకూరు, కడప జిల్లా

సీఎం : హఫిజాన్.. ఇదే తపన కొనసాగించు. మీరు మట్టిలో మాణిక్యాలు.

స్థానికులకు 95%

(మొదటిపేజీ తరువాయి)

మల్టీజోనల్ పోస్టులుగా మార్చారు. రాష్ట్ర స్థాయి పోస్టులకు పోటీ అధికం కావడంతో వీటిని మల్టీజోనల్ పోస్టులుగా చేశారు. దీని వల్ల స్థానికులకు అవకాశాలు మెరుగుపడతాయి. గతంలో సీటీవోలు, డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీలు రాష్ట్రమంతా ఏ జిల్లాకైనా బదిలీపై వెళ్లేవారు. ఇప్పుడలా కుదరదు. ఒక మల్టీజోన్ నుంచి ఇంకో మల్టీజోన్‌కి స్పౌస్ గ్రౌండ్స్‌లో బదిలీ కోరుకుంటే సీనియారిటీ కోల్పోతారు.

మరిన్ని మార్పులు ఇలా..

- గతంలో జిల్లా పోస్టులకు స్థానిక, ఓపెన్ కోటా నిష్పత్తి 85:15, జోనల్ పోస్టులకు 70:30, మల్టీ జోనల్ 60:40గా ఉండేది. ఇప్పుడు ఆ మూడు రకాల పోస్టులకు లోకల్, ఓపెన్ కోటాను 95:5గా చేశారు.
- గతంలో 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎక్కడ చదివితే ఆ ప్రాంతంలో స్థానికులుగా నిర్ణయించేవారు. ఇప్పుడు ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు ఎక్కువ కాలం ఎక్కడ చదివితే ఆ ప్రాంతానికే స్థానికులుగా ఉంటారు.
- ఉద్యోగుల విభజనకు సంబంధించి ఉద్యోగులకే చాయిస్ ఇస్తారు. వయసు, సీనియారిటీ, మిగులు సర్వీసు కాలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.
- ఈ ఆర్డర్ జారీ అయినప్పటి నుంచి 27 నెలల్లోగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా, జోనల్, మల్టీ జోనల్ పోస్టులను నిర్ణయించాలి.
- జూనియర్ అసిస్టెంట్ అంతకంటే దిగువ పోస్టులకు జిల్లా యూనిట్‌గా రిక్రూట్‌మెంట్, బదిలీలు జరుగుతాయి. జూనియర్ అసిస్టెంట్ కంటే పై క్యాడర్ నుంచి ఫస్ట్ లెవల్ గెజిటెడ్ అధికారి వరకు జోన్ యూనిట్‌గా భర్తీ, బదిలీలు ఉంటాయి. ఆపై పోస్టులకు మల్టీజోన్ ప్రాతిపదికన జరుగుతాయి.
- సచివాలయం, హెచ్‌వోడీ, ఇతర రాష్ట్ర స్థాయి కార్యాలయాల నుంచి ఉద్యోగులు లోకల్, జోనల్, మల్టీజోనల్ క్యాడర్లలో డిప్యుటేషన్‌పై వెళ్లి పనిచేయొచ్చు.
- కృష్ణా నదికి ఎగువన ఉన్న జిల్లాలను మల్టీజోన్-1లో, దిగువన ఉన్న జిల్లాలను మల్టీజోన్-2గా విభజించారు.
- గతంలో రాష్ట్ర క్యాడర్ నుంచి రాష్ట్ర క్యాడర్‌కు బదిలీలపై వెళ్లి పనిచేసేవారు. కానీ రాష్ట్ర క్యాడర్ నుంచి జోనల్, లోకల్ క్యాడర్‌కు వెళ్లడానికి అభ్యంతరం ఉంది. ఈ అభ్యంతరాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది కూడా. ఈ నేపథ్యంలో తెలంగాణ తరహాలో ఏపీ ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో కూడా రాష్ట్ర క్యాడర్ నుంచి లోకల్, జోన్ క్యాడర్‌కు బదిలీపై వెళ్లేందుకు వెసులుబాటు కల్పించారు.
- ప్రత్యక్ష నియామకాల్లో స్థానికత, క్యాడర్, జోనల్, మల్టీజోనల్‌పై స్పష్టత ఇచ్చారు. 26 జిల్లాలను 6 జోన్లుగా నిర్ణయించారు. వాటిని రెండు మల్టీజోన్లుగా ప్రకటించారు. ఏడేళ్లు ఒకేచోట చదివిన ప్రాంతాన్ని స్థానికతగా పరిగణించాలని పేర్కొన్నారు.
- మల్టీజోన్-1లో జోన్-1, 2, 3... మల్టీజోన్-2లో జోన్-4, 5, 6 ఉన్నాయి.
- జోన్-1: శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలు.
- జోన్-2: అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ.
- జోన్-3: పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా
- జోన్-4: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం
- జోన్-5: తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప
- జోన్-6: కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి
- రాష్ట్రప్రభుత్వం సముచితమని భావిస్తే పక్కపక్కనే ఉన్న జిల్లాల్లో లేదా జోన్లలో ఏదైనా విభాగం లేదా సంస్థలో వివిధ రకాల పోస్టులను ఒకే క్యాడర్‌గా చూపించవచ్చు. ఏదైనా విభాగానికి ప్రత్యేక క్యాడర్‌ను కొనసాగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. ఏదైనా విభాగంలో నాన్ గెజిటెడ్ పోస్టులకు సంబంధించి ఆచరణ సాధ్యం కాదని లేదా నిరుపయోగమని ప్రభుత్వం భావిస్తే నోటిఫికేషన్ ద్వారా ఆ ప్రకటన చేయొచ్చు.
- వివిధ విభాగాలు, వివిధ పోస్టులకు సంబంధించి స్థానిక క్యాడర్లకు ఉద్యోగుల విభజనపై సలహాల కోసం కమిటీలు ఏర్పాటు చేసుకోవచ్చు.
- విభజనపై అభ్యంతరాలున్న ఉద్యోగులు 60 రోజుల్లోగా వినతిపత్రం ద్వారా వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. అప్పుడు ప్రభుత్వం సంబంధిత వ్యవహారాలు చూసే కమిటీని సంప్రదించి నిర్ణయం తీసుకుంటుంది. ఆ నిర్ణయం మరో ఉద్యోగి అవకాశాన్ని దెబ్బతీసేలా ఉండకూడదు.
- వీటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 డీ(3)కు లోబడి ఉండాలి.
- ఒక జిల్లా/జోన్/మల్టీజోన్ క్యాడర్ నుంచి ఇంకో జిల్లా/జోన్/మల్టీజోన్‌లోకి స్పౌస్ గ్రౌండ్‌లో బదిలీ కోరుకుంటే సీనియారిటీ కోల్పోతారు.
- స్థానిక రిజర్వేషన్లు, రాష్ట్ర స్థాయి పోస్టులు, రాష్ట్రస్థాయి కార్యాలయాలకు సంబంధించి ఇంకా 3 గెజిట్ నోటిఫికేషన్లు రావలసి ఉంది.

వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు తీర్పుపై అప్పీలు?

- తెలంగాణ హైకోర్టును ఆశ్రయించే యోచనలో సునీతారెడ్డి
- దర్యాప్తును ఒకే అంశానికే పరిమితం చేయడంపై అభ్యంతరం



హైదరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తుపై సీబీఐ కోర్టు ఈ నెల 10న ఇచ్చిన తీర్పు అధికారిక కాపీ మంగళవారం వెలువడింది. ఈ కేసులో నిందితులు సునీల్ యాదవ్, అతని సోదరుడు కిరణ్‌యాదవ్‌తో వైఎస్ ప్రకాశ్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, సందేశాల ఆధారంగా మాత్రమే దర్యాప్తు పూర్తిచేసి నెల రోజుల్లో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేయాలని సీబీఐని నాంపల్లి కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఈ తీర్పుపై తెలంగాణ హైకోర్టులో అప్పీలుకు వెళ్లాలని వివేకా కుమార్తె సునీతారెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. తన తీర్పు ద్వారా వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని సీబీఐ కోర్టు ఒక అభిప్రాయానికి వచ్చిందని, అయితే ఫలానా అంశంపై మాత్రమే దర్యాప్తు చేయాలని ఆదేశించడం ఎంతవరకు సబబు అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. విచారణ చేయాలా? వద్దా? అని మాత్రమే కోర్టు నిర్దేశించాలి తప్ప.. ఎలా చేయాలి? ఎంతవరకు చేయాలనేది దర్యాప్తు ఏజెన్సీకి నిర్దేశించకూడదని అభిప్రాయపడుతున్నారు. గతంలోనూ ఇదే కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని విచారించడానికి ప్రశ్నలు లిఖితపూర్వకంగా ఇవ్వాలని సీబీఐని హైకోర్టు ఆదేశించడంపై సుప్రీంకోర్టు మండిపడిన విషయం తెలిసిందే. విచారణ ఎలా చేయాలో దర్యాప్తు ఏజెన్సీకి నిర్దేశించకూడదని అప్పటి సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తన తీర్పులో స్పష్టం చేశారు. మరోవైపు ఈ కేసులో దర్యాప్తు చేయాల్సిన అంశాలు అనేకం ఉన్నాయని సునీతారెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అప్రూవర్‌గా మారిన దస్తగిరిని కడప జైల్లో చైతన్యరెడ్డి బెదిరించడం, సునీతారెడ్డి, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్‌పై కౌంటర్ కేసు అల్లడానికి తీవ్ర ప్రయత్నాలు చేయడం, మాజీ సీఎస్ అజేయ కల్లం స్టేట్‌మెంట్ ప్రకారం ఉదయం 5.30 గంటలకే వైఎస్ జగన్, వైఎస్ భారతికి హత్య విషయం ఎలా తెలిసింది? నేరంతో ఇమిడి ఉన్న డబ్బు సంగతి.. ఇలా చాలా అంశాలపై దర్యాప్తు జరగాలని ఆమె ప్రస్తావించారు. తదుపరి దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయానికి వచ్చాక.. అన్ని అంశాలపై కాకుండా ఒకే అంశానికి పరిమితం కావాలని సీబీఐని కట్టడి చేసే అధికారం సీబీఐ ప్రత్యేక కోర్టుకు ఉందా అని సునీతారెడ్డి అప్పీలులో ప్రశ్నించే అవకాశం ఉంది. కాగా, తీర్పు కాపీ బయటకు వచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై తన న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా (సీనియర్), ఎస్ గౌతమ్, ఐశ్వర్య, లిఖిత్‌రెడ్డి తదితరులతో ఆమె చర్చిస్తున్నట్లు సమాచారం.

'సంజీవని'లో

డిజిటల్ హెల్త్ రికార్డులు



వైద్య ఆరోగ్య శాఖ నిపుణులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- ఏడాదిలోగా సిద్ధం చేస్తాం: ముఖ్యమంత్రి
- ప్రజారోగ్య పరిరక్షణకు మెరుగైన విధానాలు
- అంతర్జాతీయ నిపుణులు సలహాలివ్వాలి
- సమీక్షలో చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఏడాదిలోగా డిజిటల్ హెల్త్ రికార్డులను సిద్ధం చేస్తామన్నారు ప్రజారోగ్య పరిరక్షణకు మెరుగైన విధానాలతో సేవలు అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆరోగ్యశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ఆరోగ్య రంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంజీవని సహా వివిధ ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవడంతో పాటు నిపుణుల సలహాలను తీసుకోవాలని సూచించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశామని, రియల్ టైమ్‌లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ప్రాజెక్టు పని చేస్తుందని చెప్పారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా దీనిని అమలు చేస్తామన్నారు. 'ఆరోగ్య సమస్యల పరిష్కారానికి యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాలి. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున పెరగాలి. మెడ్‌టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలను రూపొందిస్తున్నాం. వ్యాధులను నివారించే విధానాలపై దృష్టి పెడితే ప్రజల వైద్య ఖర్చులు చాలా వరకూ తగ్గుతాయి. వారి ఆరోగ్యం కూడా బాగుంటుంది. వైద్యారోగ్య రంగంలో మరింత వినూత్నంగా ప్రాజెక్టులు చేపట్టేందుకు అత్యున్నత స్థాయి నిపుణుల బృందం సలహాలివ్వాలని కోరుతున్నాం. ముంబైలో త్వరలో గ్లోబల్ ఏఐ కన్వెన్షన్ జరగనుంది. ఇందులో వైద్యారోగ్యంలో టెక్నాలజీ వినియోగంపై ప్రభుత్వం రూపొందిస్తున్న విధానాలను ప్రదర్శించాలని ఆలోచన చేస్తున్నాం. దీనికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని నిపుణులను కోరుతున్నా' అని చెప్పారు.

వర్చువల్‌గా నిపుణుల బృందం హాజరు: రాష్ట్రంలో మెరుగైన ప్రజారోగ్య నిర్వహణకు గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ వైద్య నిపుణులతో కూడిన 10 మంది సభ్యుల బృందాన్ని నియమించిన సంగతి తెలిసిందే. యూఎన్ఎయిడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీటర్ పాయిట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్, ఏఐజీ ఛైర్మన్ డి.నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టియో, రిటైర్డ్ ఐఏఎస్ ఆర్తి అహూజా, సైటెస్ ఛైర్‌పర్సన్ రిజ్వాన్ కొయిటా, కోస్లా ల్యాబ్స్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ నాదముని, గేట్స్ ఫౌండేషన్ జినోమిక్స్ అండ్ ఎపిడమాలజీ డైరెక్టర్ గగన్‌దీప్ కాంగ్, పబ్లిక్‌హెల్త్ నిపుణురాలు మార్గరెట్ ఎలిజిబెత్, ఢిల్లీ ఎయిమ్స్ ఎండోక్రైనాలజీ విభాగాధిపతి నిఖిల్ టాండన్ వీరిలో ఉన్నారు. వీరు వర్చువల్‌గా సీఎం సమీక్షకు హాజరయ్యారు. ఆరోగ్య రంగంలో నర్సులు, వైద్యులు అందుబాటులో ఉండడం, పౌష్టికాహారం ముఖ్యమని సౌమ్య సూచించారు.

మరిన్ని విషయాలు

- ఏపీ సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ కేర్ కేంద్రంగా తయారవుతోందని, వైద్య విద్యార్థులు, నర్సులవంటి వారికి డిజిటల్ హెల్త్ కేర్‌లో శిక్షణ అందించాలని రిజ్వాన్ సూచించారు.
- అన్ని వ్యాధులకు ఒకే రకమైన విధానాలను అనుసరించలేమని, క్లినికల్ మేనేజ్‌మెంట్ అసెస్‌మెంట్ ద్వారా వేర్వేరు రకాలుగా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టాలని నిఖిల్ టాండన్ అన్నారు.
- హెల్త్ ఎడ్యుకేషన్ నుంచే హెల్త్ కేర్ సాధ్యమవుతుందని నాగేశ్వరరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజారోగ్య పర్యవేక్షణకు హెల్త్ సెక్రటేరియట్ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందిస్తామని గేట్స్ ఫౌండేషన్ ఇండియా డైరెక్టర్ అర్చనా వ్యాస్ అన్నారు.
- నిపుణుల సలహాలను మరింత లోతుగా చర్చించి వాటిని అమలు చేస్తామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. చంద్రబాబు నిరంతరం ప్రజారోగ్యం రంగాన్ని ఎలా పటిష్ఠపరచాలన్న అంశంపైనే ఆలోచన చేస్తారని చెప్పారు.
- ఇకపై ఏడాదిలో రెండుసార్లు నిపుణుల బృందంతో భేటీ అవ్వాలని సీఎం సూచించారు. వారి సలహాలు, సూచనలను క్రోడీకరించి కార్యాచరణ ప్రణాళిక తయారు చేసే బాధ్యతను అర్చనా వ్యాస్‌కు అప్పగించారు.

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

- మరింత మెరుగైన పాలన లక్ష్యంగా నిర్వహణ
- ఉత్తమ విధానాలు, సక్సెస్ స్టోరీల ప్రదర్శన
- జిల్లాల పనితీరుపై చర్చ.. ర్యాంకులు

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మరింత మెరుగైన పరిపాలన అందించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఐదోసారి కలెక్టర్ల సదస్సు నిర్వహణకు సన్నద్ధమైంది. బుధ, గురువారాల్లో సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈ సదస్సు జరగనుంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, కలెక్టర్ల పనితీరు మదింపు, జిల్లాలు, పథకాల వారీగా ప్రజల అభిప్రాయాలను వెల్లడించడం ప్రధాన అజెండాగా సదస్సు నిర్వహిస్తారు. బుధవారం ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభోపన్యాసం చేస్తారు. రెండు రోజుల సదస్సులో భాగంగా ఉత్తమ విధానాలు, సవాళ్లు అధిగమించడంపై ప్రశ్నలు, సమాధానాలతో తొలి సెషన్ ప్రారంభ అవుతుంది. తర్వాత సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాల్లో శాఖల వారీగా జీఎస్‌డీపీపై చర్చిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరం, 2025-26లో అర్ధసంవత్సరం జీఎస్‌డీపీపై ఆయా శాఖ కార్యదర్శులు ప్రజెంటేషన్ ఇస్తారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో రేటింగ్ వెల్లడిస్తారు. పథకాల అమలుతీరుపై ప్రజల అభిప్రాయాలను సదస్సులో వెల్లడిస్తారు. జిల్లాల్లో ఎన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని పరిష్కరించారు, ఆర్థిక- ఆర్థికేతర ఫైళ్లు ఎన్ని, ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో ఆర్థిక అంశాలు ఎన్ని ఉన్నాయి అనే వివరాలపై ప్రజెంటేషన్ ఇస్తారు. జిల్లాలకు వచ్చిన పెట్టుబడులు, ప్రాజెక్టులు.. వాటి పనులు ప్రారంభంపై మౌలిక సదుపాయాల శాఖ అధికారులు ప్రజెంటేషన్ ఇస్తారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనారిటీ సంక్షేమం, పేదరిక నిర్మూలన(పీ4), నైపుణ్యం- ఉపాధి కల్పన, సాగునీటి భద్రత, వ్యవసాయం, స్వర్ణాంధ్రపై సమీక్షలు జరుగుతాయి. తర్వాత మొత్తంగా జిల్లాల పనితీరుపై చర్చించి ర్యాంకులు ప్రకటిస్తారు. రెండో రోజు చివరి సెషన్‌లో శాంతి భద్రతలపై చర్చ జరుగుతుంది.

ఆక్వా రంగానికి 1200 కోట్ల విద్యుత్ రాయితీలు

- 17 నుంచి సర్వే నంబర్ల ఆధారంగా ఆక్వా రిజిస్ట్రేషన్లు
- అప్సడా ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి అచ్చెన్న
- అప్సడ కో చైర్మన్‌గా ఆనం రమణారెడ్డి, సభ్యుల ప్రమాణస్వీకారం

పెనమలూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఆక్వా రంగానికి రూ.1,200 కోట్ల విలువైన విద్యుత్ రాయితీలు ఇస్తున్నాం. సర్వే నంబర్ల ఆధారంగా ఆక్వా కల్చర్ రిజిస్ట్రేషన్లు ఈనెల 17 నుంచి చేసేందుకు చర్యలు తీసుకున్నాం' అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం ఉదయం నియోజకవర్గ కేంద్రం పెనమలూరులోని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివృద్ధి ప్రాధికార సంస్థ(అప్సడ) పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. దానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'దేశంలోని ఆక్వా ఉత్పత్తుల్లో మన రాష్ట్ర వాటా 29 శాతం ఉంది. అప్సడా ఛైర్మన్, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు మాట్లాడినా ఆక్వా రంగంలో నాణ్యత, ట్రేసబిలిటీ ముఖ్యమని అంటారు. అందుకు అనుగుణంగానే రైతులు తమ విధానాలను మార్చాల్సి ఉంది. దానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. రైతులు తమ పూర్వపు స్థాయిని చేరేలా సీఎం చంద్రబాబు తీసుకొన్న చొరవ అభినందనీయం. కోడిగుడ్లకు ఎలా మార్కెటింగ్ చేశారో అదే విధంగా ఆక్వా రంగానికి ఒక సంస్థను తయారు చేసే పనిలో ఉన్నాం. ఆక్వారంగానికి జలవనరులు, విద్యుత్ వంటి శాఖలతో అవినాభావ సంబంధాలుంటాయి. సదరు శాఖలతో ముడిపడి ఉన్న విషయాలను పరిష్కరించేందుకు ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం. ఏ రైతు ఎన్ని ఎకరాలు ఆక్వా సాగు చేస్తున్నాడో తెలుసుకొనేందుకు జియో ట్యాగింగ్ కూడా చేస్తున్నాం. ఆక్వా కల్చర్‌లో కృత్రిమ మేధ వినియోగానికి చర్యలు తీసుకుంటున్నాం. ఉభయగోదావరి, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో అధికారులు వంద శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి' అని మంత్రి పేర్కొన్నారు. అప్సడా కో చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ... 'ఆక్వా రంగానికి ట్రేసబిలిటీ ముఖ్యం. దీనికి ఒక్క మత్స్యశాఖ వల్ల మాత్రమే పరిష్కారం దొరకదు. రెవెన్యూశాఖ కూడా క్లియరెన్సు ఇవ్వాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు, మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్ నాయక్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో అప్సడా పాలకమండలి డైరెక్టర్లుగా దేశంశెట్టి లక్ష్మీనారాయణ, లంకె నారాయణప్రసాద్, గుత్తికొండ వీర్రాజబాబు తదితరులతో మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్ నాయక్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు పాల్గొన్నారు.



రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి పాలకవర్గసభ్యుల ప్రమాణ స్వీకారం

పరకామణిలో దొంగతనం చిన్నచోరీ కాదు



స్వామివారికి వచ్చే కానుకలను ఇప్పటికీ అస్తవ్యస్తంగా నేలపై పోసి లెక్కిస్తున్నారు. అలాకాకుండా బోర్డర్లు ఉన్న టేబుళ్లపై పోసి, లెక్కించే విధానం తీసుకొచ్చే అంశాన్ని టీటీడీ పరిశీలించాలి.

తప్పు చేయడానికి సులభమైన అవకాశం దొరికితే ఎంత ధర్మబద్ధమైన వ్యక్తి అయినా ప్రలోభానికి లోనయ్యే అవకాశం ఉంటుంది. పరకామణిలో లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించే సీసీటీవీలకు ఏఐని జోడించాలి. -హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

అంశాన్ని పరిశీలించాలని టీటీడీకి సూచించింది. దొంగతనాలను అరికట్టేందుకు ప్రస్తుతం ఉన్న భద్రతా వ్యవస్థను మరింత మెరుగుపరచాలని.. లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించే సీసీటీవీలకు ఏఐని జోడించాలని సలహా ఇచ్చింది. దేవస్థానంలో కానుకలు సమర్పించేందుకు ప్రస్తుతం ఉన్న విధానాన్నే కొనసాగించాలని, ఆగమశాస్త్రానికి లోబడి వ్యవహరించాలని స్పష్టం చేసింది. అయితే హుండీ ప్యాకింగ్, పరకామణికి తరలింపు, కానుకలను వేరుచేయడం, వాటి లెక్కింపు విధానాన్ని సాధ్యమైనంత వరకు యాంత్రీకరించాలని టీటీడీకి సూచించింది. మానవ ప్రమేయాన్ని తగ్గించడం ద్వారా దొంగతనాలను కట్టడి చేయవచ్చని తెలిపింది. సేవ పేరుతో కానుకల లెక్కింపునకు కోసం భక్తులను టీటీడీ ఆహ్వానిస్తోందని, వచ్చినవారి దుస్తులు ఊడదీసి డ్రాయర్లపై సోదాలు నిర్వహించడం అమానుష విధానమని తేల్చిచెప్పింది. సేవాభావంతో వచ్చినవారిని దొంగల్లా అనుమానించి, అవమానించడం సబబు కాదని తెలిపింది. శ్రీవారికి వచ్చే కానుకలు పరకామణికి తరలింపు, వాటిని వేరు చేసి లెక్కించే విధానాన్ని ఆధునికీకరించే విషయంలో తగిన సూచనలు, సలహాలతో తమ ముందుకు రావాలని టీటీడీకి, పిటిషనర్‌కు, దర్యాప్తు సంస్థలకు ఆదేశాలిచ్చింది. మరోవైపు.. పరకామణి చోరీ కేసును నిందితుడు రవికుమార్‌తో లోక్‌అదాలత్‌లో రాజీచేసుకున్న టీటీడీ అప్పటి ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్ మరణంపై పోస్టుమార్టం నివేదిక అందితే కోర్టు ఆఫీసర్‌కు అందజేయాలని రిజిస్ట్రీకి స్పష్టం చేసింది. పిటిషన్‌పై తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

ఇదీ కేసు..

పరకామణిలో జరిగిన చోరీకి సంబంధించిన నమోదైన కేసును తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) బోర్డు తీర్మానం, కార్యనిర్వహణాధికారి (ఈవో) అనుమతి లేకుండానే 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్ వద్ద నాటి ఏవీఎస్‌వో వై.సతీశ్‌కుమార్, నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్న వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. అలాగే పరకామణిలో చోరీకి పాల్పడిన సీవీ రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల స్థిర-చరాస్తులు, బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పాటు.. వారు ఆ ఆస్తులను తమ ఆదాయానికి తగినట్లే ఆర్జించారా అనే కోణంలోనూ లోతైన దర్యాప్తు చేయాలని ఏసీబీని నిర్దేశించింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా దర్యాప్తు చేసి సీఐడీ, ఏసీబీ డీజీలు వేర్వేరుగా నివేదికలను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించారు. వీటిని పరిశీలించిన న్యాయస్థానం దర్యాప్తులో భాగంగా సేకరించిన వివరాలను అవసరమైన మేరకు ఆదాయ పన్ను(ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)తో పంచుకోవాలని సీఐడీ, ఏసీబీలను ఆదేశించింది. ఈ వ్యవహారంలో చట్టప్రకారం చర్యలు చేపట్టేందుకు డీజీలిద్దరికీ వెసులుబాటు ఇచ్చింది. సతీశ్‌కుమార్ పోస్టుమార్టమ్ సర్టిఫికెట్ ప్రతిని సీల్డ్ కవర్‌లో రిజిస్ట్రార్(జ్యుడీషియల్)కు అందజేయాలని సీఐడీని ఆదేశించిన విషయం తెలిసిందే. మంగళవారం వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా సీఐడీ దాఖలు చేసిన అదనపు నివేదికలో.. భక్తులు సమర్పించే కానుకలను పరకామణికి తరలించే విధానం, వాటిని వేరు చేసి లెక్కించే విధానంపై జతచేసిన ఫొటోలను కోర్టు పరిశీలించింది. పదే పదే చోరీ ఘటనలు జరుగుతున్నా అదే పాత విధానాన్ని టీటీడీ కొనసాగించడాన్ని తప్పుపట్టింది.

ఆర్థిక నేరాల కేసుల్లో ఎఫ్ఐఆర్ దశలో

షోకాజ్ ఇవ్వక్కర్లేదు

- నోటీసులివ్వలేదన్న కారణంతో కేసును కొట్టివేయలేం: సుప్రీం
- రఘురామరాజు, నారాయణరెడ్డికి ధర్మాసనం స్పష్టీకరణ
- బ్యాంకులు పెట్టిన కేసులో విచారణ ముగింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరాలకు సంబంధించి ఎఫ్ఐఆర్ దశలో షోకాజ్ నోటీసు ఇవ్వాలన్న నిబంధనేమీ లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నోటీసులు ఇవ్వలేదన్న కారణంతో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయడం(కొట్టివేయడం) కుదరదని తేల్చిచెప్పింది. దీంతో తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డిలకు నిరాశే ఎదురైంది. 'రఘురామకృష్ణరాజు థర్మల్ పవర్ కంపెనీ స్థాపిస్తామని బ్యాంకుల నుంచి రూ.974 కోట్లు రుణం తీసుకున్నారు. ఇన్డ్-భారత్ కంపెనీ పేరుతో రుణాలు సేకరించారు. కానీ వాటిని కంపెనీ కోసం ఖర్చు చేయకుండా.. ఇతర బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్లను తనఖా పెట్టి రఘురామ మళ్లీ రుణం తీసుకున్నారు' అని ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డిపై బ్యాంకులు అభియోగాలు మోపాయి. ఆయా బ్యాంకులు గతంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ కేసు నమోదు చేసింది. దర్యాప్తు కొనసాగుతోంది. తమపై ఎఫ్ఐఆర్‌లను క్వాష్ చేయాలని కోరుతూ రఘురామ, నారాయణరెడ్డి 2022 ఆగస్టు 26న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. క్రిమినల్ చర్యలు ప్రారంభించేటప్పుడు లేదా ఎఫ్ఐఆర్ నమోదు చేసే సమయంలో నిందితులకు ముందస్తు వివరణకు అవకాశం కల్పించాల్సిన అవసరం లేదన్నారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు వాదనలు వినిపిస్తూ... తమకు సహజ న్యాయ సూత్రాల ప్రకారం నోటీసు ఇవ్వలేదని, తమ వాదన వినకుండానే కేసులు పెట్టారని తెలిపారు. హైకోర్టులో ఇంకా తుది తీర్పు రాలేదన్నారు. ఫ్రాడ్ డిక్లరేషన్ వల్లే ఎఫ్ఐఆర్ వేశారని.. దానిని కొట్టివేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత.. ఖాతాను ఫ్రాడ్‌గా ప్రకటించే ముందు బ్యాంకులు 'ఆడి అల్టెరమ్ పార్టెమ్ (ప్రత్యర్థి వాదన వినడం)' అనే సూత్రాన్ని పాటించాలని.. అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసే దశలో అది వర్తించదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు నిందితుడికి షోకాజ్ నోటీసు ఇవ్వాలన్న నిబంధనేమీ లేదని వ్యాఖ్యానించింది. అయితే బ్యాంకులు ఇచ్చిన ఫ్రాడ్ డిక్లరేషన్, ఎఫ్ఐఆర్‌లోని ఇతర అంశాలపై ఏమైనా అభ్యంతరాలుంటే కింది కోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. మెరిట్స్ ఆధారంగా అక్కడ వాదనలు వినిపించే స్వేచ్ఛ పిటిషనర్లకు ఉంటుందని చెబుతూ.. కేసు విచారణను ముగించింది.

సహకార సంస్థల్లో అక్రమాలపై

రేపు సభా సంఘం ఫిర్యాదుల స్వీకరణ

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్, డీసీసీబీలు, పీఏసీఎస్‌ల్లో అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్.అమరనాథ్‌రెడ్డి నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో ఏర్పాటైన ప్రత్యేక సభా సంఘానికి ఈ నెల 18వ తేదీన వినతులు, ఫిర్యాదులు సమర్పించవచ్చని రాష్ట్ర శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ఎస్.ప్రసన్నకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలగపూడిలోని శాసన సభ భవన సముదాయంలో ఆరోజు సభా సంఘానికి లిఖితపూర్వకంగా వినతులు, ఫిర్యాదులు సమర్పించాలని సూచించారు. లేదా 'సహాయ కార్యదర్శి, శాసన వ్యవస్థ, సచివాలయం, శాసనసభ భవన సముదాయం, వెలగపూడి, అమరావతి, గుంటూరు జిల్లా, పిన్ కోడ్ 522238' అనే చిరునామాకు పోస్టు ద్వారా పంపవచ్చని. ఫోన్ నంబరు 91-863-2449177 ద్వారా కానీ, ఈ-మెయిల్ ఐడీ apl.apcob@gmail.com ద్వారా కూడా ఫిర్యాదులు, వినతులను పంపవచ్చని సూచించారు.

అన్న వస్తే అరాచకమే!

జగన్ పర్యటనలో కార్యకర్తల అత్యుత్సాహం

- భవానీపురంలో మాజీ సీఎం పర్యటన
- పరామర్శలో సీఎం.. సీఎం.. నినాదాలు
- కార్యకర్తలను తోసేసిన భద్రతా సిబ్బంది
- ఇళ్ల కూల్చివేతపై సీబీఐ విచారణకు జగన్ డిమాండ్
- బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటన

విజయవాడ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్న పరామర్శలకు వస్తాడు. అన్నను చూడగానే తమ్ముళ్లు ఆగరు. సందర్భం ఏదైనా సీఎం... సీఎం... నినాదాలే వినిపిస్తాయి. మాజీ సీఎం వైఎస్ జగన్ ఎక్కడ పర్యటించినా ఇదే తీరు. మంగళవారం విజయవాడ భవానీపురంలోని జోజీనగర్‌కు జగన్ విచ్చేశారు. ఇటీవల ఇక్కడ ఇళ్లు కూల్చివేసిన 42 కుటుంబాలను జగన్ పరామర్శించారు. ఇళ్లు కూల్చేసిన స్థలంలోనే బాధితులు నిరసన దీక్ష చేస్తున్నారు. బెంగళూరు నుంచి గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన జగన్.. అక్కడి నుంచి నేరుగా జోజినగర్‌కు చేరుకుని సుమారు అరగంటపాటు వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా విజయవాడలోని మూడు నియోజకవర్గాల్లో ఉన్న నాయకులతో జోజినగర్‌కు భారీగా కార్యకర్తలను తరలించారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుని శిబిరం వద్దకు చేరుకున్నారు. జగన్ బాధితులను పరామర్శిస్తుంటే నాయకులు, కార్యకర్తలు మాత్రం సీఎం... సీఎం... అంటూ నినాదాలు చేశారు. తోపులాటలో కార్యకర్తలు జగన్ వాహనంపై పడడంతో ఆయన భద్రతా సిబ్బంది వారిని తోసేశారు. కొంతమంది కార్యకర్తలపై చేయి చేసుకున్నారు.

నేతల నగదు, సెల్‌ఫోన్లు చోరీ..

జగన్ పర్యటనలో పలువురు నేతల నగదు, సెల్‌ఫోన్‌లు చోరీ అయ్యాయి. కరెంటు ఆఫీసు రోడ్డులో కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ముఖ్య నేతలు, ప్లాట్ల యజమానులు, వారి కుటుంబ సభ్యులను మాత్రమే శిబిరం వద్దకు అనుమతించారు. అయినా, కార్యకర్తలు తోసుకుంటూ శిబిరం వద్దకు చేరుకునే క్రమంలో కొందరు నేతల నగదు, సెల్‌ఫోన్‌లు చోరీకి గురయ్యాయి. ఓ వ్యాపారికి చెందిన రూ.35 వేల నగదు, మరో నలుగురి సెల్‌ఫోన్లు తస్కరణకు గురయ్యాయి.

కూల్చివేతలో కేశినేని చిన్ని పాత్ర: జగన్

బాధితులను పరామర్శించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ ఇళ్ల కూల్చివేత వెనుక విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, జనసేన కార్పొరేటర్ సోదరుడి పాత్ర ఉందని ఆరోపించారు. బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కుటుంబాలకు సుప్రీంకోర్టు ఈనెల 31 వరకు ఊరటను ఇచ్చినప్పటికీ ప్రభుత్వ పెద్దలు పోలీసులను అడ్డుపెట్టుకుని ఇళ్లను కూల్చివేశారన్నారు. పోలీసులు ప్రైవేటు పార్టీకి మద్దతు తెలిపారని ఆరోపించారు. ఈ ఇళ్లకు వీఎంసీ అనుమతి ఇవ్వడంతోపాటు బ్యాంకులు రుణాలు ఇచ్చాయన్నారు. వేరొకరి స్థలంలో ఇళ్లు నిర్మిస్తే అనుమతులు, రుణాలు, విద్యుత్, కుళాయి కనెక్షన్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, లోకేశ్‌ను రెండుసార్లు కలిసినా వారికి న్యాయం జరగలేదన్నారు. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే విచారణ జరుగుతుందన్నారు.

అగ్రిగోల్డ్ ఇప్పుడు వద్దులే

జోజీనగర్‌కు వచ్చిన జగన్‌కు తన సమస్యను చెప్పుకొనేందుకు అగ్రిగోల్డ్ బాధితురాలు ప్రయత్నించారు. అయితే.. అగ్రిగోల్డ్ ఇప్పుడు వద్దులే అంటూ ఆమె విజ్ఞప్తిని జగన్ తిరస్కరించారు. ఆమె వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా.. 'అగ్రిగోల్డ్ సమస్యా... టాపిక్ డైవర్ట్ అవుతుంది. ఇప్పుడు వద్దులే' అని జగన్ వ్యాఖ్యానించారు.



మీడియాతో మాట్లాడుతున్న జగన్

ఏడాదిలో 820 ఎకరాల

వక్ఫ్ భూమిని రక్షించాం

- 650 కోట్లు విలువైన 89 అక్రమ సేల్ డీడ్లు రద్దు
- ఆదాయం పెంపునకు ఈ టెండరింగ్ అమలు
- ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

విజయవాడ(వన్‌టౌన్), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'ఏపీ వక్ఫ్‌బోర్డు ఏడాదికాలం పనితీరు దేశానికే ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 953 నోటీసులు జారీచేసి, 820 ఎకరాల వక్ఫ్ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టాం' అని వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్‌లోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ఆయన అధ్యక్షతన 9వ బోర్డు సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అజీజ్ మాట్లాడారు. 'వక్ఫ్ పాలనలో పూర్తిస్థాయి పారదర్శకత, చట్టబద్ధత, బాధ్యతాయుత పరిపాలన తీసుకొచ్చాం. వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకున్నాం. కర్నూలు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు రూ.650 కోట్ల విలువైన వక్ఫ్ భూమి విషయంలో జరిగిన 89 అక్రమ సేల్ డీడ్లను రద్దు చేయించాం. వక్ఫ్ బోర్డు చరిత్రలో తొలిసారిగా ఈ-టెండరింగ్ విధానం అమలు చేసి హుండీలు, వాణిజ్య ఆస్తుల ద్వారా గణనీయమైన ఆదాయం సమకూర్చాం. గత ఏడాదితో పోలిస్తే రూ.3.50 కోట్ల అదనపు ఆదాయం సాధించి, దాదాపు 46 శాతం ఆదాయ వృద్ధి నమోదు చేశాం. సంక్షేమ రంగంలో భాగంగా ఇమామ్‌లు, మౌజాన్లకు పెండింగ్ ఉన్న 18 నెలల గౌరవ వేతనాలను రూ.1.35 కోట్లతో పూర్తిగా చెల్లించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్, మంత్రి లోకేశ్ సహకారంతో వక్ఫ్ బోర్డును మరింత బలోపేతం చేస్తాం' అని అజీజ్ తెలిపారు.



ఆదాయం వచ్చేలా రుషికొండపై నిర్ణయం

▸▸ మంత్రుల వెల్లడి.. సచివాలయంలో క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖకు ఆదాయం వచ్చేలా, ప్రజలకు ఉపయోగపడేలా రుషికొండ ప్యాలె్స్‌పై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఈ ప్యాలె్స్‌ను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై నిర్ణయం తీసుకునేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ మంగళవారం అమరావతి సచివాలయంలో భేటీ అయింది. గత భేటీలో సూచనల మేరకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని పర్యాటక శాఖ అధికారులు దాని ముందుంచారు. సమావేశం ముగిశాక మంత్రులు మీడియాతో మాట్లాడారు. 'గత ప్రభుత్వం రుషికొండపై ఏడు బ్లాకలతో, 19,968 చదరపు మీటర్లలో రాజప్రసాదం లాంటి ప్యాలె్స్‌ను నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. దానివల్ల ప్రస్తుతం ప్రతి నెలా రూ.25-30 లక్షలు నిర్వహణ చార్జీల భారం పడుతోంది. ఇప్పటికే టాటా, అట్మాస్ఫియర్ కోర్, హెచ్‌సీఎల్, హెచ్‌ఈఐ హోటల్స్ తదితర సంస్థలు ప్యాలెస్ వినియోగంపై తమ అభిప్రాయాన్ని తెలిపాయి. మరికొన్ని విదేశీ సంస్థలు కూడా వ్యక్తీకరణలో పాలుపంచుకున్నాయి. సాధ్యమైనంత త్వరగా మరోసారి భేటీ అవుతాం. 2-3 ప్రతిపాదనలు క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్తాం. అనంతరం సీఎం సూచనల మేరకు తుది నిర్ణయం తీసుకుంటాం' అని వివరించారు.

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

▸▸ రూ.25 కోట్లతో 76 గోకులాలు..: మంత్రి సంధ్యారాణి



అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక కార్యక్రమాలు అమలు చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం సచివాలయంలో అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. గిరిజన కుటుంబాల జీవనోపాధి మెరుగుదలతో పాటు ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో 76 గోకులాల ఏర్పాటుకు రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రతి గోకులానికి 20 పశువుల పంపిణీ ద్వారా 10 మంది లబ్ధిదారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. గిరిజన రైతుల వ్యవసాయాభివృద్ధి కోసం రూ.19 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి సివిల్స్, బ్యాంకులు, రైల్వేలు, యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ వంటి జాతీయ స్థాయి ఉద్యోగాలకు అర్హత సాధించేలా స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆర్టికల్ 275 కింద మంజూరైన నిధుల నుంచి పాడేరు ఐటీడీఏకు రూ.7 కోట్లు మంజూరు చేసి, జీకే వీధి, జీమాడుగుల ప్రాంతాల్లో ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్లకు అనుమతులిచ్చి తక్షణమే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అనకాపల్లి జిల్లా మకవరపు పాలెం మండలం సెట్టిపాలెం గ్రామంలో 11.85 ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్ల వ్యయంతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎరుకులాల్లో 324 మంది సిబ్బంది, ఆశ్రమ పాఠశాలల్లో 709 మంది వంట సిబ్బంది, 1,080 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.60 కోట్లు వ్యయం చేస్తున్నామని వివరించారు.

పేద విద్యార్థుల కలల సాకారానికి స్టడీ సర్కిళ్లు

▸▸ 340 మందికి సివిల్స్‌లో ఉచిత శిక్షణ: మంత్రి డోలా



అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'ఐఏఎస్ కావాలన్న పేద విద్యార్థుల కలను సాకారం చేసేందుకే అంబేడ్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్ ఉచిత శిక్షణ ఇస్తున్నాం' అని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం విజయవాడ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్ ఉచిత శిక్షణను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'గత వైసీపీ ప్రభుత్వం అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లను నిర్వీర్యం చేసింది. రాష్ట్రంలో విజయవాడ, విశాఖ, తిరుపతిలోని అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో 340 మందికి సివిల్స్ ఉచిత శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ కాలంలో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తున్నాం. విశాఖ కేంద్రంగా రాష్ట్రంలోని అభ్యర్థులందరికీ సివిల్స్ ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది' అని తెలిపారు. కాగా రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, అంబేడ్కర్ గురుకులాల విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతపై రాజీపడొద్దని మంత్రి డోలా సంబంధిత అధికారులను ఆదేశించారు.

జంబోరి డైమండ్ జూబ్లీ విజేతలకు అభినందనలు

లక్నోలో నవంబరు 23 నుంచి 29 వరకు జరిగిన 19వ జాతీయ జంబోరి డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొని బ్యాండ్, మార్చ్‌ఫాస్ట్, క్యాంప్ క్రాఫ్ట్ పోటీల్లో జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించిన తాడేపల్లిగూడెం కడకట్ల అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులను మంత్రి డోలా అభినందించారు. మంగళవారం సచివాలయంలో గురుకుల ప్రిన్సిపాల్ రాజారావు ఆధ్వర్యంలో విద్యార్థులు మంత్రిని కలిశారు.

మోదీ అభినవ గాడ్సే: షర్మిల



అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'బాపూజీ పేరు మార్చాలని చూసే ప్రధాని నరేంద్ర మోదీ అభినవ గాడ్సే. నాథూరామ్‌కి వారసుడు' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. 'నాడు గాడ్సే మహాత్ముడిని భౌతికంగా హత్య చేస్తే... నేడు బాపూజీ పేరు తొలగించి గాంధీజీ ఆశయాలను, స్వాతంత్ర్యపు లక్ష్యాలను, నేర్పిన సిద్ధాంతాలను తుడిచిపెట్టి మోదీ మరో హత్య చేస్తున్నారు. ఉపాధి హామీ పథకానికి జాతిపిత పేరు మార్చాలని చూడడం దేశద్రోహపు చర్యే. రాష్ట్ర ఎంపీలు పార్లమెంటులో ఈ బిల్లును వ్యతిరేకించాలి' అని మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాగా.. మహాత్మాగాంధీ పేరంటే అంత ద్వేషమెందుకని ప్రధాని మోదీని పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు.

ల్యాండవుతున్న విమానాన్ని ఢీకొన్న పక్షి

▸▸ శంషాబాద్ విమానాశ్రయంలో తప్పిన పెను ప్రమాదం

▸▸ ఎయిర్‌హోస్టెస్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రయాణికుడిపై కేసు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతున్న విమానాన్ని పక్షి ఢీకొట్టింది. అయితే పైలెట్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. చెన్నై నుంచి వస్తున్న ఇండిగో 6ఈ 562 విమానం సోమవారం సాయంత్రం 6.48 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా పక్షి ఢీకొట్టింది. పైలెట్ చాకచాక్యంగా వ్యవహరించి విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానంలో ఎయిర్‌హోస్టెస్‌తో ఓ ప్రయాణికుడు అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ సంపతి కనకయ్య వివరాల ప్రకారం.. ఈ నెల 13న దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న విమానంలో బాలకృష్ణన్‌రమేష్ (58) అనే ప్రయాణికుడు తన పట్ల దురుసుగా, అసభ్యంగా ప్రవర్తించారని ఎయిర్‌హోస్టెస్.. ఆర్జీఐఏ ఔట్‌పోస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచారు.



మచిలీపట్నంలో అటల్ సందేశ్- మోదీ సుపరిపాలన యాత్రలో మంత్రి లోకేశ్, బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్, సుజనా, కొల్లు రవీంద్ర, తదితరులు

వాజపేయి - చంద్రబాబుది తండ్రీకొడుకుల బంధం

▸▸ 'అటల్ - మోదీ..' యాత్రలో లోకేశ్ వెల్లడి.. బందరులో మాజీ ప్రధాని విగ్రహావిష్కరణ

మచిలీపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ ప్రధాని వాజపేయి కుమారుడిలా చూసుకున్నారని, వారిది తండ్రీ కొడుకుల బంధమని మంత్రి లోకేశ్ అన్నారు. నైతిక విలువలకు లోబడి రాజకీయాల్లో రాణించిన గొప్ప నేత వాజపేయి అని కొనియాడారు. అటల్-మోదీ సుపరిపాలనా యాత్ర మంగళవారం కృష్ణా జిల్లా మచిలీపట్నం చేరుకుంది. ఈ సందర్భంగాబైపాస్‌రోడ్డు సెంటరులో ఏర్పాటుచేసిన వాజపేయి విగ్రహాన్ని లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా శాసనసభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, మత్స్యకారుల గ్రామంగా ఉన్న సింగపూర్‌ను అభివృద్ధి చేసిన ఆ దేశ ప్రధానిని, భారతదేశానికి ప్రధానిగా పనిచేసిన వాజపేయిని తాను ఆదర్శంగా తీసుకుంటానన్నారు. 13 రోజుల వ్యవధిలోనే ప్రధాని పదవిని కోల్పోవలసి వచ్చినా, నైతిక విలువలను పాటించి వాజపేయి రాజీనామా చేశారని అన్నారు. ఆయన బాటలోనే... పాఠశాలల్లో ప్రతి శనివారం విద్యార్థినీవిద్యార్థులకు నైతిక విలువలను బోధించేలా ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు వాజపేయి నిత్యం అండదండగా ఉన్నారని తెలిపారు. 'ఇప్పుడు డబుల్ ఇంజన్ సర్కార్ అంటున్నాం. కానీ, 1983 నుంచే ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ అమలవుతోంది' అని వ్యాఖ్యానించారు. వాజపేయి బాటనే ప్రధాని మోదీ అనుసరిస్తున్నారన్నారు. వాజపేయి శతజయంతి సందర్భంగా మంగళగిరిలో ఆయన భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్‌రాజా, సుజనా చౌదరి, కాగిత కృష్ణప్రసాద్, వెనిగండ్ల రాము, బోడె ప్రసాద్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

22న విజయవాడలో క్రిస్మస్ హైటీ

▸▸ ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు



అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకల్లో భాగంగా విజయవాడలోని ఏ-ప్లస్ కన్వెన్షన్‌లో ఈ నెల 22న క్రిస్మస్ హైటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు హాజరవుతారని, పొరపాట్లు లేకుండా ఎన్టీఆర్ కలెక్టర్ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు.

మేము మిస్సైళ్లం!

(మొదటి పేజీ తరువాయి)

జీఎంఆర్-మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీని ప్రపంచానికి ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఎడ్యుసిటీకి భూములిచ్చిన మాన్సాస్ ట్రస్టు, జీఎంఆర్ గ్రూపు మధ్య మంగళవారం విశాఖపట్నం రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన అవగాహన ఒప్పంద (ఎంవోయూ) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం వద్ద 136.63 ఎకరాల్లో జీఎంఆర్ అభివృద్ధి చేసే ఎడ్యుసిటీకి మాన్సాస్ ట్రస్టు రూ.వందల కోట్ల విలువ చేసే తన భూములను ఉచితంగా ఇచ్చిందని, ఇది పూసపాటి వంశీయుల ఉదారతకు నిదర్శనమని కొనియాడారు. ఇందుకు గోవా గవర్నర్ అశోక్‌గజపతి రాజు, విజయనగరం టీడీపీ ఎమ్మెల్యే అదితి గజపతి రాజులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి యువ నాయకులంతా మిస్సైళ్లలా పనిచేస్తుంటే.. సీనియర్ నాయకులు జీపీఎస్‌లా మార్గదర్శకత్వం చేస్తున్నారని తెలిపారు. 'సీఎం చంద్రబాబు, అశోక్ గజపతిరాజు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు జీపీఎస్‌ఎలైతే.. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అదితి, నేను మిస్సైళ్లం' అని స్పష్టంచేశారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్రల్లో అక్కడి వనరులకు తగిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.విజయనగరం పూసపాటి రాజుల కుటుంబం నుంచి ఏవియేషన్ రంగంలోకి వెళ్లిన అలక్ నారాయణ్ పైలట్‌గా పనిచేశారని, ఆయన పేరుతోనే మాన్సాస్ విద్యా సంస్థల ట్రస్టును ఏర్పాటు చేశామని అశోక్‌గజపతిరాజు చెప్పారు. ఇంతకు ముందు చంద్రబాబు, ఎర్రన్నాయుడు, తాను కలిసి టీమ్ వర్క్‌తో పనిచేశామని.. ఇప్పుడా బాధ్యతను లోకేశ్, రామ్మోహన్‌నాయుడు, అదితిలకు అప్పగించామన్నారు. ఒప్పంద పత్రాలను జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ చైర్మన్ బీజీఎస్ రాజు, మాన్సాస్ ట్రస్టు తరపున అదితి మార్చుకున్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. లోకేశ్ ఇంకా ఏమన్నారంటే..



గోవా గవర్నర్ అశోక్ గజపతితో లోకేశ్, రామ్మోహన్ సరదా సంభాషణ

భోగాపురంలో అనుకున్నాం..

ముందుగా భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనుకున్నాం. ఆ చర్చలు జరుగుతున్న సమయంలో విశాఖ టీడీపీ కార్యాలయానికి ఎమ్మెల్యే అదితి ఒక మ్యాప్ తీసుకుని వచ్చారు. భోగాపురం ప్రాంతంలో మాన్సాస్ ట్రస్టుకు చెందిన భూములను అందులో చూపించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఎడ్యుసిటీని ఏర్పాటు చేస్తే ట్రస్టు భూములు ఉచితంగా ఇస్తామన్నారరు. ఇది చాలా ఆశ్చర్యం కలిగించింది. వాటి విలువ రూ.వందల కోట్లు ఉంటుంది. కానీ ప్రజలకు ఉపయోగపడుతుందని ఉచితంగా ఇస్తామన్నారు. అది వారి గొప్పతనం. అయితే ఒకరోజు సీఎం కార్యదర్శి ఫోన్ చేసి.. ఉచితంగా భూమి ఇస్తున్నట్లు ఫైలులో రాశారు.. అలా కుదరదు.. కనీస ధర ఎంతో కొంత తీసుకుంటే బాగుంటుందని సూచించారు. ఇదే విషయం అదితికి చెబితే ఒక్క రూపాయి కూడా తీసుకోబోమని, ఉచితంగా ఇస్తామన్నారు. సంస్థకు మాన్సాస్ పేరు పెడితే చాలని చెప్పారు. ఏవియేషన్ వర్సిటీపై సీఎంను కలిసినప్పుడు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలు ఉండాలని, అన్ని విభాగాలకూ అవకాశం ఉండాలన్నారు. దాంతో ప్రతి విభాగానికో వర్సిటీని ఎడ్యుసిటీలో ఏర్పాటు చేయబోతున్నాం. ప్రపంచానికి అవసరమైన పౌరవిమానయాన సిబ్బందిలో 25 శాతాన్ని మన రాష్ట్రం నుంచే అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశంలోని ఏవియేషన్ వర్క్‌ఫోర్స్‌లో కనీసం 70 శాతం తెలుగువారు ఉండాలి. ఎడ్యుసిటీ పనులు వచ్చే ఫిబ్రవరిలో మొదలుపెట్టి ఏడాదిలో పూర్తి చేయాలనేది లక్ష్యం.

99 పైసలకు భూమి ఇవ్వడం వల్లే..

ఎకరా భూమి 99 పైసలకే ఇస్తే చాలామంది విమర్శలు చేశారు. అయితే దాని వల్లే టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు ఏపీకి వచ్చాయి. ఇంకో మూడు నెలల్లో మరో రెండు పెద్ద కంపెనీలు విశాఖకు వస్తాయి. విద్యారంగాన్ని, పరిశ్రమలతో అనుసంధానం చేసి వాటికవసరమైన వర్క్ ఫోర్స్‌ను అందిస్తాం. యువత చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగంలో చేరేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇస్తాం. రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ముందుచూపు లేనివారంతా విజన్ కలిగిన వారిని ఎగతాళి చేస్తున్నారు. అలాంటి వారిని పట్టించుకోవలసిన అవసరం లేదు. హైదరాబాద్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి రూపకర్త చంద్రబాబే. దానికి అప్పట్లో ఐదు వేల ఎకరాలు అవసరమా అని అనుమానాలు వ్యక్తంచేశారు. చెన్నై, బెంగుళూరు వంటి నగరాలు రెండో విమానాశ్రయం నిర్మించుకుంటున్నాయి. హైదరాబాద్‌కు ఆ అవసరం లేకుండా చంద్రబాబు చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఒక్కటే ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర జీడీపీలో 12 శాతం సమకూరుస్తోంది.

ఎంవోయూకు ప్రభుత్వం అనుమతి

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ'కి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీని నిర్మాణానికి అవసరమైన 136.63 ఎకరాల భూమిని మాన్సాస్ ట్రస్టు నుంచి కేటాయించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్-అఫీషియో కార్యదర్శి హరిజవహర్ లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీఎంఆర్‌తో ఎంవోయూ కుదుర్చునేందుకు ట్రస్టు తరపున దేవదాయ శాఖ కమిషనర్, ఈవోకు అనుమతిచ్చింది. ఎడ్యుసిటీకి కేటాయించిన భూములను కేటాయించిన ఆ ప్రాజెక్టుకే ఉపయోగించాలని.. అలా కాని పక్షంలో భవిష్యత్‌లో ఆ భూములు మొత్తం తిరిగి మాన్సాస్ ట్రస్టుకు చెందేలా ఎంవోయూలో పొందుపరిచారు.

కొలిక్కి వచ్చిన కసరత్తు!

▸▸ టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుల జాబితా సిద్ధం

▸▸ రెండు, మూడు రోజుల్లో అధికారికంగా ప్రకటన

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుల నియామకం దాదాపు కొలిక్కి వచ్చింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు మంగళవారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పలువురు మంత్రులు, సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. పల్లా సిద్ధం చేసిన జాబితాను పరిశీలించారు. కూర్పు బాగుందని, మరొక్కసారి పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తీసుకుని రెండు, మూడు రోజుల్లో తుది జాబితా ఖరారు చేద్దామని పేర్కొన్నారు. మంగళవారం సిద్ధం చేసిన జాబితా ప్రకారం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుల్లో సీనియర్లతో పాటు సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం కల్పించారు. సుమారు 10 మంది సీనియర్లకు అవకాశం దక్కింది. ఈ జాబితాలో పదిమంది ఓసీలు, 9మంది బీసీలు, నలుగురు ఎస్సీలు, ఒక ఎస్టీ, ఒక మైనార్టీకి అవకాశం లభించనుంది. ఓసీల్లో నలుగురు కమ్మ, ముగ్గురు కాపులు, ఇద్దరు రెడ్లు, ఒక రాజు ఉన్నారు. పార్లమెంటరీ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న వారిలో బడేటి రాధాకృష్ణ, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎంఎస్ రాజు, కాల్వ శ్రీనివాసులు ఎమ్మెల్యేలు కాగా, బీద రవిచంద్ర యాదవ్ ఎమ్మెల్సీ. పిల్లి మాణిక్యాలరావు (లిడ్‌క్యాప్ చైర్మన్), వీరంకి గురుమూర్తి (గౌడ కార్పొరేషన్ చైర్మన్), కోట్ని బాలాజీ (డీసీఎంఎస్ చైర్మన్), బొడ్డు వెంకట రమణ చౌదరి (రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్), మంతెన రామరాజు (ఏపీఐఐసీ చైర్మన్), సలగల రాజశేఖర్ (బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్), మన్నే సుబ్బారెడ్డి (విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్) నామినేటెడ్ పదవుల్లో ఉన్నారు.

సీనియార్టీ.. విధేయతకు ప్రాధాన్యం

- రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడిగా పరిశీలనలో ఉన్న సుగవాసి ప్రసాద్ తొలి నుంచీ టీడీపీనే అంటిపెట్టుకుని ఉన్నారు. ఆయన సోదరుడు సుగవాసి సుబ్రహ్మణ్యానికి 2024లో రాజంపేట ఎమ్మెల్యేగా టీడీపీ అవకాశం ఇచ్చింది. ఆయన ఓటమి పాలై ఆ తర్వాత వైసీపీలో చేరారు. ప్రసాద్ మాత్రం పదవులతో సంబంధం లేకుండా పార్టీనే నమ్ముకుని ఉన్నారు. సీనియార్టీ, విధేయత, సామాజిక సమీకరణాలు కలిసి రావడంతో ఆయన్ను పదవి వరించింది.
- కడప పార్లమెంటు అధ్యక్ష పదవికి పరిశీలనలో ఉన్న భూపేశ్ సుబ్బరామిరెడ్డి.. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సోదరుడి కుమారుడు. 2024 ఎన్నికల్లో కడప పార్లమెంటు స్థానం నుంచి వైఎస్ అవినాశ్ రెడ్డి, షర్మిలపై టీడీపీ తరపున పోటీ చేసి గట్టి పోటీ ఇచ్చారు. 2019లో 3.77 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచిన అవినాశ్‌ను 2024 ఎన్నికల్లో 62వేల మెజార్టీకి పరిమితం చేశారు.
- నంద్యాల పార్లమెంటు అధ్యక్ష పదవికి పరిశీలనలో ఉన్న మన్నే సుబ్బారెడ్డి పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా చేశారు. 2024 ఎన్నికల్లో డోన్ నుంచి ఎమ్మెల్యే సీటు ఆశించారు. చివరి నిమిషంలో కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డికి టికెట్ ఇవ్వడంతో సుబ్బారెడ్డికి అవకాశం దక్కలేదు.
- శ్రీకాకుళం పార్లమెంటు అధ్యక్షుడిగా పరిశీలనలో ఉన్న మొదలవలస రమేశ్ పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలోనే ఉన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని నేతలందరితో కలుపుగోలుగా ఉండటం, సీనియార్టీ ఆయనకు కలిసి వచ్చింది.
- విజయనగరం పార్లమెంటు అధ్యక్షుడిగా పరిశీలనలో ఉన్న కిమిడి నాగార్జున మాజీ మంత్రి, సీనియర్ టీడీపీ నాయకురాలు కిమిడి మృణాళిని తనయుడు. ఎమ్మెల్యే, సీనియర్ టీడీపీ నాయకుడు కిమిడి కళావెంకట్రావు సోదరుడి కుమారుడు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణపై గట్టిగా పోరాడటం నాగార్జునకు కలిసి వచ్చింది.
- మంతెన రామరాజు ఏపీఐఐసీ చైర్మన్‌గా ఉన్నారు. ఉండి మాజీ ఎమ్మెల్యేగా చేశారు. ప్రస్తుతం నరసాపురం పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. రఘురామరాజు కోసం సీటు త్యాగం చేశారు.

వీరిపై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి

అరకు పార్లమెంటు అధ్యక్షురాలిగా పరిశీలనలో ఉన్న తేజోవతి.. పార్టీ నేతలందరినీ కలుపుకొనిపోరని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొరని శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. చిత్తూరు పార్లమెంటు పరిధిలో చాలామంది టీడీపీ నాయకులకు అసలు షణ్ముగం రెడ్డి పేరే తెలియదని, అలాంటి వ్యక్తికి సామాజిక సమీకరణల్లో భాగంగా అధ్యక్ష పదవి ఇవ్వడం సమంజసం కాదనే వాదన ఉంది. కర్నూలులో మైనార్టీ కోటాలో తెరపైకి వచ్చిన షేక్ వహీద్ హుస్సేన్ విషయంలోనూ అసంతృప్తి ఉంది. అమలాపురం అధ్యక్ష పదవికి పరిశీలనలో ఉన్న గుత్తుల సాయి వివాదారహితుడైనా.. పార్టీని ఎంత వరకు నడుపుతారనేది అనుమానమేనని నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. అనకాపల్లి నుంచి కోట్ని బాలాజీకి జిల్లా స్థాయిలో అందరు నేతలను కలుపుకొని వెళ్లే సత్తా లేదని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. లోకేశ్‌కు సన్నిహితంగా ఉండటం ఆయనకు కలిసొచ్చింది. విశాఖ అధ్యక్షుడిగా పరిశీలనలో ఉన్న చోడే వెంకట పట్టాభిరామ్ సీనియర్ అయినా పార్టీ శ్రేణుల్లో సానుకూలత లేదు.

టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు (అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది)

శ్రీకాకుళం	మొదలవలస రమేశ్
విజయనగరం	కిమిడి నాగార్జున
అరకు	మోజోరు తేజోవతి
విశాఖపట్నం	చోడే వెంకట పట్టాభిరామ్
అనకాపల్లి	కోట్ని బాలాజీ
కాకినాడ	జ్యోతుల నవీన్
రాజమండ్రి	బొడ్డు వెంకటరమణ చౌదరి
అమలాపురం	గుత్తుల సాయి
ఏలూరు	బడేటి రాధాకృష్ణ(చంటి)
నరసాపురం	మంతెన రామరాజు
విజయవాడ	గద్దె అనురాధ
మచిలీపట్నం	వీరంకి గురుమూర్తి
నర్సరావుపేట	కొమ్మాలపాటి శ్రీధర్
గుంటూరు	పిల్లి మాణిక్యాలరావు
బాపట్ల	సలగల రాజశేఖర్
ఒంగోలు	ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి
నెల్లూరు	బీద రవిచంద్ర
కర్నూలు	షేక్ వహీద్ హుస్సేన్
నంద్యాల	మన్నే సుబ్బారెడ్డి (ధర్మవరం సుబ్బారెడ్డి)
రాజంపేట	సుగవాసి ప్రసాద్
హిందూపురం	ఎంఎస్ రాజు
అనంతపురం	కాల్వ శ్రీనివాసులు
కడప	చదిపిరాళ్ల భూపేశ్ సుబ్బరామిరెడ్డి
తిరుపతి	పనబాక లక్ష్మి
చిత్తూరు	షణ్ముగం రెడ్డి

గుంతలు పూడ్చడానికి సింగిల్ బిడ్ అయినా ఓకే..!

▸▸ మార్చి నాటికి పనుల పూర్తే లక్ష్యం.. పాట్ హోల్ రిపేర్లకు మాత్రమే వర్తింపు

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో గుంతలు లేని రహదారులను పూర్తి చేసేందుకు రహదారులు-భవనాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. టెండర్ల నిబంధనలను సడలించాలని ప్రతిపాదనలను పంపించింది. మార్చి నాటికి రాష్ట్రంలోని రహదారులపై గుంతలన్నింటినీ పూడ్చాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇందుకు సంబంధించిన టెండర్లు త్వరితగతిన పూర్తిచేసి పనులను కాంట్రాక్టర్లకు అప్పగించాలి. అయితే, కాంట్రాక్టర్లు క్షేత్రస్థాయిలో సమస్యలెదుర్కొంటున్నారు. ఇందులో ఒకటి సకాలంలో బిల్లుల చెల్లింపు, రెండోది స్థానిక ఒత్తిళ్లు. ఆర్అండ్‌బీలో ప్రస్తుత నిబంధనల ప్రకారం... ఏ పనికైనా కనీసం రెండు లేదా మూడు బిడ్లు రావాలి. అలా వచ్చిన వాటిల్లో ఎల్1గా ఉన్నవారికే టెండర్ ఇస్తారు. అయితే, జగన్ ప్రభుత్వంలో రహదారి పనులు పెద్దగా జరగలేదు. ఏవో కొన్ని చేపట్టినా వాటికీ బిల్లులు ఇవ్వలేదు. దీంతో కొత్తగా ఆర్అండ్‌బీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో వారిలో మనోధైర్యం కల్పించేందుకు ప్రతీ నెలా బిల్లులు చెల్లించేలా విధాన నిర్ణయం తీసుకోవాలని ఆర్అండ్‌బీ ప్రత్యేక సీఎస్ ఎం.టి.కృష్ణబాబు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఆర్థిక శాఖ దీన్ని పరిశీలిస్తోంది. సీఎం దీని అమలుకు సానుకూలంగా ఉన్నారు. ఇక నిర్ణయం తీసుకోవడమే మిగిలింది. అలాగే కాంట్రాక్టర్లకు మరింత భరోసా ఇచ్చేందుకు గుంతలు పూడ్చే (పాట్ హోల్ రిపేర్) వర్క్‌లకు ఒక కాంట్రాక్టర్ బిడ్ దాఖలు చేసినా ఆమోదించాలని ఆర్అండ్‌బీ ప్రతిపాదించింది. సీఎం ఆదేశాల మేరకు మార్చి నాటికి గుంతలు పూడ్చే పనులు పూర్తిచేసేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కృష్ణబాబు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఈ విధానాన్ని కేవలం గుంతలు పూడ్చే పనులకే వర్తింపచేస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణ దావాను పరిగణనలోకి తీసుకోవద్దు

▸▸ నల్లమలసాగర్‌పై సుప్రీంలో నేడు ఏపీ కేవియట్

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను తయారు చేయకుండా అడ్డుకోవాలంటూ సుప్రీంకోర్టులో తెలంగాణ దాఖలుచేసిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవద్దని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరనుంది. ఈ మేరకు బుధవారం కేవియట్ పిటిషన్ వేయాలని నిర్ణయించింది. ఈ నెల 19వ తేదీ నుంచి సుప్రీంకోర్టుకు సెలవులు ఉన్నందున బుధవారమే ఈ పిటిషన్ దాఖలు చేయాలని అంతర్రాష్ట్ర జల వివాద విభాగం, కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్లు సుగుణాకరరావు, రాంబాబులను ప్రభుత్వ ప్రత్యేక సీఎస్ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. అడ్వకేట్ ఆన్ రికార్డ్ (ఏఓఆర్) గుంటూరు ప్రమోద్‌కుమార్ కేవియట్ దాఖలుచేస్తారు. కృష్ణా జలాల పునఃపంపిణీపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట రాష్ట్రం తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తాకే నల్లమలసాగర్ కేసును రాష్ట్రప్రభుత్వం అప్పగించింది. కాగా.. ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్‌లు తయారు చేసుకోవడం రాష్ట్రాల ప్రాథమిక హక్కు అని.. అలా చేయకుండా ఏపీపై తెలంగాణ అజమాయిషీ చెలాయించాలని చూడడం ఏమిటని రాష్ట్ర జలవనరుల శాఖ, సాగునీటి నిపుణులు ఆక్షేపిస్తున్నారు. డీపీఆర్ తయారీని కూడా అడ్డుకునేందుకు తెలంగాణ ప్రయత్నించడాన్ని మొగ్గలోనే నివారించకపోతే భవిష్యత్‌లో రాష్ట్రానికి నీటి కష్టాలు తప్పవని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. వాస్తవానికి తెలంగాణ కేసు వేయకముందే కేవియట్ వేయాలని జలవనరుల శాఖ సూచించగా.. అలాచేస్తే సుప్రీంకోర్టు దానిని ఊహాజనితమైన వాదనగా భావించి కొట్టివేసే వీలుందని జైదీప్ గుప్తా తెలియజేశారు. దీంతో జల వనరుల శాఖ ఒక రోజు ఆగింది. మంగళవారం ఉదయం తెలంగాణ ప్రభుత్వం ఆన్‌లైన్‌లో సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో.. దానికి దీటుగా వకాలత్ పేపర్లన్నిటినీ సిద్ధం చేసుకున్న ఆ శాఖ అధికారులు బుధవారం కేవియట్ వేస్తున్నట్లు అధికారికంగా వెల్లడించారు.

ఏజీఐసీఎల్ ఎండీగా సొంటి శ్రీనివాస్

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏజీఐసీఎల్) మేనేజింగ్ డైరక్టర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సొంటి వెంకటరత్న శ్రీనివాస్‌ను నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ సీఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ ఆమోదించిన ప్రాజెక్టులకు సంబంధించి సవివర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ సంస్థ పనిచేస్తుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.